సాధన సుబోధిని

ప్రథమ భాగము



రచయిత :
" ఆయుర్వేద భిషక్ "
డాక్టర్. బి.వి. రాజు

ప్రథమ ముద్రణము :

ఫిబ్రవరి, 1999

ప్రతులు : 1000

వెల : రూ. 20/-

ప్రతులకు :

డాక్టరు. **బి.వి. రాజు**

రాజ్ క్లినిక్,


తుని - 533 401. ఫోన్ : 53865

ముద్రణము :

సాయినాథ్ డి.టి.పి. పాయింట్

జండాపంజారోడ్, రాజమండ్రి.

ఫోన్ : 478943 పి.పి.



చ॥ తిరుమల కొండపై వెలసి దివ్యమహత్వము గోచరింపగా
నిరతము భక్త సంఘములు నీవరనామమునుచ్చరింప స
ద్వరముల నిచ్చి బ్రోచుకృపాయత చిత్తుడవంచు నిన్ననే
పరి పరి ప్రస్తుతించెదను భక్త వశంకర! వేంకటేశ్వరా!

This book is published with the

Financial Assistance of

TIRUMALA TIRUPATHI DEVASTANAMS

under their Scheme Aid

to Publish Religious Books.

కృతి సమర్పణ



శా॥ రాగం బొప్పగ శ్వేత శైల శిఖర ప్రాసాద సంవాసులై
వాగర్థంబుల వోలె నిత్య శుభ సంబంధంబుతో నైక్యమై
వాగర్థప్రతి పత్తి సత్కవులకున్ వాత్సల్యతన్ గూర్చు తత్
శ్రీ గౌరీ పరమేశ్వరార్పితముగా జేతున్ గృతిన్ భక్తితోన్

అవతారిక

సాధన సుబోధిని అను యీ గ్రంథము కేవలము ఆధ్యాత్మిక వేత్తలకే కాక సర్వజనులకు అత్యంతముపయుక్తమైనది. ఇందలి విషయములు సర్వదా ఆచరణీయములు. ఈ గ్రంథము నందలి ప్రథమభాగమునందు 61 పద్యములు కలవు. జగద్గురు శ్రీ శంకరాచార్య విరచితమైన సంస్కృత సూక్తులకు తెనుగున అర్థము మఱియు పద్యములు విపులమగు వివరణ వ్రాయబడినది. ద్వితీయభాగమున 41 పద్యములు కలవు. ఇది శాండిల్యోపనిషత్తు నాధారముగా గ్రహించి వ్రాయబడినది. ఇందు యమ నియమాసన ప్రాణాయామ ప్రత్యాహారధారణ ధ్యాన సమాధుల గూర్చి అతి విపులముగా వివరింపబడినది.

ఈ గ్రంథము నా అయిదవ రచన. ప్రథమ రచన "శ్రీరామ స్తవరాజము" అను సంస్కృత కృతి. తదుపరి తెనుగున "సాహితీ సద్వైద్యము" "గోపికా గీతములు" లక్ష్మీస్తవరాజుము" అను రచనలు చేయబడినవి. ఈ మూడు గ్రంథములు తిరుమల తిరుపతి దేవస్థానము వారి ధార్మిక గ్రంథ ప్రచురణ ఆర్థిక సహాయముతో ముద్రింపబడినవి. ఈ సాధనసుబోధిని గ్రంథము కూడ తిరుమల తిరుపతి దేవస్థానము వారి ఆర్థిక సహాయముతోనే ప్రచురింపబడినది.

ఈ రచనా విధానము ప్రాజ్ఞజనుల కామోదయోగ్యమైనచో నా కృషి సాఫల్యము నొందినట్లే. ఏ తత్కృతినాద్యంతము పఠించి, యిందలి విషయములను గ్రహించి, ఆచరించి సర్వశ్రేయస్సుల నొందగలరని నా ఆకాంక్ష

బహుధాన్య కార్తీకము
3-11-1998

బుధజన విధేయుడు
డాక్టర్. బి.వి. రాజు

కృతజ్ఞతలు

ఈ గ్రంథ ముద్రణ కొరకు ఆర్థిక సహాయ మొసంగిన

తిరుమల తిరుపతి దేవస్థానము

వారికి ధన్యవాదములు

రమ్యముగా డి.టి.పి. చేసిన

సాయినాథ్ డి.టి.పి. పాయింట్

జె.పి.రోడ్, రాజమండ్రి వారికి నా కృతజ్ఞతలు

గ్రంథరచయిత

ఇష్టదేవతాస్తవములు

ఉ॥ భాగవతంబు భారతము వ్యాసమహర్షి రచింప వ్రాయను
ద్యోగము స్వీకరించి, ముని యోచన జేయ గడంగునంత వే
వేగవచింపుమంచు గడు వేడుక బల్కెడి ఆది దైవమౌ
శ్రీ గణనాథు నెమ్మదిని జింతన జేసెద నిష్ట సిద్ధికిన్ 1

క॥ వర కవితా రూపిణియై
నిరతంబున్ శోభనొందు నీరజనేత్రన్
సురసంపూజిత చరణన్
పరమేష్ఠిరాణి వాణి బ్రస్తుతి జేతున్. 2

మ॥ క్షితి పుత్రిన్ నిజవామసక్థివర సంసీమన్ సుఖాసీనగా
నతి శృంగారము మీఱగైకొనుచునాత్మానందమేపార స
ద్ధృతి వర్యుల్ పరమార్థ మార్గరతులై యాసీనులై యుండ మా
రుతికిన్ తత్త్వము బోధ జేయురఘువీరున్ గొల్తున శ్రాంతమున్ 3

ఉ॥ ఈశ, మహేశ, సర్వజగదీశ, విశంకట పాపనాశ, గౌ
రీశ, నమత్సురేశ, సుకిరీటకృతక్షణదేశ, క్షిప్తకీ
నాశ, వరప్రకాశ, వసనాక్రమణాశ, వలక్షైలని
ర్వేశ, నిరంతరంబు నిను వేడెద గావుము సత్కృపామతిన్. 4

చ॥ వరద నిరంతరాశ్రిత సువందిత సచ్చరణారవింద, పం
కరుహభవాహిహోద్యమర కామ్య ఫలప్రద, సద్వినోద, సా
గరపతి కన్యకా హృదయ కంరుహషట్పద, సత్యసంధ, స
త్కరుణరసంబు మీఱ మము గావుము ప్రోవుము వేంకటేశ్వరా 5

క॥ కవన శాఖాధి రోహతన్ కాంక్ష మీఱ
రామ రామేతి మధురాక్షరముల మధుర
పంచమంబున వేడ్కతో బల్కు నీకు
వందనంబిదె వాల్మీకి పరభృతంబ 6

క॥ పంచమవేదం బౌచు ప్ర
పంచమునన్ శోభనొందు భారతమనెడు ప్రా
పంచేత్రమున్ భాసురతన్
పంచిన సత్కవులకేను వందన మిడెదన్ 7

తే॥ సంస్కృతంబున కాళిదాసాది కవుల
నాంధ్ర వాఙ్మయమున పోత నార్యసుకవి
నాంధ్ర భోజుని మఱియు శ్రీ నాథకవిని

పెద్దనామాత్యు విను తింతు పేర్మిమీఱ 8

ఉ॥ ఏ మహనీయుడాదరసమేత కృపామతి జేర బిల్చి స
త్కామిత మొప్ప సత్కవనకల్పన శక్తిని కల్గ జేసెనే
నామహితాత్మునైగమసునైష్ఠికునల్లమరాజ వంశజున్
సోమకవీంద్రుసద్గురుని సూరివరున్ ప్రణుతింతు నెమ్మదిన్ 9

చ॥ గురుకరుణా విశేషమున కోర్కె మెయిన్ రచియించినాడనీ
సురుచిర కావ్యరత్నమనసూయ మతిన్ పఠనంబు జేయు స
చ్చరితులకున్ నమస్సులను సన్మతితో నొనరింతు నిత్య సు
స్థిరముగ నిచ్చు గావుత! మదీయ సుకావ్యము జ్ఞాన ధారలన్ 10

చ॥ మునులును యోగివర్యులు ముముక్షువులున్ తగ జ్ఞాన దృష్టి నె
వ్వని గని హర్షమందెదరో! భక్త జనావళి సంతతంబు నె
వ్వని కరుణామృతంబునను వాంఛిత సిద్ధిని బొందు చుండ్రు త
ద్ఘన పరతత్వమవ్యయము గావుత సత్కృప ప్రాజ్ఞ సంఘమున్ 11

సీ॥ రచియించినాడ శ్రీరామస్తవంబును
సంస్కృతంబున సూరి జనులు మెచ్చ
సాహితీ సద్వైద్య సద్గ్రంధమును సంత
రించితి శాస్త్ర సమంచితముగ
నాంధ్రీకరించితినతి రమణీయత
గోపికా గీతముల్ కోర్కెమీఱ
శ్రీ కరమైన లక్ష్మీ స్తవరాజమున్
భక్తి భావంబున బల్కినాడ

తే॥ సాధన సుబోధినీ నామ సరసకృతిని
యమ నియమ విధానంబులన లరుగతిని
భూరి సద సద్వివేకంబు పొడమ మదిని
సంతరించితి నేర్పుమై సహజ విధిని. 12



ఉ॥ ఈ కృతి ఆది శంకరయతీంద్ర కవీంద్ర సుభాషితంబు దూ
రీ కృత కల్మషంబు కడు ప్రీతి కరంబును జ్ఞానదంబు న
ప్రా కృత పుణ్యదంబునన పాయసమీహిత సౌఖ్యదంబు నే
స్వీకృత రీతి దెన్గున వచించెద సద్బుధ రంజకంబుగన్

తే॥ సంస్కృత ప్రోక్తసూక్తి సంచయము జగతి
శంకరాచార్య కృతమను శంకబరగె
తెనుగు నొనరింతు సూక్తులన్ తెల్లముగను
ధర్మనిరతులకెల్ల సంతసము గొలుప



గ్రంథ ప్రారంభమున ఓంకారము యొక్క ప్రాశస్త్యమును గూర్చి యీ సూత్రమునందు వివరింప బడుచున్నది.

సూ॥ కః సర్వవేదభూః! అథచోమ్

అర్థము॥ సమస్త వేదములకు మూలమెయ్యది! ఓంకారము

శా॥ ఓంకారంబు సనాతనంబు వరమౌ నుర్విన్ సదా మోదమౌ
సంకల్పంబులకెల్ల హేతువరయన్ సంభావనీయంబు ని
శ్శంకాతంకత సర్వవేదములకున్ స్థానంబునాద్యంత మౌ
సంకీర్ణంబగు భూర్భువ స్సువములన్ సావిత్రికిన్ మూలమౌ 1

క॥ ఓంకారంబాదిన్ ని
శ్శంకన్ గాంగేయ గర్భ జల్పితమై భ
వ్యంకరమై భాసిలె నిర
హంకారంబొదవు బ్రణవయజ్ఞముచేతన్ 2

" ఓం కారశ్చాథ శబ్దశ్చ ద్వావేతౌ బ్రహ్మణః పురా
కంఠం భిత్వా వినిర్యాతౌ తస్మాన్మాంగళికావుభౌ॥

ఓంకార శబ్దము పూర్వము బ్రహ్మయొక్క కంఠము నుండి
వెలువడినది కావున ఓంకారము మంగళప్రదము.

పృథివ్యాది పంచభూతములు బ్రహ్మమునుండి యుద్భవించినవి. పంచభూతాత్మకమగు సమస్త జీవులు బ్రహ్మము నుండియే యుద్భవించినవి. మరియు బ్రహ్మమునందే విలీనమగుచున్నవి. బ్రహ్మము త్రికాలాతీతము. మఱియు సత్యము, నిత్యమునైనది. బ్రహ్మమే విరాట్పురుషుడు. అట్టి పరబ్రహ్మమునుండి వెలువడినది గాన ఓంకారము పరమ పవిత్రము. ఏతదేవాక్షరంబ్రహ్మ ఏతదేవాక్షరం పరమ్॥

"తస్య వాచకః ప్రణవః (పాతంజలయోగ సూత్రములు) సర్వజ్ఞుడగు ఈశ్వరునకు ఓంకారము వాచకము. ఓంకారమునకు ఈశ్వరుడు వాచ్యుడు. ఈశ్వరునకు ఓంకారమునకు వాచ్య వాచక భావ సంబంధముకలదు.

ప్రణవయజ్ఞమనగా! ఓంకారయజ్ఞము. యజ్ఞములు అయిదు విధములు. దేవయజ్ఞము, పితృయజ్ఞము, భూతయజ్ఞము, మనుష్య యజ్ఞము, బ్రహ్మ యజ్ఞము అని. ఇందలి బ్రహ్మయజ్ఞమే ప్రణవయజ్ఞము. పంచవా, ఏతే మహాయజ్ఞాస్సతతి ప్రతాయంతే. సతతి సంతిష్ఠంతే దేవయజ్ఞః పితృయజ్ఞో భూతయజ్ఞా మనుష్యయజ్ఞో బ్రహ్మయజ్ఞఇతి"

ఓంకారము శబ్దమయము. సర్వశబ్దములు ఓంకారమునుండి యుద్భవించినవి. ఓంకారమునందు మూడు అక్షరములు కలవు. అ - ఉ - మ, ఓంకారోపాసనముచే మనోనైర్మల్యము సిద్ధించును. భక్తి శ్రద్ధలతో నోంకారోపాసనమొనర్చినచో పరబ్రహ్మ సాక్షాత్కారము సుకరము.

ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణస్త్రివిధస్మృతః
బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా॥ (భగవద్గీత)

పరబ్రహ్మ ఓం, తత్, సత్, అను మూడు శబ్దములచే నిర్దేశింపబడినది. సృష్ట్యాదియందు ఆ బ్రహ్మచేతనే బ్రహ్మ విదులగు బ్రాహ్మణులును, వేదములును, యాగములును విధింపబడినది.

" ఓంకార ప్రభవా వేదా ఓంకార ప్రభవా స్స్వరాః
ఓంకార ప్రభవం సర్వం త్రైలోక్యం సచరాచరం॥

వేదములు ఓంకారమునుండి యుద్భవించినవి. స్వరములు ఓంకారమునుండి ప్రభవించినవి.

సమస్త స్థావర జంగమా త్మక త్రైలోక్యములు నోంకార సంభవము

ఓంకార స్సర్వమంత్రాణాముత్తమః పరికీర్తితః॥

సమస్త మంత్రములలో నోంకారము ఉత్తమమని కీర్తింప బడినది.

"ఓమి త్యేకాక్షరం బ్రహ్మ" ఓంకారమే బ్రహ్మమని

వేదోక్తి" హరిః ఓం........ ఓమిత్యేదక్షరమిదం

సర్వం తస్యోపవ్యాఖ్యానం భూతం భవిష్యదితి

సర్వమోంకార ఏవ యచ్చాన్య త్రికాలాతీతం తదప్యోం కార ఏవ

ఓం కారము సర్వమునై యున్నది. తదుపరి దీని వ్యాఖ్యానము జరుగును. భూత భవిష్య ద్వర్తమానములు ఓంకారమే. ఓంకారము త్రికాలాతీతము.

"ఓ మిత్యేకాక్షరం బ్రహ్మవ్యాహరన్ మామనుస్మరన్

యః ప్రయాతి త్యజన్ దేహం సయాతి పరమాంగతిం" (భగవద్గీత)

ఏ మనుజుడు పరబ్రహ్మ స్వరూపమగు నోంకారము నుచ్చరించుచు, నన్ను స్మరించుచు శరీరత్యాగమొనరించునో, ఆ మనుజుడు పరమగతిని పొందుచున్నాడు. అని శ్రీ కృష్ణపరమాత్మ ప్రణవము యొక్క ప్రాశస్త్యమును గూర్చి అర్జునునకు ప్రబోధించియున్నాడు.



ప్రణవము యొక్క ప్రాశస్త్యమును ప్రవచించిన తదుపరి ప్రణవ స్వరూపులగు శివకేశవుల యొక్క అభేద తత్త్వము యీ సూక్తియందు వివరింపబడుచున్నది.

సూ॥ కశ్చ భగవాన్! మహేశః శంకర నారాయణాత్మకః

అర్థము॥ భగవానుడెవరు ! శంకరనారాయణాత్మకమగు మహేశుడు.

క॥ శివకేశవ రూపంబుల
భువిలో దర్శన మొసంగు భూతేశ రమా
ధవ రూపాత్మక మూర్తిన్
భవ బంధ విముక్తి కొఱకు భజియింపవలెన్ 3

"శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయం శివః"

శివుని యొక్క హృదయము విష్ణువు. విష్ణువు యొక్క హృదయము శివుడు. అనగా! శివకేశవులు అభేద స్వరూపులు. కావున శివకేశవులను భేద భావముతో నర్చించుట అవివేకము.

"హరిరేవ శివస్సాక్షాత్ శివ ఏవ హరి స్స్వయమ్
తయోర్భేదం ప్రకుర్వాణో రౌరవం నరకం వ్రజేత్"

శివకేశవ స్వరూపుడగు భగవానునర్చించిన మానవుడు భవ బంధముల నుండి విముక్తి నొందగలడు.

"హరి నామ కీర్తనంబును
హర నామ జపంబునెవ్వడాత్మ బఠించున్
నరక మహావేదన య
న్నరునకు బ్రాపింపకుండు నయతత్త్వనిధీ ॥ (కాశీ ఖండము)

హరి హర సంకీర్తన మొనర్చినచో మానవునకు నరకవేదన ప్రాప్తించదని యీ పద్యము యొక్క భావము.

యేనమస్యంతి గోవిందం యేనమస్యంతి శంకరమ్
యేర్చయంతి హరింభక్త్యా తే ర్చయంతి వృషధ్వజమ్.

ఏ మానవులు శ్రీమహా విష్ణువుని గూర్చి నమస్కరించు చున్నారో ! ఆ మానవులు శంకరునే నమస్కరించు చున్నారు. ఎవరు శ్రీహరిని భక్తితో పూజించు చున్నారో ! వారలు మహేశ్వరునే పూజించు చున్నారు. ఇందు శివకేశవుల యొక్క అభేదము వ్యక్తమగుచున్నది.

అవ్యక్తమగు పరమాత్మ అనిర్దేశ్యము, అంచింత్యము అచలనము, నామ రూపరహితము, నాశరహితము, నిర్వికారము, నిఖిల వ్యాపకము.

అట్టి పరమాత్మకు మనుజులు ధ్యాన సౌలభ్యము కొఱకు నామ రూపములం గల్పించి, అర్చించుట విదితము ఉపాసనలు రెండు విధములు సగుణో పాసన, నిర్గుణోపాసన అని, రూపరహితుడైన భగవానునకు రూపము గల్పించి అర్చించుట సగుణోపాసన. అవ్యక్తుడగు భగవానుని అవ్యక్తునిగనే భావించి అర్చించుట నిర్గుణోపాసన. సగుణ నిర్గుణములు రెండును భగవానున కామోదయోగ్యములే కావుననే ఉద్ధవుడు శ్రీకృష్ణ పరమాత్మతో నీ విధముగా పలికియున్నాడు.

"రూపు లేని నీకు రూఢిగా యోగులు
రూపునిల్పి నిన్ను రుచిర భక్తి
గొల్చి యుండ వారి కోర్కెల నిచ్చెద
వేమిలాగు మాకు నెఱుగ బలుకు" (శ్రీ మహాభాగవతము)

ఈ ప్రపంచమున మనుజులకు ధ్యానంబు నిలువ నేరదుగావున భగవానుని ప్రతిమా విశేషములతో పూజింప వచ్చును. ఇది సగుణ భక్తి. ప్రతిమా విశేషములు వినా సమస్తము భగవానుని దివ్యకళామయమని మనస్సున భావించి భగవానునర్చించుట నిర్గుణభక్తి. నిర్గుణభక్తి తత్పరులైనను, సగుణ భక్తిని నిరసించుట దోషమే.

"న తస్య ప్రతిమా అస్తి యస్య నామ మహద్యశః"

మహో యశస్వియైన పరమాత్మకు ప్రతిమ లేదు.

అట్టి పరమేశ్వరుని గూర్చి ఉపాసన జేయుట నిర్గుణము

"చిన్మయ స్యా ప్రమేయస్య నిర్గుణస్యా శరీరిణః

సాధకానాం హితార్థాయ బ్రహ్మణో రూపకల్పనా

అరూపం రూపిణం కృత్వా కర్మకాండ రతా నరాః"

చిన్మయుడు. అప్రమేయుడు, నిర్గుణుడు, అశరీరుడునగు పరబ్రహ్మకు సాధకుల యొక్క హితము కొఱకు రూపమును కల్పించుట, రూప రహితుడైన పరబ్రహ్మను రూపవంతునిగా నొనరించి కర్మకాండ రతులగు మనుజులు ఆరాధించుచున్నారు.

"ఆదిత్యానామ హం విష్ణుః" "రుద్రాణాం శంకరశ్చాస్మి"

అను భగవద్గీతోక్తి ప్రకారము శివకేశవులకు భేదములేదు.

హరి హరుల యొక్క అభేద తత్వమును వివరించుచున్న సంస్కృత కాశీఖండమునందలి యీ శ్లోకమును తిలకించవలసియున్నది.

"సవై మహావిష్ణురితీర్యతే బుధైః

తం వై మహాదేవము దాహరంతి

సోంతాది మధ్యైః పరివర్జితశ్శివః

సః శ్రీ పతిస్సో2పి హి పార్వతీ పతిః"



శివకేశవభక్తిచే లభియించు సత్ఫలితము వివరింపబడుచున్నది.

సూ॥ కోహి జగద్గురు రుక్తః! శంభుః

అర్థము ॥ జగద్గురువెవరు! మహేశ్వరుడు

సూ॥ జ్ఞానం కుతః! శివాదేవ

అర్థము॥ జ్ఞానమెచటనుండి లభించును! శివుని వలన

సూ॥ ముక్తిం లభతే కస్మాత్! ముకుంద భక్తేః

అర్థము॥ ముక్తి ఎవరి వలన లభించును! ముకుందభక్తి వలన

సూ॥ ముకుందః కః! యస్తారయేద విద్యాం

అర్థము॥ ముకుందుడెవరు! అవిద్యనుండి తరింప జేయువాడు

తే॥ లోక గురువనఁ బరగుఁ ద్రిలోచనుండు
చంద్రశేఖరు వలన విజ్ఞాన మొదవు
ముక్తిలభియించుకేశవ భక్తి వలన
విశ్వ రూపునిచేతనవిద్య తొలగు 4

"నమస్తే నాథ భగవన్ శివాయ గురురూపిణే
విద్యావతార సంసిద్ధ్యై స్వీకృతానేక విగ్రహః"

శంకరుడు సర్వ ప్రపంచమునకు గురువు. సూర్యచంద్రాగ్నులు లోచనములుగా గల్గినవాడు. సూర్యచంద్రాగ్నుల వలన అంధకారము నిర్మూలమగుచున్నది. త్రిలోచనుడగు శంకరుని వలన అజ్ఞానాంధకారము తొలగి జ్ఞానము సంప్రాప్తమగును. అజ్ఞానమును తొలగించి జ్ఞానమును ప్రసాదించు మహనీయుడే యదార్థమగు గురువు. కనుక శివునకు గురు శబ్దము సార్థకమగుచున్నది.

శంకరుని వలన జ్ఞాన సిద్ధి కల్గును. పరమేశ్వరుడు జ్ఞాన ప్రదాతయని యీ దిగువ పేర్కొన బడిన శ్లోకముల వలన వ్యక్తమగుచున్నది.

"మహత్తత్వం మహాదేవం ప్రియం జ్ఞాన ప్రదం వరం
మహాపాపహరం తస్మాన్మకారాయ నమో నమః"

"జ్ఞానాత్మానం జ్ఞాన గమ్యం జ్ఞానశ్రేష్ఠం సుదుర్విదమ్
దాతారంచైవ భక్తానాం ప్రసాద విహితాన్ వరాన్"

మరియు శివపురాణములో శివతత్త్వమును గూర్చి వివరించునపుడు శివునకు ఎనిమిది నామములు పేర్కొనబడినవి.

"శివో మహేశ్వర శ్చైవ రుద్రో విష్ణుః పితామహః
సంసార వైద్యః సర్వజ్ఞః పరమాత్మేతి ముఖ్యతః

ఈ శ్లోకమునందు శంకరుని సర్వజ్ఞుడు అని పేర్కొన బడినది. సర్వజ్ఞ నామస్మరణము వలన మానవులకు విద్యా ప్రజ్ఞలు లభియించును. సర్వజ్ఞుడు జ్ఞానమయుడునైన శంకరుని అనుగ్రహము వలననే జ్ఞాన స్థితి సిద్ధించును.

"అనేక కర్మ సక్తోపి శివజ్ఞాన వివర్జితః"
"శివభక్తి విహీనశ్చ సంసారీనైవ ముచ్యతే"

విష్ణు భక్తి వలననే మనుజులకు ముక్తి లభించును. హరిభక్తితో జీవించుట అత్యంతావశ్యకము కావుననే పోతనామాత్యుడు భాగవతమునందు

"విష్ణుభక్తి లేని విబుధుండు విబుధుడే?

అని ప్రశ్నించు చున్నాడు. మరియు భాగవతమునందే

"గాన హరిందలంపుమిక గల్గదు జన్మమునీకు ధాత్రిపై

మానవనాథ పొందెదవు మాధవలోక నివాస సౌఖ్యముల్"

అని శుకయోగీంద్రుడు పరిక్షిన్నరేంద్రునకు వివరించి యున్నాడు.

శ్రీ మహా విష్ణువు మోక్ష ప్రదాత యని భగవద్గీత యందలి కొన్ని శ్లోకముల వలన విశదమగుచున్నది.

"అంత కాలేచ మామేవ స్మరన్ ముక్త్వా కలేబరమ్

యః ప్రయాతి సమద్భావం యాతి నా స్త్యత్ర సంశయః"

అవసాన కాలమునందేమనుజుడు నన్నే స్మరించుచు శరీరమును త్యజించునో ఆ మనుజుడు నా స్థితిని పొందుచున్నాడు.

"ఆ బ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తినో2ర్జున

మా ముపేత్యతు కౌంతేయ పునర్జన్మన విద్యతే"

అర్జునా! బ్రహ్మలోక పర్యంతముగా గల లోకములు యుద్భవించి నశించునవియై యున్నవి. లోకములందలి జీవులన్నియు పునరావర్తినులే. కౌంతేయా! నన్ను పొందినచో పునర్జన్మ లేదు.

"మన్మనా భవ, మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు

మామే వైష్యసి సత్యంతే ప్రతిజానే ప్రియోసిమే"

అర్జున! అనన్యమైన ప్రేమతో నిత్యనిరంతరాచలమైన నీ మనస్సును నాతో నింపుము. అతిశయ శ్రద్ధా భక్తి సహిత నిష్కామ భావముతో నా యొక్క నామ గుణ ప్రభావములను, శ్రవణ కీర్తన మనన పఠనముల ద్వారా నిరంతరము నాకు భక్తుడవుకమ్ము. శంఖ చక్ర గదా పద్మ కిరీట కుండలాది భూషణధారియు, పీతాంబర వనమాలా కౌస్తుభమణి ధారియునగు నాకు మనోవాక్కాయ కర్మల ద్వారా సర్వస్వమునర్పణ జేసి, అత్యంత భక్తి శ్రద్ధలతో నన్ను పూజింపుము. విభూతి, బల, ఐశ్వర్య, మాధుర్య, వాత్సల్య, గంభీరతా, ఉదారతా, సుహృదతా దిగుణములతో గూడి, సర్వమునకు ఆశ్రయరూపమైన నాకు వినయభావ పూర్వకముగా భక్తియుక్త సాష్టాంగ ప్రణామమొనరింపుము. ఈ విధముగా నొనరించినచో నీవు నన్నే పొందగలవు.

నేను నీ కొఱకు సత్య ప్రతిజ్ఞ చేయుచున్నాను. ఎందుచేతననగా! నీవు నా కత్యంత ప్రియ సఖుడవు.

"సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః"

సర్వ కర్మల యొక్క ఆశ్రయములను త్యజించి నన్ను అనన్య శరణమునొందుము. నేను నిన్ను సమస్త పాపముల నుండి విముక్తుని చేయుదును. చింతింపవలదు.

మానవుడు త్యాగము ద్వారా పరమాత్మను పొందవచ్చునని యీ శ్లోకమునందు వివరింపబడినది. పరమాత్మను పొందుట కొఱకు త్యాగమే ముఖ్య సాధనము. త్యాగము సప్త విధములుగా విభజింపబడినది. త్యాగము యొక్క నిర్వచనము సంక్షేపముగా వివరింపబడుచున్నది.

1. నిషిద్ధ కర్మలను నిత్యము పరిత్యజించుట

నిషిద్ధకర్మలనగా! చోరత్వము, వ్యభిచారము, అబద్ధము, కపటము, మోసము, దౌర్జన్యము, హింస, అభక్ష్య భోజనము, పొరపాటు, శాస్త్రవిరుద్ధనీచ కర్మలు యీ నిషిద్ధకర్మలను మనోవాక్ కాయములచే సర్వదా పరిత్యజించవలయును.

2. కామ్య కర్మలను త్యజించుట

స్త్రీ పుత్ర ధనాది యిష్ట వస్తు ప్రాప్తి కొఱకు మరియు రోగ సంకటాది నివారణ కొఱకు యజ్ఞము, దానము, తపస్సు, ఉపాసనాది క్రియలను స్వార్థ ప్రయోజనము నిమిత్తము చేయ దగదు.

3. తృష్ణను సదా విసర్జించుట

అభిమానాధిక్యత గౌరవాదులు, స్త్రీ పుత్ర ధనాద్య నిత్య పదార్థములు ప్రారబ్ధాను సరణములుగాన వీనిని వృద్ధినొందించ వలెననెడు తలంపు భగవత్ప్రాప్తికి అవరోధము అని భావించి త్యజించవలయును.

4. అన్యులచే తనకొఱకు జేయబడు సేవలను త్యజించుట, మఱియు నన్యులచే తనకొరకొసంగబడు ధనాది పదార్థములను పరిత్యజించుట.

స్వసౌఖ్యము కొఱకు ఇతరులనుండి ధనాది పదార్థములను స్వీకరింపదగదు. మఱియు స్వార్థపరతతో నితరులనుండి సేవల నొందుట త్యజించవలయును. సేవలనొంద వలెనను తలంపు మనస్సు నందైనను యూహించరాదు.

స్వార్థముతో తన కొఱకు ఇతరులొనరించు సేవలను గ్రహింపదగదు. మఱియు స్వార్థపరతతో తన కొఱకొసంగబడు ధనాది పదార్థములను స్వీకరింప దగదు.

5. సంపూర్ణ కర్తవ్య కర్మల యందు ఆలస్యము, మఱియు ఫలితము నొందవలెననెడు తలంపు పరిత్యజించుట.

ఈశ్వర భక్తి దేవతల యొక్క పూజ, మాతా పిత్రాది గురుజనుల సేవ, యజ్ఞ దాన తపో నిర్వహణము ఇత్యాది కర్తవ్య కర్మల నొనరించుట యందు ఆలస్యమును విడనాడ వలయును. ఫలితమున పేక్షింప దగదు.

6. సంసార సంబంధ సంపూర్ణ పదార్థములయందు, మరియు కర్మలయందు మమతను, ఆసక్తిని నిత్యము పరిత్యజించుట.

ధన భవన వస్త్రాది సమస్త వస్తువులు, స్త్రీ పుత్ర మిత్రాది సర్వ బంధుజనులు, మానము, గొప్ప తనము, ప్రతిష్ఠ, మఱియు ఇహలోక సంబంధ విషయ భోగ రూప పదార్థము లన్నియు క్షణ భంగురములు, అనిత్యములు అని తలంచి, వాని యెడ మమతను, ఆసక్తిని విడనాడి, కేవల సచ్చిదానందరూప పరమాత్మయందు చిత్తమును లగ్నమొనర్చి, అనన్యమైన విశుద్ధ భావముతో ప్రవర్తించ వలయును.

7. సంసారమును, శరీరమును గూర్చి అమితమైన మమకారమును, కామ్య కర్మలును, అహంభావమును త్యజించుట.

సంసార సంబంధ సర్వ కర్మలు సర్వదా అనిత్యములు గాన వానిని త్యజించ వలయును. శరీరము అశాశ్వతము గాన శరీరమును గూర్చి మమకారమును పరిత్యజించ వలయును.

శాశ్వతుడు, సంపూర్ణుడు నైన పరమాత్మను దృఢ నిశ్చయముతో, సమభావముతో మనో వాక్ కాయ కర్మల ద్వారా అర్చించవలయును.

ఈ సప్తవిధ త్యాగ కర్మలను మానవుడాచరించినచో అంతః కరణమునందలి అవగుణములు సంపూర్ణముగా నిర్మూలమై 1. అహింస, 2. సత్యము, 3. అస్తేయము, 4. బ్రహ్మచర్యము, 5. అపైశునత్వము, 6. లజ్జ, అమానిత్వము, 7. నిష్కపటము, 8. సంతోషము, 9. తితిక్ష, 10. సత్సంగము, సేవ, యజ్ఞము, దానము, తపస్సు, 11. స్వాధ్యాయము, 12. శమము, 13. దమము, 14. వినయము, 15. ఆర్జవము, 16. దయ, 17. శ్రద్ధ, 18. వివేకము, 19. వైరాగ్యము, 20. ఏకాంతవాసము, 21. అపరిగ్రహము, 22. సమాధానము, 23.ఉపరామత, తేజస్సు 24. క్షమ, 25. ధైర్యము, 26. అద్రోహము, 27. అభయము, 28. నిరహంకారము, శాంతి చేకూరును. పరమేశ్వరుని యందు భక్తి భావమేర్పడి. నిత్య నిరంతర దృఢ చిత్త స్థితి లభించును.

త్యాగ శ్రేణీ స్థితి ద్వారా భగవత్ప్రాప్తి నొందుటకు యీరీతిగా సప్త శ్రేణులు వివరింపబడినవి.

శ్రీమహావిష్ణువు మోక్ష ప్రదాత యనుటకు భగవద్గీత, భాగవతాది గ్రంధములు ప్రమాణములు.

ముకుందుడు ముక్తినొసంగు వాడు కావుననే అవిద్యను నిర్మూలించును. అవిద్యయన అజ్ఞానము. అజ్ఞానము అపవర్గమునకు అవరోధము గాన భగవంతుడు తన భక్తులకు అజ్ఞానము లేశమాత్రమున్నను సహింపడు. అద్వైతా మృత వర్షిణి యగు భగవద్గీత భగవత్ప్రోక్తము. భగవద్గీతా మాహాత్మ్యము నందలి యీ శ్లోకములను గ్రహింపదగి యున్నది.

"గీతా శాస్త్రమిదం పుణ్యం యః పఠేత్ ప్రయతః పుమాన్
విష్ణోః పదమవాప్నోతి భయ శోకాది వర్జితః"
"గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైః శాస్త్రవిస్తరైః
యా స్వయం పద్మనాభస్య ముఖ పద్మా ద్వినిః సృతమ్"
"భారతా మృత సర్వస్వం విష్ణోర్వక్త్రా ద్వినిః సృతం
గీతా గంగోదకం పీత్వా పునర్జన్మ న విద్యతే'



భగవానుని యొక్క అవతార ప్రయోజనము వివరింపబడు చున్నది.

సూ॥ కో ర్హో హి ! భగవదవతారః

అర్థము ॥ అర్హింప దగిన వాడెవరు ! అవతారమూర్తి యగు భగవానుడు.

తే. ధర్మ సంరక్షణార్థమై ధరణి లోన
మనుజ రూపంబుతోడుత మాధవుండు
అవతరించును గాన నయ్యు నఘు గొల్వ
దొలగు భవ బంధములు మానవులకు సతము. 5

"అవజానంతి మాం మూఢాః మానుషీంతను మాశ్రితం"

అను భగవద్గీతోక్తి ననుసరించి, భగవానుడు ధర్మ సంరక్షణ కొఱకు మానవ రూపము తో నవతరించు చుండును. ధర్మ సంరక్షణ మొనరించ వలెననిన అధర్మమును నిర్మూలన మొనరింప దగియున్నది. కనుక శిష్ట రక్షణ, దుష్ట శిక్షణ భగవానుడొనరించు సత్క్రియలు. రామావతారమున రావణాదులను, కృష్ణావతారమున కంసాదులను సంహరించి, ధర్మ సంస్థాపనమొనరించిన చరిత మెల్లరకు సువిదితము. వివరణ కొఱకు భగవద్గీత యందలి యీ శ్లోకములు గమనింప దగి యున్నవి.

"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థానమ ధర్మస్య తదా త్మానం సృజామ్యహమ్"
"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచదుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"

అర్జునా! ఎప్పడెప్పడు ధర్మమునకు హాని కల్గి అధర్మము వృద్ధినొందునో అప్పడు నేను అవతరింతును. సాధుజనులను సంరక్షించుట కొఱకు దుర్మార్గులను నిర్మూలించుట కొఱకు, ధర్మ సంస్థాపన మొనరించుట కొఱకు ప్రతి యుగమందును నేను అవతరింతును. అని శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుని గూర్చి పలికి యున్నాడు.

సచ్చిదానంద స్వరూపుడగు పరమేశ్వరుడు జనన మరణ రహితుడు. ఏకాకృతితో ప్రకాశించువాడు మఱియు సమస్త భూతములకు ఆశ్రయమైన వాడు. అట్టి భగవానుడు కేవలము ధర్మ ప్రతిష్ఠాపన మొనరించు నిమిత్తము, స్వకీయ యోగమాయ చేత సగుణ స్వరూపుడై ప్రకట మగుచుండును. భగవంతుని జన్మ యొక్క ప్రయోజనము సకల లోక కళ్యాణము కొఱకే. మఱియు దుష్ట శిక్షణ శిష్ట సంరక్షణ, ధర్మ సంస్థాపన భగవానుని అవతార ప్రయోజనము. ఏ మానవులు అనన్య భక్తి భావముతో నిరంతరము భగవచ్చింతన మొనరింతురో ఆమానవులు భవబంధ విదూరులై శాశ్వతానందము నొందగలరు.

"ఎప్పుడు ధర్మ క్షయమగు
నెప్పుడు పాపంబు పొడము నీలోకములో
నప్పుడు విశ్వేశుడు హరి
దప్పక విభుడయ్యు దన్ను దా సృజియించున్. (ఆంధ్రమహా భాగవతము)

"దుష్ట జన నిగ్రహంబును
శిష్ట ప్రతి పాలనంబు సేయన్ హరి దా
సృష్టినవతారమొందెను
స్రష్టముఖానేక దివిజ సంఘము వొగడన్. (ఆంధ్రమహాభాగవతము)



శ్రీమహా విష్ణువు యొక్క అవతార ప్రయోజనమును పేర్కొనిన తదనందరము హరి సంస్మరణ ప్రాశస్త్యము వివరింపబడు చున్నది. మఱియు హరినామ స్మరణము వినా వృధా ప్రసంగములు పరిహరణీయములని యీ సూక్తియందు వ్యక్తమొనర్పబడినది.

సూ॥ కిం స్మర్తవ్యం పురుషైః ! హరి నామ సదా న యావనీ భాషా
అర్థము॥ మానవులచే సంతతము స్మరింపదగినది ఏది !
భగవన్నామము. వృథా ప్రసంగములు కావు.

క. హరి నామ స్మరణంబున్
నిరతం బొనరింప వలయు నిర్మల భక్తిన్
అరయన్ వృథా ప్రసంగము
పరిహరణీయంబు భువిని ప్రాజ్ఞులకెలమిన్. 6

మనుజులు సద్భక్తితో శ్రీహరి నామస్మరణ మొనరింప వలయును, ప్రహ్లాదనారదాది భాగవతో త్తములు, నిరంతరము హరినామస్మరణమొనర్చి ధన్యత నొందిన సుచరితము సర్వ జన విదితము. "భజంతి యే పుష్కరాక్షం న తే యాంతి పరాభవమ్" ఏ మానవులు శ్రీహరిని స్మరింతురో ఆ మానవులు పరాభవమును పొందరు.

"స్మరన్ నారాయణం దేవం చతుర్బాహుం కిరీటినం
శుద్ధస్ఫటిక సంకాశం పీతవాసనమచ్యుతం
ధారయేత్వంచ ఘటికా స్సర్వ పాపైః ప్రముచ్యతే"

మానవులు సమస్త పాపముల నుండి విముక్తి నొందుటకు నారాయణ స్మరణయేకైక శరణ్యము. "నారాయణేతి యస్యాస్తే వదనే నామ మంగళం నారాయణ స్తమన్వేతి వత్సం గౌరీవ వత్సలం" నారాయణ అను మంగళనామమును ఏ మానవులు స్మరింతురో, ఆ మానవులను శ్రీ మన్నారాయణుడు, గోవు తన యొక్క వత్సమును అనుసరించు నట్లు, అనుసరించును.

క. దానవదైత్య భుజంగమ
మానవ గంధర్వ సుర సమాజములోల
క్ష్మీనాధు చరణ కమల
ధ్యానంబున నెవ్వడైన ధన్యత నొందున్" (ఆంధ్రమహా భాగవతము)

దావన దైత్య భుజంగమ మానవ గంధర్వ సుర సమాజములో నెవ్వరైనను, శ్రీ మహా విష్ణువు యొక్క పాద పద్మధ్యాన మొనరించిన ధన్యతనొందును.

శ్రీహరినామస్మరణ వినా మానవులు వృథా ప్రసంగములతో కాలయాపన మొనర్చుట అవివేకము. కావుననే "శ్రీనాధు వర్ణించు జిహ్వజిహ్వ" "మురవైరినుతించిన వాణి వాణి" అని పోతనామాత్యుడు. విష్ణునామ ప్రాశస్త్యమును వివరించి యున్నాడు.

"అతి పాపకర్ములైనను సతతము నారాయణాఖ్య శబ్దము మదిలో
వితతంబుగ బలియించిన చతురుల గొనియాడ గమల సంభవు వశమే"
(ఆంధ్ర మహా భాగవతము)



హరి నామ స్మంసరణ ప్రాశస్త్యమును వివరించి, వృధా ప్రసంగములను నిరసించిన తదనంతర మాధ్యాత్మిక విద్యాభ్యాసము కొఱకు, సత్కర్మాచరణ కొఱకు మానవులకు గురు వచన మత్యంతా వశ్యకము గాన నీ సూత్రమున గురువచనమునకు ప్రాశస్త్య మొసంగబడు చున్నది.

సూ॥ కిం ఉపాదేయం ! గురు వచనం
అర్ధము॥ స్వీకరింపదగినదేది ! గురువాక్యం

క. గురువచనం బనవరతం
బురు సూనృత మౌచు దనరునుర్వీ స్థలిలోన్
సుర సందేశము భంగిన్
గురువచనము జ్ఞాన భూతి గూర్చు నరులకున్ 7

"గుకారశ్చాంధ కారస్తు రుకారస్తన్ని రోధకృత్
అంధకార వినాశత్వాత్ గురురిత్యభిధీయతే"

గురు శబ్దమునందు రెండు అక్షరములు కలవు. అందలి "గుకారమంధకారమనియు, "రు" కారమయ్యంధ కారమును నిరోధించుననియు నర్ధము అనగా అంధ కారమును నిర్మూలన మొనర్చును గాన "గురు" అని నుడువ బడుచున్నది.

గురు వాక్యము వలన మానవుల యొక్క అజ్ఞా నాంధకారము నిర్మూలమై, జ్ఞాన జ్యోతి సంప్రాప్తమగు చున్నది. కావున గురువచనము పరమ పవిత్రము. గురువచనమును స్వీకరించు శిష్యుడు వినయ విధేయతలు కల్గియుండ వలయును. గురు శిష్యుల అన్యోన్యత అద్వితీయము. కావుననే స్వాధ్యాయ నిరతుడగు శిష్యుడు మరియు బ్రహ్మవిద్యా ప్రబోధకుడగు గురువు, బ్రహ్మ విద్యా ప్రారంభమున, మిత్రాది వివిధ దేవతల గూర్చి, విఘ్నోప శాంతి కొఱకు స్తుతి యొనర్చి, గురు శిష్యుల మైన మమ్ములను, సర్వదా సంరక్షింప వలెనని హరిః ఓమ్ శంనో మిత్రః" అని సూర్యాది దేవతలను పేర్కొని, "తన్మామవతు, తద్వక్తారమవతు అవతు మామ్, అవతువక్తారమ్, ఓం శాంతిః శాంతిః శాంతిః అను శాంతి మంత్రమును పఠించు సంప్రదాయము కలదు. ఈ మంత్రము తైత్తిరీయోపనిషత్తు నందు గలదు.

"గురువులు ప్రియ శిష్యులకుం
బరమరహస్యములు దెలియ బలుకుదు రచల
స్థిర కల్యాణం బెయ్యది
పురుషులకును నిశ్చయించి బోధింపు తగన్" (ఆంధ్రమహా భాగవతము)

గురువులు తమ ప్రియ శిష్యులకు అచలము, స్థిరమునైన కళ్యాణమును గూర్చి (జ్ఞాన తత్త్వమును గూర్చి) పలుక దగియున్నదని భావము, అతి రహస్యమైనది జ్ఞాన తత్వము గాననీ పద్యము నందు బరమరహస్యమని ప్రయోగింపబడినది. గావుననే అధ్యాత్మిక విద్య "చదువులలో మర్మమనియు" కుంభినీధవు జెప్పెడి గురువు గురువు" అనియు భాగవతమునందు జెప్పబడినది

కృష్ణ పరమాత్మజగద్గురువు కావున అర్జునకు అధ్యాత్మిక తత్వము పదేశించి యున్నాడు. గాన సద్గురు వచనము మానవులకు సర్వదా శిరోధార్యము.



గురు వచన ప్రాశస్త్యము వివరించిన పిదప, సచ్ఛిష్యున కొసంగు విద్యను గూర్చి విశద మొనర్చబడుచున్నది.

సూ॥ కా కల్పలతా లోకే ! సచ్ఛిష్యార్పిత విద్యా

అర్థము॥ లోకమునందు కల్పలత యననేమి ! సత్పాత్రుడగు శిష్యునకొసంగు విద్య.

తే. కల్పలత యనబరగులోకంబునందు
గురువు సంప్రీతి శిష్యున కొసగు జ్ఞాన
విద్య, తద్విద్యచే సంభవించు నిహము
పరమునందువ సుఖము కైవల్య పథము. 9

విద్య రెండు విధములు. భౌతికపరము, అధ్యాత్మిక పరము. ఇందలి భౌతిక పరమగు విద్య కేవలము జీవనోపాధి కొఱకే. అధ్యాత్మిక పరమగు విద్య జ్ఞాన విద్య. ఈ జ్ఞాన విద్యయే యదార్థమగు విద్య. మనుజుడు దేనిని గ్రహించిన తదుపరినిక గ్రహించవలసినది లేదో అదియే జ్ఞాన విద్య. జ్ఞాన విద్యను యోగ్యుడగు శిష్యునకే యొసంగదగియున్నది. "శిష్యస్తేహం శాధి మామ్" అని పలికిన అర్జును నకు, శ్రీకృష్ణుడు గీతామృతమను జ్ఞాన విద్యనొసంగి, అర్జునుని యొక్క అజ్ఞానమును తొలగించినాడు. కావున భగవద్గీత పరమ పవిత్రము. భగవద్గీత యొక్క పవిత్రత మఱియునుత్కృష్టత యీ శ్లోకముచే విశదమగు చున్నది.

"సర్వోపనిషదోగావో దోగ్ధా గోపాల నందనః
పార్థో వత్సస్సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్"

సద్గురువు వలన జ్ఞాన విద్య నార్జించిన మహితాత్ములకు ఇహమునందు సుఖము, పరమునందు కైవల్యపథము సంప్రాప్తించును.

గురు శబ్దనిర్వచనమైదు విధములని శాస్త్రము నందీ విధముగా నుడువబడినది.

1. గూఢుడు, 2. దృఢుడు, 3. ప్రీతుడు, 4. మౌన నిరతుడు, 5. సకృత్కామగతుడు.

1. గూఢుడు : ఆత్మజ్ఞాన సంయుతుడై పర దృష్టియం దుండుటకంగీరించక ఆశ్రమ వాసమొనరించువాడు

2. దృఢుడు : బ్రమ్హజ్ఞానియై పరులకు జ్ఞానబోధజేయుటకు లోక సంచార మొనరించువాడు.

3. ప్రీతుడు : ఏ విధమైన దృశ్య వ్యవహారములతో సంబంధము లేక సంతృప్తి నొందినవాడై, దృష్టి మాత్రము చేతనే భక్తులను తరింపజేయు వాడు.

4. మౌన నిరతుడు : మానసికమౌన సంయుతుడై, ఆ మౌనమును పరమాత్మయందు లీన మొనర్చి, లౌకికాచార వ్యవహార రహితుడై, బ్రహ్మానందము ననుభవించు చుండును. ధ్యానకేంద్రీకరణ మొనర్చి ఆశ్రితులను తరింప జేయును.

5. సకృత్కాముడు : లోక కల్యాణార్థమై మహా సంకల్పమొనర్చి, సంకల్ప మాత్రమున భక్తులను జ్ఞాన సంయుతులుగా నొనర్చి తరింపజేయువాడు

కావున పరిశీలన దృష్టితో గురువును నిర్ణయించుకొని, అట్టి గురువునుండి జ్ఞాన విద్య నార్జింపదగియున్నది. సద్గురువు యొక్క అనుగ్రహము నొందిన వారలకు ఇహపర జీవితములు సుఖ తరములగును.

స్వామి వివేకానంద రామకృష్ణపరమహంసను పరిశీలనమొనర్చి, సద్గురువుగా గ్రహించిన విషయమెల్లరకు సువిదితమే. భాగవతమునందలి యీ పద్యమును తిలకింపుడు

"హరి మహిమ తనకు జెప్పెడి
గురువున్నరుడనుచు దలచి కుంఠిత భక్తిన్
దిరుగు పురుషుశ్రమమెల్లను
కరి శౌచముక్రియ నిరర్థకంబగు నధిపా"



మనుజులచే సంపాదింపదగిన సద్విషయముల గూర్చి యీ సూత్రము నందు వివరింపబడుచున్నది.

సూ॥ కిం సంపాద్యం మనుజైః! విద్యావిత్తం బలం యశః పుణ్యమ్

అర్థము॥ మనుజులచే సంపాదింపదగినవి ఏవి! విద్య, ధనము, బలము, కీర్తి, పుణ్యము

తే॥ జ్ఞాన విద్యయు, సుగుణధనంబు, బుద్ధి
బలము, పరహిత సత్కీర్తి, పరగ పుణ్య
కర్మముల జేయు భావంబు గల్గి భక్తి
పరత దైత్యారి గొల్చుట భవ్యకరము.

మానవుడు కేవలము లౌకిక పరమగు విద్యనే కాక, పారలౌకిక పరమగు జ్ఞాన విద్యను పొందవలయును. ఆ రీతిగనే సద్గుణ మను ధనమును, విషయవాంఛలను నిగ్రహింప గల్గు బుద్ధిబలమును, పరులకు మేలొనరించు మంచి కీర్తియు, పుణ్య కర్మములొనరించుటయందాసక్తియు గల్గి, భక్తి భావముతో శ్రీ మహావిష్ణువును సేవించిన శ్రేయమొనగూరును.

ఇందు పేర్కొనిన జ్ఞాన విద్యయే యదార్థమగు విద్య. జ్ఞానేతరమగు విద్య అవిద్య న+విద్య అవిద్య "అనిత్యా శుచి దుఃఖానాత్మసు నిత్య శుచి సుఖాత్మఖ్యాతి రవిద్యా" నిత్యముకాని వస్తువును నిత్యమని తలంచుట, అపరిశుద్ధవస్తువును పరిశుద్ధమనుకొనుట, దుఃఖకరమగు వస్తువును సుఖకరమని భావించుట, ఆత్మేతర వస్తువును ఆత్మయని భావించుట అవిద్య. అవిద్యను దూర మొనరించునదియే జ్ఞానవిద్య. కావున మానవులు జ్ఞాన విద్యను పొందవలసి యున్నది.

మానవ మనుగడ కొఱకు ధన మావశ్యకము. అట్టి ధనము ధర్మముతో నార్జించినదై యుండవలెను. అధర్మపరమగు ధనము అనర్థము. "అర్థమనర్థం భావయ నిత్యం నాస్తి తత స్సుఖ లేస్సత్యమ్". కావున ధర్మయుక్తమగు ధనముతో సహా సద్గుణమను ధనము నార్జించవలయును. సద్గుణ ధనము శాశ్వతము భౌతికపర ధనమశాశ్వతము.

మనుజులు బలయుతులై యుండవలయును. ధర్మార్థకామ మోక్ష సాధనమునకు శరీరమావశ్యకము అట్టి శరీరమునకు బలమ వసరము, శారీరిక బలముతో సహా బుద్ధిబలమవసరము. బుద్ధిబలము వినా దేహబలము వృధా. మహాత్మాగాంధీ భారతదేశ స్వాతంత్ర్యమును సాధించుట బుద్ధిబలముతోడనే బుద్ధిబలము గలవారలకే దైవ బలము లభించును.

"బలయుతులకు దుర్బలులకు
బలమెవ్వడు నీకు నాకు బ్రహ్మాదులకున్
బలమెవ్వడు ప్రాణులకును
బలమెవ్వండట్టి విభుడు బలమసురేంద్రా".

సర్వజనులు సత్త్వగుణ ప్రధానమైన కీర్తినార్జింపవలయును. అదియే సత్కీర్తి. మఱియు సమస్త జనామోదకరము. రావణాదుల యొక్క కీర్తి దుర్మార్గయుక్తము. కావుననే వినాశకరమైనది.

సమస్త మానవులు పుణ్య కర్మల నాచరించుటయందాసక్తి గల్గియుండవలెను.

పుణ్య కార్యము లొనరించిన పుణ్యఫలము. పాపకార్యములాచరించిన పాప ఫలము సంభవించును.

"కరోతి సతతం యోహి తన్నామ గుణ కీర్తనం
కాలం మృత్యుం సజయతి జన్మరోగం జరాం భయమ్"

ఏ మనుజులు భగవానుని యొక్క నామ గుణములను కీర్తించుచున్నారో! ఆ మనుజులు కాలమును, మృత్యువును, జన్మమును, రోగమును, వృద్ధత్వమును, భయమును జయించు చున్నారు. "ధ్యేయం శ్రీపతి రూపమజస్రమ్" సదా శ్రీ మహావిష్ణుని యొక్క రూపమును ధ్యానింపవలెను. "సకృదపి యేన మురారి సమర్చా క్రియతే తస్య యమోఽపి న చర్చామ్" ఒక మారైనను చిత్త శుద్ధితో భగవానుని అర్చించినచో, అట్టివానికి యముని వలన భయము కలుగనేరదు.



ఆధ్యాత్మిక పరమగు బలమునకు అధైర్య మవరోధమని యీ సూత్రమునందు వివరింప బడుచున్నది.

సూ॥ కిమ్ ను బలం! యద్ధైర్యమ్.

అర్థము॥ బలమనగానేమి! ధైర్యము.

క॥ ధైర్యము జ్ఞానార్థులకని
వార్యము సద్భక్తియుక్త భగవత్పర స
త్కార్యాచరణంబునకున
ధైర్యము దృజియింప వలయు ధరణిన్ ప్రాజ్ఞుల్ 10

ఆధ్యాత్మిక పరమగు బలమే నిజమగు బలము. ఆధ్యాత్మిక బలము నార్జించుటకు ధైర్య మత్యావశ్యకము. ధైర్యహీనునకు హృదయ దౌర్బల్యమేర్పడును. కావుననే శ్రీ కృష్ణ పరమాత్మ, అర్జునుని గూర్చి "క్షుద్రం హృదయ దౌర్బల్యమ్" అని హెచ్చరించి, ఆధ్యాత్మిక తత్త్వమునంతయు నుపదేశమొనర్చినాడు ద్రౌపది, ప్రహ్లాదుడు, మకరిచే జిక్కినగజరాజు, ఆధ్యాత్మిక బలముతో వారలకు గల్గిన ఆపదను, నిర్మూల మొనర్చుకొని, ధన్యత నొందిన చరిత మెల్లరకు విదితమే.

అధ్యాత్మిక విద్య యందలి అష్టాంగ యోగములలో యమ నియమములందు, "ధృతి" అని వివరింపబడినది. ధృతి అనగా సత్కార్యాచరణమందును, ఆత్మ ధ్యానమునందును ధైర్యము గల్గియుండుట.

కావున మానవుడు యమ నియమముల ననుష్ఠించుచు, సత్కర్మానుష్ఠానమునందునధైర్యము ధృజియింపవలయును.

యమ నియమముల గూర్చి, యీ గ్రంథమున ద్వితీయ భాగమునందు సవిస్తరముగా వివరింపబడియున్నది. అవలోకింపుడు.



ధైర్యవంతునకు భయము కలుగనేరదు. నిర్భయత్వము వలలననే వైరాగ్యము స్థిరత్వము నొందును. కనుక గత సూత్రమునందు ధైర్యమును గూర్చి వివరించి, తదుపరి నీ సూత్రమునందు భయరహితమైన వైరాగ్యమును గూర్చి విశద మొనర్పబడుచున్నది.

సూ॥ కిమ భయమిహ! వైరాగ్యమ్

అర్థము॥ అభయమనగానేమి! వైరాగ్యము

క॥ వైరాగ్యముచే నభయము
ధీరత్వము జ్ఞానయుక్త ధీశక్తి సుసం
స్కారము శాంతంబున్ చే
కూరున్ నిత్యంబు నరులకున్ ధాత్రి దగన్ 11

వైరాగ్యమన విషయేచ్ఛారహితత్వము. విషయేచ్ఛలు మనస్సునందలము కొనినచో మానవుడు వివేక శూన్యుడగును. కామ క్రోధాదుల యందలి కోరికలే విషయేచ్ఛలు. "బలవానింద్రియ గ్రామో విద్వాంసమపి కర్షతి" ఇంద్రియ సమూహము బలవత్తరమైనది. విద్వాంసునైనను ఆకర్షించును. విద్వాంసుడైనను మనో నిగ్రహమును కోల్పోయినచో విషయలోలుడగును. కావున నింద్రియ వేగములను నిర్జించి, స్థిత ప్రజ్ఞతతో బ్రవర్తింపదగి యున్నది. ఇంద్రియ సమూహమునుగూర్చి, భగవద్గీతయందలి యీ శ్లోకమును గమనింపుడు. "సన్నియమ్యేంద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయఃతేప్రాప్నువంతి మామేవ సర్వభూతహితే రతాః" ఎవరు ఇంద్రియ సమూహమును సమగ్రముగ నిగ్రహించి, సర్వత్ర సమచిత్తము గల్గి, సమస్త భూతములకు మేలు నొన గూర్చుటయందాసక్తి గల్గియుందురో! వారు నన్ను పొందుదురు. అని కృష్ణ పరమాత్మ అర్జునునితో పలికియున్నాడు.

శుకమహర్షి పరిపూర్ణ విరాగుడు. శుకునకు స్త్రీపురుష భేదము లేదు. కావుననే యొకపరి అప్సరస స్త్రీలు వివస్త్రలై స్నానమొనరించుచు శుకుడు యేతెంచుచున్నను వస్త్రముల ధరించలేదు. తదుపరి నరుదెంచుచున్న వ్యాసుని గాంచి వస్త్రములను ధరించిన యుదంతము చరిత్రయందు గాన దగును. దీని వలన శుకమహర్షి యొక్క పరిపూర్ణ వైరాగ్యము విశదమగుచున్నది.

"కామాతురాణం నభయం నలజ్జా" కామాతురులగు మానవులకు భయము, లజ్జ యుండదు. మఱియు యశస్సు నశించును. విషయేచ్ఛారాహిత్యము, భయరహితము. దాని వలన ధైర్యము, జ్ఞానముతో గూడిన బుద్ధి బలము, సత్త్రవర్తనము, శాంతము సమకూరును.



వైరాగ్యమును గూర్చి వివరించిన తదుపరి వినయ స్వభావము గల వారల గూర్చి పేర్కొనబడుచున్నది.

సూ॥ కః పూజ్యో విద్వద్భిః స్వభావతః సర్వదా వినీతోయః

అర్థము॥ విద్వాంసులచే వినుతింపబడువారెవరు!

సర్వదా వినయ స్వభావము గలవారు

క॥ వినుతింతురు విద్వాంసులు
వినయసువిజ్ఞానయుక్త విమల మనస్కున్
కనుకన్ వినయము కడు మే
లని పల్కుదురెప్డు విజ్ఞులతి మోదమునన్ 12

వినయ శీలురను మఱియు జితేంద్రియులను వినీతులందరు. వినయ సంపన్నులకు సర్వకాల సర్వావస్థలయందు హర్షము చేకూరును. జితేంద్రియుడనగా యింద్రియ నిగ్రహము గలవాడు. "కాయ వాక్ చేతసాందమః" మనో వాక్కాయములచే నింద్రియ నిగ్రహము గల్గియుండవలెనని ఆయుర్వేదోక్తి. మఱియు భగవద్గీత యందలి యీ శ్లోకమును విలోకింపుడు "యదా సంహరతే చాయం కూర్మోంగానీవసర్వశః ఇంద్రియాణీం ద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠి తా" తాబేలు స్వకీయావయవములనేవిధమున స్వ శరీరమునందు సంకోచము నొనర్చుకొనునో ఆ విధముగనే మానవుడుతన యింద్రియములను విషయ వాంఛలనుండి మరల్చినచో వాని బుద్ధి స్థిరమైనదియగును.

అసమాన పరాక్రమ శాలియగు హనుమంతుడు వినయ స్వభావము గలవాడు గావుననే సాగరోల్లంఘన మొనర్చుటకు ముందుగా సూర్యుని, ఇంద్రుని,

వాయుదేవుని, బ్రహ్మదేవుని, భూతకోటిని గూర్చి అంజలి ఘటించి నట్లు రామాయణ మహాకావ్యము, సుందరకాండమునందలి యీ శ్లోకము వలన విశదమగుచున్నది.
"స సూర్యాయ మహేంద్రాయ పవనాయ స్వయం భువే భూతేభ్యశ్చాంజలింకృత్వా చకారగమనే మతిం"



ఈ సూత్రమునందు న్యాయయుక్తమగు యుక్తిని గూర్చి వివరింపబడుచున్నది.
సూ॥ కిమ్ శస్త్రం సర్వేషాం ! యుక్తిః
అర్థము॥ సమస్త మానవులకునేది శస్త్రము! యుక్తి

తే. అఖిల జనులకునాయుధం బౌచు బరగు
జ్ఞాన విజ్ఞాన సంయుక్త మైన యుక్తి
యుక్తిచే గల్గునిహపర శక్తి గాన
యుక్తి నిత్యంబు బుధులకు యుక్త మౌను. 13

యుక్తి యనను పాయమునకును, న్యాయమునకు నర్థము కలదు. న్యాయ యుక్తమగు యుక్తి సకల మానవులకు నెల్లవేళల యందు రక్షణ నొసంగును. న్యాయ రహిత యుక్తిచే నపకీర్తి ప్రాప్తించును. కావున మనుజులు అనవరతము న్యాయ బద్ధమైన యుక్తితో బ్రవర్తింప దగియున్నది.

కౌరవులకు పాండవులకు సంధి నొన,గూర్చు నిమిత్తమై, రాయబారిగా నరుదెంచిన కృష్ణ పరమాత్మను బంధింప బ్రయత్నించు కౌరవుల యొక్క యుక్తి న్యాయ విరుద్ధముగాన నాయుక్తి కౌరవ వినాశనమున కొక కారణమైన దను విషయము విదితమే.

"నశక్యతే మనోజేతుం వినాయుక్తి మనిందితాం అంకుశము లేనిచో దుష్టగజమును జయింప శక్యము కానట్లు, పవిత్రమగు యుక్తి లేనిచో మనస్సునుజయించుట దుర్లభము.



న్యాయ బద్ధమైన యుక్తిని గూర్చి విశదమొనర్చిన తదనంతరము, మానవ జీవితమునక త్యావశ్యకమైన శీలమును గూర్చిన విషయము వివరింపబడుచున్నది.
సూ॥ కో2లంకారః ! శీలమ్.
అర్థము॥ అలంకారముననేది ! శీలము.

క. శీలము నరులకు మూలము
శీలము సౌందర్య మౌను శీలము ధనమౌ
శీలంబాధ్యాత్మిక పరి
శీలకులకు హర్షమౌను చింతింపంగన్. 14

శీలమన సత్ప్రవర్తనము. శీలముగల మానవులకు సర్వదా సంతసము సమకూరును. మానవులు ధనాదిసంపదలను గోల్పోయినచో, మరల నా సంపదలను సమకూర్చుకొనవచ్చు. కాని శీలము గోల్పోయిన మరల నా శీలము సమకూరుట సంభవము కానేరదు. సత్ప్రవర్తనముచే నాధ్యాత్మిక తత్త్వమలవడును. ఆధ్యాత్మిక తత్త్వమన జ్ఞానము. మానవుడు దేనిని గ్రహించిన తదుపరినిక గ్రహింప దగినది లేదో అదియే ఆధ్యాత్మిక తత్త్వము. ఆధ్యాత్మిక తత్త్వవేత్తలకు శీలము సర్వదా అలంకారము. సుశీలః కరుణా మృదుః అని ఆయుర్వేదోక్తి.



శీలమును గూర్చి వివరించిన పిదప, సుస్థిరము పవిత్రమునైన సత్యము వివరింపబడు చున్నది.

సూ॥ కిం వాచ్యః మండనమ్ ! సత్యమ్.

అర్థము॥ ఏది పలుకదగిన భూషణము ! సత్యము.

తే. ఆత్మ సత్య స్వరూపమై యలరుగాన
సత్య భాషణమే శాస్త్ర సమ్మతంబు
సత్యవచనంబు వలననే సర్వజనుల
వాక్కు శోభను గాంచును నిక్కువముగ 15

ఎప్పటికిని మార్పుజెందక సుస్థిరముగా నుండునది సత్యము. కావుననే నిర్వికారమగు ఆత్మ సత్య స్వరూపమగుచున్నది. శాస్త్ర సమ్మతమైన సత్య భాషణము వలన సర్వ జనుల యొక్క వాక్కు పవిత్రత నొందును. వాక్కు యొక్క అధిష్ఠాన దేవత అగ్ని అని ఆయుర్వేద శాస్త్రమునందు "వచసోర్గ్నిః" అని నుడువబడినది. అగ్ని మలిన రహితము, పవిత్రమునైనది. ఆ రీతిగానే సత్యవాక్కు అతి పవిత్రము. వాక్కు మనస్సు నుండి వెలువడుచున్నది. మనస్సునకు స్థానము హృదయము. మనస్సు నుండి యుద్భవమైన వాక్కు, అవసాన సమయమున మనస్సునందే విలీనమగుచున్నది. ఇది వేద సమ్మతము. "అస్య సోమ్య పురుషస్య ప్రయతో వాఙ్మనసి సంపద్యతే, మనః ప్రాణే ప్రాణః తేజసి, తేజః పరస్యాం దేవతాయామ్, అని . సత్యవ్రతము

నధిగమించిన వ్రతము మరియొకటి లోకమున గానరాదు. సత్య వ్రతమును గూర్చి మహాభారతము నందలి యీ శ్లోకమునవలోకింపుడు.

"తపశ్శౌచవతానిత్యం సత్య ధర్మరతేనచ
మాతా పిత్రోరహరహః పూజనం కార్యమంజసా"

మఱియు భగవద్గీతయందు వాచికతపస్సును గూర్చి "అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియ హితంచయత్ స్వాధ్యాయాభ్యసనం చైవ వాంగ్మయం తప ఉచ్యతే, ఉద్వేగకరములగు వాక్యములంబలికి, అన్యులకు చిత్తక్షోభనొనరింపదగదు తస్యమును పరులకు యిష్టమైనదియును, మేలొనరించు నదియు నగు భాషణము లును, మఱియు స్వాధ్యాయాభ్యసనము వాచిక తపస్సని పేర్కొన బడుచున్నది.

"సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్, న బ్రూయాత్ సత్యమ ప్రియమ్" ప్రియమగు సత్యమును పలుక దగియున్నది. అప్రియమగు సత్యమును పలుకరాదు. సత్యమును విస్మరించుట అసురీ సంపద అని భగవద్గీతయందీవిధముగా వివరింపబడినది. "ప్రవృత్తించ నివృత్తించ జనాన విదురా సురాః న శౌచం నా పి చా22రో న సత్యం తేషు విద్యతే "వాక్ సత్య వచనార్థాయ" మహాభారతము నందలి యీ సూక్తి ననుసరించి, వాక్ సత్యవచనము కొఱకని గ్రహింపదగియున్నది.

"దత్త మిష్టం హుతంచైవ తప్తానిచ త పాంసిచ
వేదాః సత్యప్రతిష్ఠానాః తస్మాత్సత్య పరోభవేత్" (రామాయణము)

దానములు, యజ్ఞములు, హోమములు, తపస్సులు, వేదములు సత్యమునందే ప్రతిష్ఠితమై యున్నవి.

కావున మానవుడు సత్యపరుడై ప్రవర్తించవలెను.

"ఆ హుస్సత్యం హి పరమం ధర్మం ధర్మవిదో జనాః" (రామాయణము)

ధర్మవిదులగు జనులు సత్యమే పరమ ధర్మమని పలుకుదురు.

సత్యమును గూర్చి యీ గ్రంథమునందు ద్వితీయ భాగమునవలోకింపుడు.

"యే మిథ్యావాదినస్తాత దయా సత్య విహీనకాః
నిందకా గురుదేవానాం తే షాం భారేణ పీడితా"

అసత్యవాదులు, దయారహితులు, సత్యాచరణ విహీనులు, గురుదైవములను నిందించు వారునగు పాపాత్ముల భారమును వహింపలేకున్నావని భూమాత విధాతకు విన్నవించుకొనినట్లు బ్రహ్మవైవర్త పురాణమునందు గలదు. అసత్యము పాపహేతువని విశదమగుచున్నది.



లోభత్వము దుఃఖమునకు మూలమని యీ సూత్రమున పేర్కొనబడుచున్నది.

సూ॥ కిం శోచ్యమ్! కార్పణ్యమ్

అర్థము॥ దుఃఖింపదగినదేది! లోభత్వము

క॥ కార్పణ్యముచే దుఃఖం
బేర్పడునిది నిశ్చయంబు యిహపరములలో
నేర్పున ద్యాగముతోనా
కార్పణ్యము వీడుటొప్పు గ్రక్కున విజ్ఞుల్

ధనవంతుడగు లోభికంటె, సద్గుణ సంపన్నుడగు పేద మేలని యొక కవి వ్రాసిన ఈ పద్యమును చదువుడు.

"కలిమిగల లోభి కన్నను
విలసితముగ పేదమేలు వివరింపంగా
జలచెలను మేలు కాదా
కులనిధి యంబోధికన్న గువ్వల చెన్నా"

శారీరిక వేగనిరోధము నిషిద్ధమనియు, మానసికమైన లోభశోకాదివేగ నిరోధమావశ్యకమని వివరించిన వైద్య శాస్త్రమునందలి యీ శ్లోకములను గమనింపుడు.

- శారీరిక వేగ నిరోధము రోగప్రాదుర్భూత హేతువు -

"నవేగాన్ ధారయే ద్ధీమాన్ జాతాన్మూత్రపురీషయో:
నరేతసో, న వాతస్య, నచ్ఛర్ద్యాః, క్షవథోర్నచ.
నోద్గారస్య, నజృంభాయాః, నవేగాన్, క్షుత్పిపాసయోః,
న బాష్పస్య, న నిద్రాయాః, నిఃశ్వాసస్య శ్రమేణ చ.
ఏతాన్ధారయతో జాతాన్ వేగాన్ రోగా భవంతియే.

ఈ విధమగు వేగనిరోధముచే తత్కారణ సంబంధమగు వ్యాధులు సంభవించు చున్నవి. ఇక లోభాది మానసిక వ్యాపార వేగనిరోధము వివరింపబడుచున్నది.

లోభాది మానసిక వ్యాపార వేగ నిరోధమిహపరలోకహితము

"ఇమాంస్తు ధారయేద్వేగాన్ హితార్థీప్రేత్య చేహచ
సాహసానామశస్తానాం మనో వాక్కాయ కర్మణామ్.
లోభశోక భయక్రోధమాన వేగాన్ విధారయేత్
నైర్లజ్జేర్ష్యా తిరాగాణామభిధ్యాయాంశ్చ బుద్ధిమాన్.

- అప్రశస్తవాక్య వేగనిరోధము -

"పరుషస్యాతి మాత్రస్య సూచకస్యా నృతస్య చ

వాక్యస్యా కాలయుక్త స్యధారయే ద్వేగముత్థితమ్,

- అప్రశస్త శరీర వ్యాపారవేగ నిరోధము -

దేహ ప్రవృత్తి ర్యాకాచిత్ విద్యతే పరపీడయా

స్త్రీభోగ స్తేయ హింసాద్యా తస్యా వేగాన్ విధారయేత్,

లోభము, శోకము, భయము, క్రోధము, మానము, నైర్లజ్జము, అతిరాగము, అభిధ్యానము అను నీ యెనిమిది మానసిక వ్యాపారములు.

ఈ మానసిక వ్యాపారముల యొక్క నిర్వచనము విశదముగా వివరింపబడు చున్నది. అవలో కింపుడు.

ఉచితములు గాని విషయముల యందు నేర్పడిన ఆశ లోభము. పుత్ర పత్నీ ధనాదులకు హాని సంభవించునప్పడు మనస్సునకేర్పడు దీనత్వము శోకము. తనకపకారము ప్రాప్తించునను శంకచే గల్గు మనోదైన్యము భయము. తనకు అనుకూలముగాని అపకారాదులు కల్గినపుడు యేర్పడు మనో వికారము క్రోధము. తనయందు సద్గుణములనైనను, దుర్గణములనైన నారోపించుకొని తానే అధికుడనని తలంచుట మానము. జుగుప్సాకరములగు గుహ్యావయవముల నాచ్ఛాదించుట యందిచ్ఛ గల్గియుండుట లజ్జ. దానికి వ్యతిరిక్తముగ లజ్జను విడిచియుండుట నైర్లజ్జము. సర్వ సమాన మైన ద్రవ్యమునందు యితర సంబంధము కల్గుటకు సహింపకుండుట ఈర్ష్య ఉచిత మైన విషయములయందును మాటికి మాటికి బ్రవర్తింపవలెనను కోరిక అతిరాగము. పరద్రవ్యము నందలి ఆశ, లేక పరులకు ద్రోహమొనరించుట యందిచ్ఛ అభిధ్యానము. ఇవి మానసికము.

ఇక అప్రశస్త వాక్యములు వివరింపబడుచున్నవి. పరులకు కష్టమును కల్గించు వాక్యము పరుషము. మితిమీరిన సంభాషణము అతిమాత్రము. ఒకరికి ద్వేషము కల్గునట్లు చాడీలు చెప్పట సూచకము. అర్థరహితమైన వాక్యము అనృతము. దేశకాలాదులకు సంబంధము కాని అపృచ్ఛా సంభాషణము అకాలయుక్తము. ఇవి వాచికము.

తదుపరి అప్రశస్త శరీర వ్యాపారములు వివరింపబడుచున్నవి.

పరస్త్రీ సంభోగము, పరద్రవ్యము నపహరించుట, జీవహింస మున్నగు కార్యములు, పరులకు కష్టమొన గూర్చు కార్యములు. ఇవి శారీరికము.

ఇహ పరలోక సౌఖ్యమునా కాంక్షించు ప్రాజ్ఞులగు మనుజులు యీ పైన వివరింపబడిన మనోవాక్కాయ సంబంధ వ్యాపార వేగములను నిరోధింప వలయును.

- త్రివిధవేగధారణము వలన లభించు సత్ఫలితము -

"పుణ్యాశబ్దో విపాపత్వాన్మనో వాక్కాయ కర్మణామ్
ధర్మార్థ కామాన్ పురుషః సుఖీ భుఙ్క్తే చివోతిచ"

పైన వివరించిన నియమములననుసరించి, ప్రవర్తించు మానవునకు మనస్సు వాక్కు శరీరము అనునట్టి త్రికరణములకు సంబంధించిన కర్మల యొక్క పాపములు నిశ్శేషముగ నశించి పుణ్యశబ్దముచే పేర్కొనబడిన వాడై యీ లోకమున ధర్మము, అర్థము, కామము అను త్రివర్గసంబంధమగు ఆనందము ననుభవించి పరమార్థ తత్వమైన కైవల్యమునకు వలయు పుణ్య విశేషమును సంపాదింపగలడు.

లోభత్వము త్యాగము వలననే నిర్మూల మగును. త్యాగి కానేరని ధనికుని యొక్క కార్పణ్యము నిక్కముగా శోకమునకు మూలము.

"ఆ పన్నార్తి ప్రశమన ఫలాస్సంపదోహ్యుత్త మానామ్"

ఉత్తముల యొక్క సంపదలు ఆపన్నుల యొక్క దుఃఖమును నివారణమొనరించుటకు ప్రయోజనవంతములై యుండదగి యున్నవి. ఇది మేఘ సందేశ మహా కావ్యమునందలి సూక్తి.

లోభమును గూర్చి వివరింపబడిన ఆంధ్రమహా భారతమునందలి యీ పద్యమును తిలకింపుడు.

"వియత తపమును నింద్రియ నిగ్రహంబు
భూరి విద్యయు శాంతికి గారణములు
వాని యన్నిటికంటె మేలైన శాంతి
కారణము లోభముడుగుట కౌరవేంద్ర.



గత సూత్రమునందు శోకింపదగినది కార్పణ్యమని వివరించి, కార్పణ్యమును నిర్మూలించునది ఔదార్యము గాన సంపదలలో ప్రశస్తమైనది ఔదార్యమని యీ సూత్రము నందు వివరింపబడు చున్నది.

సూ॥ సద్వి భవే కిం ప్రశస్తం ! ఔదార్యమ్.

అర్థము ॥ సంపదలలో ప్రశస్తమైన దేది ! ఔదార్యము.

క. నరులకుదారతచే సుం
దరతర రూపము సుకీర్తి ధన సద్వాంఛల్
సురుచిరమై శోభిల్లున్
నిరతం బౌదార్యయుక్త నిష్ఠయె మేలౌ. 17

ఔదార్యమన దానశీలత. ఔదార్య రహితమైన సంపద అప్రశస్తము.

"దాన శీల దయా సత్యవ్రత ధర్మపరాయణః"

అని వైద్య శాస్త్రమునగలదు. మానవుడు దాన శీలుడుగా మనవలెనని అర్థము ఔదార్యము లేని మానవులు నిక్కముగా లేనివారలని నుడివిన భాగవతము నందలి యీ పద్యమునవలోకింపుడు.

"అన్నమైన దోయమైన ద్రవ్యంబైన
శాకమైన దనకు జరుగు కొలది
నతిథిజనుల కడ్డ మాడక యిడరేని
లేమి! వారు కలిగి లేని వారు॥

ఔదార్యమే నిజమగు సంపద ఔదార్య సంయుతులగు మానవులు కీర్తితో శోభిల్లుదురు.

"ధనమును, భ్రాతశ్ఛాయయు,
వనితాజన యౌవనంబు, వండిన యన్నం
బును, గడు మూర్ఖ స్నేహం
బును, నిలనివియల్పకాల భోగ్యములరయన్"

అను విధమున దనము శాశ్వతము కానేరదు.



ప్రాజ్ఞులైన మానవులు పరదోషముల గూర్చి భాషించుట దురిత హేతువని యీ సూత్రమునందు వివరింపబడుచున్నది.

సూ॥ కోహినవాచ్యః సుధియా! పరదోషశ్చానృతం తద్వత్

అర్థము॥ ప్రాజ్ఞుల చేత పలుక దగనిది ఏమిటి?
పరదోషములు, అసత్య వచనములు.

తే. పరుల దోషంబులెన్నడు బలుక దగదు
సత్యభాషణమే సదా సౌఖ్యదంబు
విప్రలాపాభిశాప సంవితథములను
పలుకనొల్లరు ప్రాజ్ఞులు ప్రతినమీతి 18

మనుజులు స్వకీయదోషములను వ్యక్తమొనర్పక, పరుల దోషముల గూర్చి భాషించుట దోషహేతువు. మఱియునసత్యవచనములు సర్వదా పరిహారణీయములు. పరదోషములంగూర్చి పలుకుట వలన ప్రయోజనమించుకయు లభించదు. స్వచిత్త దౌర్బల్యము వ్యక్తము కాగలదు.

అసత్యమును వచించిన పిదప నా యసత్యము వ్యక్తమైన తదుపరి నా యసత్యము న వ్యక్త మొనరించు ప్రయత్నమునకై మరల నసత్యమునే పలుకవలసిన దుస్థితి యేర్పడును. కాని అసత్యము వ్యక్తమగుచునే యుండును. కనుక సత్య వ్రతము సర్వదా శ్రేయస్కరము.

యమ నియములతో తొలుత నహింసా వ్రతమును గూర్చి పేర్కొని తదుపరి సత్యవ్రతమును గూర్చి వివరింపబడియున్నది. యమ నియమముల గూర్చి యీ గ్రంధము నందు ద్వితీయ భాగమున 2 మఱియు 14వ పద్యముల వివరణ పరిశీలింపుడు. యమ నియమము లాధ్యాత్మిక విద్య కొఱకత్యంతావశ్యకములని గ్రహింపవలసియున్నది.



నాస్తికత్వము అంధత్వముతో సమానమని పేర్కొని, నాస్తికత్వ నిర్మూలన మొనరించవలెనని యీ సూత్రము నందు విశదీకరింపబడుచున్నది.

సూ॥ చక్షుష్మంతో2ప్యంధాః కోస్యుః యే నాస్తికా మనుజాః

అర్థము॥ నేత్రములున్నను గ్రుడ్డివారలెవరు! నాస్తికులు

క॥ కన్నుల విల్తుని జనకున్
చెన్నుగనుల్లంబునందు చింతింపనియా
కన్నులు గల మనుజున్ భువి
కన్నులు గల గ్రుడ్డివానిగా దలచ వలెన్. 19

"సుర రక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు" అని పోతనామాత్యుడతిరమ్యముగా రచించిన పద్యమెల్లరకు విదితమే. సర్వోపగతుడైన సర్వేశ్వరుని సర్వత్రా దర్శించుటయే నేత్రముల యొక్క సార్థకత. సర్వము విష్ణుమయంబని తలంచి, సర్వభూత సమహితత్వము వహించి, సమభావముతో ప్రవర్తించు మానవులకు నిశ్రేయసానందము నిశ్చయముగా సంప్రాప్తించును. కన్నులుండియు భగవత్తత్వమును గాంచనేరని మనుజులు నిక్కముగా గ్రుడ్డివారలే.

పూర్వము జాబాలి రామునితో "నాస్తికవాదమొనర్చి, సుస్థిరమైన ఆస్తికత్వమును ప్రపంచమునకు విశదమొనర్చి యున్న చరిత మెల్లరకు సువిదితము.

ఆధునిక కాలమునందు నాస్తికులుగా బ్రవర్తిల్లిన మానవులు యదార్థమునరయలేకపోలక, నిరర్థక హేతువాదముతో కాలమును వృధా యొనరించుట శోచనీయము.

"నారాయణేతి యస్యాస్తే వదనే నామ మంగళం
నారాయస్తమన్వేతి వత్సం గౌరీవ వత్సల"



నాస్తికత్వమును నిరసించిన తదుపరి నీ సూత్రము నందు అకార్యములొనర్చుట అంధత్వమని వివరింప బడుచున్నది.

సూ॥ కోఽన్ధో! యోఽకార్యరతః

అర్థము॥ అంధుడెవరు! అధర్మకార్యము లొనర్చువాడు

శా॥ మూఢాచారమసత్య భాషణములన్ మూర్ఖ స్వభావంబు సం
రూఢిన్ మీటెడు వర్తనంబు బహుగర్వోపేత చిత్తంబు నా
రూఢంబైన దయా విహీనమతి దుష్కృత్యంబు నాస్తిక్యమున్
గాఢంబౌరిపుషట్క వర్గములిలన్ కాకృత్యమంధత్వమౌ 20

"సుఖార్థా స్సర్వ భూతానాం మతాస్సర్వా ప్రవృత్తయః
సుఖంచ న వినా ధర్మాత్ తస్మాత్ ధర్మపరో భవేత్॥

అను ఆయుర్వేద సూక్తి ననుసరించి, ఇహ పర సుఖమునభిలషించు మానవులు ధర్మపరులై జీవించవలసి యున్నది. అధర్మ కార్యము లొనర్చువారలకు సుఖమిసుమంతయు చేకూర నేరదు. పతనము నిశ్చయము. అధర్మకర్మనిరతుల నంధులని యిందు పేర్కొనబడియున్నది. అందులన గ్రుడ్డివారని అర్థము. భౌతిక శరీరసంబంధమగు నేత్రములు చరాచరాత్మకమగు నీ ప్రపంచము నవలోకించుటకు బ్రయోజన వంతములగు చున్నవి. ఆధ్యాత్మిక పరమగు ధర్మమునవలోకించుటకు ధర్మశాస్త్రానుసారము బుద్ధిని మరల్చుకొనవలసియున్నది. ఇదియే జ్ఞాన దృష్టి. ఆధ్యాత్మిక ప్రపంచమును వీక్షించుటకు జ్ఞాన చక్షువులత్యంతావశ్యకములు. ఈ విషయము వైద్య శాస్త్రమునందీ విధముగా విరింపబడియున్నది.

"నశక్య శ్చక్షుషాద్రష్టుం దేహే సూక్ష్మతమో విభుః
దృశ్యతే జ్ఞాన చక్షుర్భి స్తపశ్చక్షుర్భిరేవచ"

దేహమునందంతరాత్మ స్వరూపుడై సూక్ష్మతముడై యున్న పరమాత్మను

సామాన్య నేత్రములతో వీక్షించుట శక్యము కాదు. జ్ఞాన నేత్రముల చేతను, తపోనేత్రములచేతను వీక్షించుట సాధ్యము. భగవద్గీత యందలి యీ శ్లోకమును తిలకించుడు...

"యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తిసంయమీ,

యస్యాం జాగ్రతి భూతాని సానిశా పశ్యతో మునేః"

అను నీ శ్లోకము యొక్క భావమిదియే. సామాన్య మానవులకు నంధకారమువలె గోచరించు ఆధ్యాత్మిక తత్త్వము యోగీశ్వరులకు జ్యోతిస్స్వమానమై భాసిల్లును. అట్టి ఆధ్మాత్మికతత్త్వమును గ్రహించిన వారలు కడు ధన్యులు. దీనికి వ్యతిరిక్త తత్త్వము గల మానవులు యదార్థముగా నంధులనియే భావించవలసి యున్నది. శ్రీరామాయణ మహాకావ్యమునందలి యీ శ్లోకమును పరిశీలింపుడు.

"ధర్మాదర్థః ప్రభవతి ధర్మాత్ప్రభవతే సుఖం

ధర్మేణ లభతే సర్వం ధర్మసారమిదంజగత్"

ధర్మము వలన అర్థము, సుఖము సంభవించును. ధర్మము వలన సర్వము లభించును. ఈ జగత్తు ధర్మసారమైనది. కావున మానవులు ధర్మ నిరతులై వర్తించుట శ్రేయోదాయకము.

అధర్మకార్యము లొనర్చుట సర్వదా నిషిద్ధము. "ధర్మాన్న ప్రమదితవ్యం" అని ఉపనిద్వాక్యము. ధర్మమును గూర్చి ప్రమాదము పొందకుము.

ధర్మమతి విశిష్టమైనది గావుననే యీ సూత్రమునందు అధర్మకార్య నిరతులు అంధులని వివరింపబడినది.



అధర్మ కారము లొనర్చు వారలు అంధులని గత సూత్రము నందు వివరించి, ఈ సూత్రము నందు హితవచనములు వివనివారు బధిరులని వివరింపబడుచున్నది.

సూ॥ కో బధిరో! యో హితాని న శృణోతి

అర్థము॥ బధిరుడెవరు! హితోక్తులను విననివారు

క॥ బధిరుండన నొప్పున్ స

ద్బుధవర్యప్రోక్తసంహితోక్తుల నెలమిన్

విధి పరసద్విషయంబుల

విధి విహితము మీఱ వేడ్కవినని మనుష్యున్ 21

బధిరుడన! చెవిటివాడు. ఆధ్యాత్మిక సద్విషయములను విననివానిని

బధిరుడనియే భావించవలసియున్నది. భగవానుడు మానవులకు శ్రోత్రేంద్రియముల నొసంగినందులకు సద్విషయములను విని, శ్రోత్రేంద్రియముల యొక్క సార్థకత నొందవలయును. విషయాభిలాషియై! భగవానుని విస్మరించి, సత్పురుషుల సద్వచనములను విననొల్లక ప్రవర్తించుట అవివేకము. ఆధ్యాత్మిక సద్విషయములను పరస్పరము బోధించుకొనుట ఉత్తమమని భగవద్గీత యందు "బోధ యంతః పరస్పరమ్" అని నుడువడినది. విశ్వమయుడైన శ్రీ మహావిష్ణువుయొక్క పవిత్ర చరిత్రలను విను చెవులే చెవులు కాగలవని అక్షరు కథలాలకించు కర్ణములే కర్ణములై విలసిల్లు బో భువిన్" అను ఆంధ్ర మహాభాగవతమునందలి పద్యమెల్లరకు సువిదితమే. మఱియు

" ఏ కథలయందు పుణ్య
శ్లోకుడు హరి చెప్పబడునొ సూరి జనులచే
నా కథలు పుణ్యకథలని
యా కర్ణింపుదురు పెద్దలతి హర్షమునన్"

పుణ్య శ్లోకుడైన శ్రీహరి యొక్క పుణ్య కథలను వినుట శ్రేయోదాయకము" దిశశ్శ్రోత్రస్య" అను ఆయుర్వేద వచనానుసారము చెవులకు దిక్కులు అధిష్ఠాన దేవతలు. అట్టి అధిష్ఠాన దేవతలతో గూడిన శ్రోత్రేంద్రియములచే సర్వ జగత్తునకు దిక్కు అగు సర్వేశ్వరుని పుణ్య చరితము వినదగియున్నది.

రావణ దుర్యోధన మహాబల శాలురు హిత వచనములను విననొల్లక పతనము నొందిన యుదంతమెల్లరకు సువిదితము. కనుక భగవత్పర విషయములను, సత్పురుష ప్రోక్త హిత వచనములను నిరంతము వినుట హర్షదాయకము.

భగవత్కథనంబులం గూర్చి భాగవతమునందలి యీ పద్యము నవలోకింపుడు

"పరిభూత వ్యథనంబులు
నిరుపమ సంసార జలధి నిర్మథనంబుల్
నరకేసరి కథనంబులు
పరి రక్షిత దేవ యక్షఫణి మిథునంబుల్

మఱియు విష్ణుచరిత శ్రవణము తొలుత నుడువ బడిన యీ శ్లోకమును పరిశీలింపుడు.

"శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్॥

గాన భగవచ్చరిత శ్రవణమున కత్యంత విశిష్టత కలదని వ్యక్తమగుచున్నది.

భగవచ్చరితామృతము శ్రవణమంగళమని భాగవతమున గోపికా గీతములందలి యీ శ్లోకము వలన వ్యక్తమగుచున్నది.

"తవ కథామృతం తప్త జీవనం
కవిభిరీడితం కల్మషాపహం
శ్రవణ మంగళం శ్రీమదాతతం
భువిగృణంతితే భూరిదాజనాః"

నీ కథామృతము తప్త జీవులకు జీవనము, కవి జన ప్రకీర్తితము, పాపహరము, శ్రవణ మంగళము, శ్రీయుక్త సర్వవ్యాప్తము అట్టి నీ చరితామృతమును ధరణిలోనే మానవులు గాన మొనరింతురో! ఆ మానవులు మహాదాతలు అని గోపికలు కృష్ణుని గూర్చి పలికి యున్నారు.



గత రెండు సూత్రములయందు అంధుని గూర్చి బధిరుని గూర్చి వివరించి, తదుపరి నీ సూత్రమునందు మూ గజనుని గూర్చి పేర్కొనబడుచున్నది.

సూ॥ కో మూకో! యః కాలే ప్రియాణి వక్తుంన జానతి

అర్థము॥ మూగవాడెవరు! సద్విషయములను సకాలమునందు పలుకనివాడు.

ఉ॥ **సారమతిన్ సకాలమున సద్విషయంబులు పల్కకున్న శ్రీ**
శౌరి పవిత్రనామమును సంతతమున్ స్మరియింప కున్న వ
వ్వారలు మూగవారలని వాస్తవమొప్పగ బల్కుచుంద్రు యీ
ధార ణి కో విదోత్తములుదంచిత రీతిని సంతసంబునన్ 22

ప్రియమగు సద్విషయములు పల్కుచు, సద్వాక్కులతో సంచరించువారలు సర్వకాలముల యందు సంతసము నొందుదురు. పూర్వాభిభాషీ సుముఖః" అని వైద్య శాస్త్రమున వివరింప బడినది. సుముఖతతో ప్రధమముననే భాషించవలెనని భావము. మఱియు వైద్యశాస్త్రమునందలి యీ శ్లోకమును గమనింపుడు.

"భక్త్యా కల్యాణ మిత్రాణి సేవేతేతర దూరగః
హింసాస్తేయాన్యథా కామం పై శున్యం పరుషానృతే"

అను వైద్య శాస్త్ర సూక్తి ననుసరించి, పరుష వాక్కులతో పరులను హింసించుట

దోషము. సాధు భాషణములు సర్వజన హర్షణీయములు. యుక్తమగు సద్విషయములంబలుక నోళ్లని వారలను మూగవారలనుట అతిశయోక్తి కానేరదు.



అంధుని, బధిరుని, మూగవానిని గూర్చి వివరించిన పిమ్మట, కుంటివానిని గూర్చి వివరింప బడుచున్నది. అంధత్వము, బధిరత్వము, మూకత్వము, పంగుత్వము మానవ భౌతిక జీవనమున కవరోధములే. ఈ ఇంద్రియ వ్యాపారములు లోపభూయిష్టము కాకపోయినను ఆధ్యాత్మిక పరమగు ఆచరణ శూన్యమైనచో ఆ యింద్రియ వ్యాపారముల యొక్క ప్రయోజనము నిష్ఫలమని యీ సూత్రములందు వివరింప బడినది. పంగుడన కుంటివాడు. భౌతికముగా కుంటితనము లేకపోయినను, తీర్థయాత్రాచరణ శీలి గానిచో కుంటివాడనియే యిందలి భావము.

సూ॥ కః పంగురిహ ప్రథితో!
వ్రజతిచయో వార్థకే తీర్థం

అర్థము॥ కుంటివాడెవరు! వార్థక్యంలో తీర్థయాత్రలొనరించువాడు.

శా॥ ప్రాయంబందున తీర్థయాత్రలను సద్భక్తిన్ సదా దీక్షతో
జేయంజాలక వృద్ధుడైన పిదన్ జేయంగ నుద్యుక్తుడై
కాయంబందున శక్తి లేమికతవన్ కాంక్షాప్రతిష్టబ్ధతన్
దాయం జేరనివాడు పంగుడగుతథ్యం బొప్పనీపృథ్విలోన్ 23

ఉ॥ యాత్రలొనర్చివన్ శుభము లంచిత రీతిని బొందగాదగున్
ధాత్రిన టంచు మానవులు ధర్మ పథంబును మీఱియున్ననా
యాత్రలు విఫలంబులగు వార్య సమాజము మెచ్చదెచ్చటన్
పాత్రత మీఱ ధర్మముల బ్రాజ్ఞతతో నొనరింప హర్షమౌ 24

తే॥ ధర్మజీవన తీర్థయాత్రలను జనులు
నిత్యమొనరింప శ్రేయంబు సత్యమిదియె
వయసు గతమయ్యె నంచును వగచుకంటె
ప్రాయమున జేయు యాత్రలు పావనంబు 25

జీవితమశాశ్వతము గాన సకాలమున దైవ దర్శనము కొఱకు తీర్థయాత్రల నొనరింపవలయును. ప్రాపంచికపరవిషయాభిలాషతో కాలమును వృథా యొనరించక భగవానుని దర్శించుటకు ప్రయత్నింప వలయును. ఆహార నిద్రాభయమైథునంచ సామాన్యమేతత్పశుభిర్నరాణాం, జ్ఞానం విశేషః ఖలు

మానవానాం జ్ఞానేన హీనః పశుభిస్సమానః" ఆహార నిద్రా భయమైధునములు పశువులకును, మానవులకును సమానము. మానవులకు జ్ఞానము విశేషముగా గలదు. జ్ఞాన పథమున గమన మొనరించని మానవుడు పశుతుల్యుడే. జ్ఞాన సంయుతుడై, భగవద్దర్శనాభిలాషియై, మనోవాక్కాయ కర్మలచే గమన మొనరించుటయే తీర్థయాత్ర.

భగవద్విషయమై అలసత్వమొనర్చు వారలు యదార్థముగా కుంటివారలే.

మానవుని తరింపజేయు ప్రదేశమును తీర్థమందురు. అట్టి తీర్థమును బాహ్యముగాను, ఆంతరంగికముగాను వీక్షించవలయును. ఆంతరంగిక తీర్థమన ఆత్మ విద్య. పరమాత్మకును, జీవాత్మకును అభేదమగు అనుభవము సిద్ధించుటయే ఆత్మవిద్య. బాహ్య తీర్థమన పుణ్యప్రదేశము.

"హరి యందు జగములుండును
హరి రూపము సాధు పాత్రమందుండు శివం
కరమగు పాత్రము గలిగిన
నరయగనది పుణ్య దేశమనఘ చరిత్రా
(ఆంధ్ర మహాభాగవతము)
"తీర్థములు మానసములు ముక్తిప్రదములు
తరుణి యివి మేలు బాహ్య తీర్థముల కంటె
మానవుండివి యే మతి మధురవాణి
బాహ్య తీర్థంబులాడ నిష్ఫలము సూవె" (కాశీ ఖండము)

"క్షమా తీర్థం తపస్తీర్థం తీర్థ మింద్రియ నిగ్రహః
సర్వ భూత దయాతీర్థం ధ్యాన తీర్థమనుత్తమమ్"

మానసిక తీర్థములు మోక్ష ప్రదములు బాహ్యతీర్థములకంటె మానసిక తీర్థములు మేలు.

ఓర్పు గలిగియుండుట తీర్థము. తపస్సొనరించుట తీర్థము. ఇంద్రియ నిగ్రహము తీర్థము. సకల జీవులయందు కరుణ గల్గియుండుట తీర్థము. అత్యంతము ఉత్తమమైనది ధ్యాన తీర్థము.



వార్ధక్యమున తీర్థయాత్రలొనరించు మానవుడు కుంటి వాడని పేర్కొనిన పిమ్మట ముఖ్యమైన తీర్థయాత్రను గూర్చి వివరింపబడుచున్నది.

సూ॥ కిం తీర్థమపిచ ముఖ్యం! చిత్త మలం యన్నివర్తయత్

అర్థము॥ ముఖ్యమైన తీర్థయాత్ర ఏది!

మనోమాలిన్యమును నివారించునది.

మ॥ అరిషడ్వర్గము మానవాళికెపుడున్ అత్యంత హీనంబు, దు
ర్భర మౌనాపదలన్ యొనర్చుభువిలో భావింప చిత్తంబునం
దరయన్ నయ్యది దూషితంబునగునద్దానిన్ నివారింప, సు
స్థిరమౌ ముఖ్య సుతీర్థ యాత్రయగు నిర్దిష్టంబుగా శ్లాఘ్యమౌ. 26

తే॥ అఖిల జీవుల హృదయ మధ్యంబునందు
నంతరాత్మ స్వరూపుడై యలరు నట్టి
హరిని దర్శించుటయ తీర్థయాత్ర దాన
మనసునందలి మాలిన్యమంతరించు. 27

కామక్రోధలోభ మోహమద మాత్సర్యములను అరిషడ్వర్గములందురు. వీని ప్రాబల్యము వలన మానసికమగు నిర్మలత్వము లోపించును. తదుపరి పతనావస్థతో మానవుడధోగతినొందును. అరిషడ్వర్గ ప్రాబల్యము వలననే రావణ కీచక దుర్యోధనాది మహాబలశాలురు పతనము నొందిరి.

"సన్నియమ్యేంద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః
తే ప్రాప్నువంతి మామేవ సర్వభూతహితేరతాః ॥ (భగవద్గీత)
"ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశే2ర్జున తిష్ఠతి"

మనో నిగ్రహము గల మనుజులకు ఇంద్రియములు వశమందుండును. దాని వలన సమహితత్వము సమకూరును. మనోమాలిన్య మంతరించును. ఇది యొక తీర్థయాత్ర. మఱియు భగవానుడు సర్వ జీవ హృదయాంతర్వర్తియై యలరారుచున్నాడు. అట్టి భగవానుని సమభావముతో వీక్షించి దర్శించుటయే ముఖ్యమైన తీర్థయాత్ర. మనోమాలిన్యమును నిర్మూలించక, సమభావము నొందకున్నచో నది తీర్థయాత్ర కానేరదు. బాహ్య తీర్థయాత్రలొనరించినను నిష్ఫలమే.

"రాగదోష మలాపహార క్షమంబుః
మానసంబైన తీర్థంబు మందగమన!
అవని బంకరజోవ్యపాయక్షమంబు
బాహ్యతీర్థంబు మేచకోత్పల దళాక్షి!" (కాశీ ఖండము)



తీర్థయాత్రల గూర్చి వివరించిన తదుపరి మానవులకు దుర్లభమైనది హరిభక్తి అని, ఈ సూత్రము నందు పేర్కొనబడుచున్నది.

సూ॥ కా దుర్లభా నరాణామ్! హరిభక్తిః

అర్ధము॥ నరులకు దుర్లభమైనదేది! హరిభక్తి

క॥ నరులకు కడుదుర్లభ్యం
బరయన్ హరిభక్తి, శత్రులార్వురనంతః
కరణంబున బరిమార్చిన
స్థిరమగు శ్రీవిష్ణుభక్తి శీఘ్రమె కల్గున్. 28

కామక్రోధలోభమోహమదమాత్సర్యములు మానవులకు పరమ శత్రువులు. కావుననే వీనిని అరిషడ్వర్గములందురు. ఈ శత్రులార్వురను అంతఃకరణంబున నిర్మూల మొనర్చిన, శ్రీహరిభక్తి చిత్తము నందు స్థిరముగా నిలచును.

అంతఃకరణమనగా! మానవ శరీరాంతర్గతమై వర్తించు మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము. వీనినే అంతఃకరణ చతుష్టయమందురు. మనస్సు అనగా దానియందు ఏ విషయము గోచరించిన ఆ విషయముననుసరించి, ప్రవర్తించుచు నింద్రియాధిపత్యము వహించునది. ఈ రీతిగా ప్రవర్తిల్లిన మనస్సు ఇంద్రియములు కలిసి చిత్తమనబడును. ధర్మాధర్మ విషయ విచారణమును నిర్ధారణ జేయగల శక్తియే బుద్ధి. నేను అను గర్వము నొందుటయే అహంకారము.

"మనోహి ద్వివిధం ప్రోక్తం శుద్ధంచా శుద్ధమేవచ
అశుద్ధం కామ సంకల్పం శుద్ధం కామ వివర్జితం"

శుద్ధము, అశుద్ధము అని మనస్సు రెండు విధములు. కామ్యరహితమైన మనస్సు శుద్ధము. కామ్య సహితమైన మనస్సు అశుద్ధము.

సహజముగా మనస్సు చంచలమైనది. అట్టి మనస్సును విషయ వాంఛల నుండి మరల్చి, స్థిత ప్రజ్ఞతతో శ్రీహరిని స్మరియించుట ధన్యత.

"నకశ్చిదాత్మ నశ్శత్రుం నాత్మానం కస్యచి ద్రిపుం"

అను ఆయుర్వేద వచనానుసారము నరులు నిరంతరము నిర్వైరముతో పరస్పరము ప్రవర్తించుచు భగవద్భక్తితో భవ్యజీవన మొందవలెను.



హరి భక్తికి అవరోధమగు అరిషడ్వర్గమునందలి లోభము మఱియు కామము గూర్చి ఈ సూత్రము నందు విశద మొనర్చబడుచున్నది.

సూ॥ కః సద్గుణ వినాశీ! లోభః

అర్థము ॥ సద్గుణములను వినాశమొనర్చునదేది! లోభము.

సూ॥ శత్రుశ్చ కః! కామః

అర్థము॥ శత్రువెవరు! కామము

క॥ అరిషడ్వర్గంబులనం
బరగున్ కామంబు క్రోధమతిలోభంబున్
అరయన్ మోహము మద మ
త్సరముల ద్యజియించుటొప్పు సరగున విజ్ఞుల్ 29

కామక్రోధ లోభమోహ మద మాత్సర్య ములనరిషడ్వర్గములందురు. ఈ ఆరును నరులకు భీకర శత్రువులు. కావుననే "భీకర శత్రులార్వుర బ్రభిన్నుల" జేయవలెనని ఆంధ్ర మహాభాగవతమున పోతనామాత్యుడు విశదపరచి యున్నాడు.

లోభము బలీయమైనచో సద్గుణము లంతరించి పోవును. "ఆహారః కామకండూతీ సేవనాత్తు వివర్ధతే" అనునట్లు అనుభవించిన కొలది కామము వృద్ధి నొందుచుండును. కావున మానవుడు అరిషడ్వర్గములనధఃకృత మొనరించి ఆధ్యాత్మిక విద్య నభ్యసింవలయును.

"కామక్రోధ హర్ష లోభ మోహమద మాత్సర్యదంభ దర్పేచ్ఛా
సూయా మమత్వా హంకారాదీనపి పరిత్యజేత్"



అరిషడ్వర్గములనంతమొందించినచో సర్వభూత సమహితత్వము సమకూరును. అట్టి సర్వ భూత హితులే భగవత్ప్రియులని ఈ సూత్రమునందు వివరింపబడుచున్నది.

సూ॥ కో హి భగవత్ప్రియస్స్యాత్!
యోఽన్యం నో ద్విజయే దను ద్విగ్నః

అర్థము॥ అన్య జనులను కలత నొందింపక తాను కలత నొందనివాడు

చ॥ పుడమిని సంభవించు సమ భూతములాత్మ సమానమంచు దా
వెడదదలంచియన్యులకు నించుక గీ డొనరింపకున్న మ
ర్త్యుడె భగవత్ప్రియుండనగ రూఢి మెయిందనరారు చుండునె
య్యెడ సమదర్శనుండునయి యుమ్మగ నొప్పును సంతసంబునన్ 30

"ఆత్మ వత్సతతం పశ్యేదపి కీటపిపీలికం" అని వైద్య శాస్త్రమునందు నుడివిన

విధముగా సర్వజీవులను తనవలె గాంచవలయును. మరియు భగవద్గీత యందలి యీ శ్లోకమును తిలకించుడు.

"సర్వ భూతస్థమాత్మానం సర్వభూతానిచాత్మని
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః"

సమస్త భూతములందు నాత్మను, ఆత్మయందు సమస్త భూతములను యోగ యుక్తాత్ములగు మహనీయులు గాంచుచుందురు.

"తన యందు నిఖిల భూతములందునొక భంగి సమహితత్వంబును జరుపువాడు" కనుకనే ప్రహ్లాదుడు భక్తవరదుడగు భగవానునకు అత్యంత ప్రియుడై ప్రసిద్ధినొందినాడు.

"యస్తు సర్వాణి భూతాని ఆత్మన్యేవాను పశ్యతి
సర్వభూతేషు చాత్మానం తతో న విజుగుప్సతే"

ఏ మానవుడు సర్వభూతములను ఆత్మయందు, సకల భూతములందు నాత్మను గాంచుచున్నాడో! ఆ మానవుడు ఆత్మ జ్ఞాని. కనుక నామనుజుడు పరులయెడ విముఖుడు గానేరడు.



దీనుల యందు కరుణ, సజ్జనుల యందు స్నేహము మానవునకు వినయముగల ప్రియురాలని ఈ సూత్రము నందు వివరింపబడు చున్నది.

సూ॥ కాప్రేయసీ విధేయా॰ కరుణా దీనేషు సజ్జనే మైత్రీ.

అర్థము॥ వినయము గల ప్రియురాలు ఎవరు! దీనుల యందు కరుణ, సజ్జనుల యందు స్నేహము.

ఉ॥ దీనులయందు సత్కరుణ, ధీవరులౌ మహితాత్ములందు ప్ర
జ్ఞానము మీఱ స్నేహము, వినమ్రతయౌ ప్రియురాలటంచు స
మ్మానితరీతి బల్కుదురు ప్రాజ్ఞ జనంబులు రూఢి మీరగన్
మానస నిర్మలత్వము సమంచిత మొప్పగ చేకుఱున్ సదా . 31

"మైత్రీ కరుణా ముదితో పేక్షాణాం
సుఖ దుఃఖ పుణ్యా పుణ్య విషయాణాం
భావనాతశ్చిత్త ప్రసాదమ్, (పతంజలియోగ శాస్త్రము)

సుఖుల యెడ స్నేహము, దీనులయెడ దయ, పుణ్యాత్ముల యెడ ప్రమోదము, పాపాత్ములయెడ ఉపేక్ష భావము వహించుట చిత్తప్రసాదము

"అద్వేష్టా సర్వ భూతానాం మైత్రః కరుణ ఏవచ
నిర్మమో నిరహంకార స్సమదుఃఖ సుఖః క్షమీ"

ఉత్తమ భక్తుండు సమస్త భూతములయందు ద్వేషము లేక మైత్రి గల్గియుండును. అహంకార మమకార విరహితుడై సుఖ దుఃఖములను సమముగా భావించుచు క్షమ గల్గియుండును.



ఈ సూత్రమునందు సదుపదేశము కర్ణములకు అమృత సమానమని వివరింపబడుచున్నది.

సూ॥ పాతుం కర్ణాంజలిభిః కిమమృతమిహయుజ్యతే! సదుపదేశః

అర్థము॥ కర్ణములకు అమృత తుల్యమైనదేది! సదుపదేశము

క॥ పీయూషము వలె శ్రుతిచే
పేయంబొనరింపవలయు బేరిమితో స్వా
ధ్యాయప్రియ హిత సూక్తుల
ధ్యేయంబుగ శౌరి కథలు ధీవరు లెలమిన్ 32

రాగద్వేషవిరహితులు, స్వార్థరహితులునగు మహితాత్ములు సదుపదేశ మొనర్చుటకు సమర్థులు. అట్టి మహనీయుల యొక్క హితవచనములు, ప్రియమునొసంగి, అమృత తుల్యమగును. ఆ రీతిగనే భగవానుని పవిత్ర చరిత్రములు శ్రోత్రములకు అమృత సమానమే.

ఆంధ్రమహాభాగవతమునందలి యీ పద్యమును గమనింపుడు

"మంగళ హరికీర్తి మహా
గంగామృత మించుకైన గర్ణాంజలులన్
సంగతము సేసి ద్రావదా
లంగును గర్మంబులావిలంబగుచు నృపా॥

మఱియును శ్రీ మద్రామాయణము నందలి యీ శ్లోకము పరిశీలింపుడు.

"యః కర్ణాంజలి సంపుటై రహ రహస్సమ్య క్పిబత్యాదరాత్
వాల్మీకే ర్వదనారవింద గళితం రామాయణాఖ్యం మధు
జన్మవ్యాధి జరావిపత్తి మరణైరత్యంత సోపద్రవం
సంసారం సవిహాయ గచ్ఛతి పుమాన్విష్ణోః పదం శాశ్వతమ్"

శ్రీ మద్భగవద్గీత యందలి యీ శ్లోకములను తిలకింపుడు

"పార్థాయప్రతిబోధితాం భగవతానారాయణేన స్వయం
వ్యాసేన గ్రధితాం పురాణమునినామధ్యేమహాభారతం
అద్వైతామృత వర్షిణీం భగవతీమష్టాదశాధ్యాయినీం
అంబత్వామనుసందధామి భగవద్గీతే భవ ద్వేషిణీమ్"
"సర్వోపనిషదోగావో దోగ్ధా గోపాల నందనః
పార్థో వత్సస్సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్॥

భారత భాగవతరామాయణాది గ్రంథములు భగవత్కృష్ణ కథా విలసితములు గాన అమృత సమానములు.



సదుపదేశము అమృత సమానమని వివరించి, విషము దుర్మార్గులయందుండు నని యీ సూత్రము నందు వివరింపబడుచున్నది.

సూ॥ కుత్ర విషం! దుష్టజనే

అర్థము॥ విషమెచ్చట నుండును! దుష్ట జనులయందు

ఉ॥ స్థావర జంగమాత్మకము సర్వజగంబరయంగ నందునా
శ్రీవిషవత్సనాభములు శీఘ్రతరంబగు క్ష్వేళయుక్తమౌ
నావిషమే ప్రశస్త వివిధౌషధయోగ్యము రుగ్హరంబికన్
కావరుడైన వాని మతి కల్మషమౌ విషపూరితంబునౌ 33

క॥ గరళంబై బరగున్ ధర
దురితాత్ముల్ సతమొనర్చు దుష్కృత్యంబుల్
వర యమ నియమ ప్రజ్ఞా
పరతంత్రులు వారి పొందు వర్జింపవలెన్ 34

ఈ ప్రపంచము స్థావర జంగమాత్మకము. అనగా యుద్భవించిన చోటుననే వృద్ధినొంది, సంచరించు స్వభావములేక కాలాంతరమున నశించు వృక్షములు మొదలగునవి స్థావరములు.

ఉద్భవించిన చోటుననే స్థిరముగా నుండక, పలు తెఱంగుల సంచరించుచు, వృద్ధినొందుచు కాలక్రమమున నంత మొందు స్వభావముగల మానవ పశుపక్ష్యాదులు జంగమములు.

స్థావరములైన కొన్ని వృక్షములందును, జంగమములైన కొన్ని

జంతువులందున విషముండును. విషమన ప్రాణహర ద్రవ్యము.

"వ్యవాయిచ వికాసి స్యాత్ సూక్ష్మం ఛేది మదావహం,
ఆగ్నేయం జీవిత హరం యోగవాహిస్మృతం విషయమ్" (శార్ఙ్గ ధర సంహిత)

వ్యవాయి, వికాసి, సూక్ష్మము, ఛేదనము, మదావహము, యోగ వాహి అనుగుణములు గల్గి ఆగ్నేయమగు ద్రవ్యమును జీవితహర ద్రవ్యమందురు. మఱియు

"అర్కక్షీరం స్నుహీక్షీరం తథాచాంజలి కారికా
కరవీరంచ దత్తూరం పంచధోపవిషంస్మృతమ్" (ధన్వంతరి నిఘంటువు)

జిల్లేడు పాలు, బొంత జెముడుపాలు, మునుగుదామర, గన్నేరు, ఉమ్మెత్త అను యీ ద్రవ్యములు ఉపవిషములు వత్సనాభము అను వృక్షము కలదు. దీని యందు సంపూర్ణ విష ప్రభావముండును. దీని ప్రభావమెట్టిదనిన క్ష్వేడ (మదకరముగాన మోహమును కల్గించును) గరళమ్ (జీవితమును సమాప్త మొనరించును.) విష (వికాసిగాన శరీరమునందంతటను వ్యాపించును). అమృత (శాస్త్ర విధిననుసరించి ప్రయోగించినచో అమృతము వలె రక్షణ మొనరించును). సిందువార సకృత్పత్రో వత్సనాభ్యా కృతిస్తథా, యత్పార్శ్వే నతరో వృద్ధిర్వత్సనాభస్స ఉచ్యతే॥ (భావప్రకాశ) వత్సనాభ వృక్షము యొక్క సమీపమునందితర వృక్షములు వృద్ధినొందజాలవు. దీనిని తెలుగున నాభి అని అందురు. లాటిన్ భాషలో Aconitum Ferox Wall అని అందురు. ఈ మొక్క హిమాలయ ప్రాంతము నందు నేపాల్ దేశములో అధికముగా వృద్ధి నొందును. వత్సనాభము ఆయుర్వేదౌషధములందలి ఆనందబైరవరసము, త్రిభువనకీర్తిరసము మొదలగు ఔషధములలో ప్రయోగింపబడును. సన్నిపాత బైరవ రసము అను ఔషధమునందు వత్సనాభము, దత్తూర బీజములు ప్రయోగింపబడును.

జంగమ రూపమగు సర్పము నందు విషముండు నను విషయు సర్వజన విదితము. ఈ విషము యొక్క ప్రభావమతి ప్రమాద భరితము. దీనిని సూచికా భరణమను ఔషధము నందు ప్రయోగింతురు.

పరిపూర్ణ శాస్త్రజ్ఞానము నెఱింగిన వైద్యుడు పైన వివరించిన ఔషధములను యుక్త్యానుసారముగ నిర్మాణమొనర్చినచో నా యౌషధము లత్యంత ప్రభావ వంతములై వ్యాధి నివారణ నొనరించును. అనగా స్థావర జంగమ విషములు మానవాళికి సత్ఫలితముల నొసంగుచున్నవని భావము.

ఇక దుష్టజనుల యొక్క మనస్సు విషపూరితము. అట్టి దురాత్ములొనరించు

దుష్క్రియలు దురంతములు. కావుననే

"తలనుండు విషము ఫణికిన్
వెలయంగా దోకనుండు వృశ్చికమునకున్
తలతోక యనకనుండును
ఖలునకు నిలువెల్ల విషము" అని నుడువబడినది.

మహితాత్ములగు మానవులకు దుర్మార్గుల యొక్క సహవాసము సర్వదా నిషిద్ధము.

ధర్మశాస్త్ర కోవిదుడగు భీష్ముడు దుష్టుడగు దుర్యోధనుని యొక్క సాన్నిధ్యము వలన నేర్పడిన కలుషతచే ధర్మనిర్వచన మొనర్పనేరక మ్రుభావమును వహించి, తదుపరి కురుక్షేత్రరణరంగమందర్జునుని యొక్క శరఘాతము వలన నిష్కలుషిత శోణితుడై, శరతల్పగతుడై, అర్జున బాణములచే నేర్పడిన పవిత్రజలపాన ప్రభావత్వము నొందినవాడై ధర్మ సూత్రములను ధర్మనందనాదులకుపదేశించినాడు.

మఱియునొక ఇతిహాసమిట గ్రహింప దగియున్నది. భీముడు దుర్మార్గుడగు జరాసంధుని పరిమార్చిన తదుపరి నంత దనుక జరాసంధునిచే ధరింపబడిన అతిరమణీయమగు సువర్ణ మకుటమును గైకొని, స్వగృహమగు పాండవ గృహమునందుంచెను. పాండవ నిర్యాణానంతరమొక సమయమున, పరీక్షిత్తు ఆ కిరీటమును ధరించి, మృగయా వినోదమునకై అరణ్యమునకేగి, తపోనిరతుడగు శమీక మహర్షి యొక్క కంఠమునందొక మృత సర్పమును వైచుట, జరాసంధుని యొక్క మకుట ధారణ వలన పరీక్షిత్తునకు కల్గిన కలుషత్వము వలననే యని భావించవలసియున్నది.

"నా నార్య మాశ్రయేత్" దుష్టుల నాశ్రయింప దగదని ఆయుర్వేద సూక్తి. కనుక సన్మార్గులు నిరంతరము దుర్మార్గులకు దూరముగా నుండుట శ్రేయో దాయకము.



ఈ సూత్రమునందు మానవులకు కల్మషమనగా ఋణమని వివరింపబడుచున్నది.

సూ॥ కిమిహ శౌచం! ఋణం నృణామ్

అర్థము॥ కల్మషమననేమి! ఋణము

క॥ నరులకశౌచము ఋణమౌ
ధరణిన్ ఋణముక్తుడై సదా మెలగెడు సు

స్థిరునకు నదియే సంపద
పరమంబగు శ్రేష్ఠతరము భావింపంగన్. 35

చ॥ త్రితయ ఋణంబులన్ జనులు తీర్పగ ధన్యత నొందు జీవితం
బతిరమణీయమౌ ముదము భవ్యము చేకురు సంతతంబు స
ద్గతి లభియించు, శౌచమనగన్ ఋణ హీనమటంచునెంచి స
న్మతి ఋణముక్తుడై నిరత మాన్యత నొందవలెన్ ధరిత్రిలోన్ 36

అశౌచమనగా! నిర్మలత్వము లేకుండుట "అగ్నేశ్శేషం ఋణాశ్శేషం శత్రోశ్శేషం నశేషయేత్॥ అనురీతిగా లౌకిక విధిననుసరించి సజ్జనులకు ఋణము వలన నిర్మలత్వము లోపించును. కావున అతి ప్రయత్నముతో మానవులు ఋణ విముక్తులుగా మనదగియున్నది.

ఇక నాధ్యాత్మిక పరముగా నూహించినచో మానవుడు జన్మముతోడనే మూడు విధములగు ఋణములతో జన్మించుచున్నాడు. అవి ఏవియన! దేవ ఋణము, ఋషిఋణము, పితృఋణము అని. దేవతా ప్రీత్యర్థ మొనరించు యజ్ఞము. మఱియు అగ్ని హోత్రార్చనాదుల వలన దేవ ఋణము నుండి, అతిథి అభ్యాగత పూజనము, మఱియు వేదాధ్యయనము, వలన ఋషి ఋణము నుండి, మాతా పితరుల సేవయు, మఱియు తదనంతరము వారల కొఱకాచరించు ఊర్ధ్వలోకక్రియలును, మఱియు "ప్రజయా పితృభ్యః అను సూక్తిననుసరించి సంతానవంతుడగుట వలనను పితృఋణమునుండి విముక్తి నొందగలడు.

కనుకనే దశరధాదులు పుత్ర కామేష్టియాగ మొనరించి, సత్సంతానమును వడసి, పితృ ఋణ విముక్తులైనట్లు విశదమగుచున్నది.

ఈ విధమగు లౌకిక పారలౌకిక ఋణములనుండి విముక్తినొందినచో ఇహ పరముల యందు శాశ్వతానందమునొందగలరు.



జీవ హింస మహాపాపమని యీ సూత్రమునందు వివరింపబడుచున్నది.

సూ॥ పాతకంచ కిం! హింసా

అర్థము॥ పాతకమననేమి! హింస

తే॥ పాతకంబన హింసయై బరగుచుండు
పాపహేతువు హింసా ప్రవర్తనంబు
కరుణరసయుత స్నేహ సంభరిత మతిని
హింస విడనాడు దీక్షవహించ వలయు 37

ఉ॥ హీనము జీవహింస, కడుహేయమటంచుదలంపగా వలెన్
దీనములైన జీవులతి దీనతతో వ్యధనొంద హింసయౌ
దానమహాదురంత దురితం బొనగూరును నిశ్చయంబుగన్
గాన యహింస మేలనుచు(గక్కున హింసను వీడు టొప్పగున్ 38

హింసాకర్మలవలన పాపము ప్రాప్తించును. కావున త్రికరణములచే హింసా కార్యముల త్యజించవలయును "హింసాస్తేయాన్యధాకామం, పైశున్యం పరుషాన్యతే" అను ఆయుర్వేద వచనానుసారము మానవులు హింసా ప్రవృత్తిని విసర్జించి, అహింసా తత్వము నాచరించవలెను. స్వార్థముతో కూడిన హింసయు పాపహేతువే. అజకుక్కుటాది జీవులను పెంచి, తదుపరి నా జీవులను వధించుట పాపహేతువు. ఆ జీవులను పెంచునపుడు మానవునకా ప్రాణులయందు కరుణయుండదు. ఇకనా జీవులను త్రుంచునపుడు ఆ ప్రాణుల యందు ద్వేషముండదు. ఈ పెంచుట త్రుంచుట అను క్రియలు కేవలము స్వార్థపూరితమైనవి. ఇదియును సంపూర్ణ హింసాత్మకమే. హింసా విధానమును పరిపూర్ణముగా త్యజించుటయే అహింసా తత్వము. అహింసా విధానము శారీరిక తపస్సు అని భగవద్గీత యందు నుడువ బడిన యీ శ్లోకమును తిలకింపుడు.

"దేవ ద్విజగురు (ప్రాజ్ఞ పూజనం శౌచమార్జవం
(బ్రహ్మ చర్య మహింసా చ శారీరం తప ఉచ్యతే"

ఆధునిక కాలములో అహింసా విధానముతో నతి దుర్లభమగు కార్యములను సఫలీకృతమొనర్చిన మహనీయులెందరో కలరు. పరులను పరుషవాక్కులతో వ్యధనొందించుటయు హింసయే.

ఆధ్యాత్మిక విద్యయను సదనమునకు మూలస్తంభముల వలెనాధార భూతములగు యమ నియమములలో తొలుత అహింస నుడువబడినది. అనగా! అహింసా వ్రతముతో నాధ్యాత్మిక విద్యనారంభించవలెనని భావము. యమ నియమములనగా!" అహింసా సత్యమస్తేయం బ్రహ్మచర్యం దయార్జవం క్షమాధృతిర్మితాహార శ్శౌచం చేతి యామా దశ"

ఈ పది యమము. ఇక నియమము వివరింపబడుచున్నది.

"తపస్సంతోషమాస్తిక్యం దానమీశ్వర పూజనం
వేదాంత వాక్య (శవణం (హీర్మతి శ్చజపో(వతమ్"

అహింసా వ్రతము వలన ఆత్మ ప్రశాంతత లభియించును. కావుననే వైద్య గ్రంధమందు బ్రహ్మచర్య జ్ఞాన దానమైత్రీ కారుణ్య హర్షా పేక్షా ప్రశమ పర్ణశ్చస్యాదితి" అని చెప్పబడినది.



సంపదయే భయమని యీ సూత్రమునందు వివరింపబడుచున్నది. కేవలము సంపదయే ధ్యేయముగా గలవారలు హింసా కర్మలొనరింతురు. హింస పాపహేతువని విరించిన తదుపరి భయమనగా సంపదయనుట సముచితము.

సూ॥ భయమపిచ కిం! విత్తమేవ సర్వేషాం

అర్థము : భయమననేమి! సంపద

తే. ఇహమువందలి సంపద లిహము నందు
సౌఖ్యబీజాలు, నిర్వాణ సౌఖ్యమునకు
విష్ణునామస్మరణమను విత్తశక్తి
పొందవలయును మానవుల్ పుడమియందు. 39

ప్రాపంచికమగు సంపదవలన మానవులకు ప్రాపంచిక సుఖము లభించుచున్నవి. అపరిమితములగు కోరికలతో దుష్కార్యములొనర్చి, ధర్మ విరుద్ధ పథమున నార్జించిన అత్యధిక విత్తమును అత్యంత ప్రయత్నపూర్వకముగ అహర్నిశము పరిరక్షించుకొనవలసియున్నది. విత్తమును రక్షించుకొను నిమిత్తమై చిత్తమునందు భీతి కల్గుట సహజము. కావున కేవలము లౌకిక విత్తమునకే ప్రాధాన్యత నొసంగక, పారలౌకికమగు ఆధ్యాత్మిక విత్తము నార్జించి మానవులు నిరంతరము నిర్భీతితో జీవించుట యుక్తము కాగలదు.

"అనిత్యాకిల మర్త్యాణాం అర్థసిద్ధిర్జయాజయౌ" (మహా భారతము)

మానవులకు అర్థసిద్ధి, జయాపజయములు అనిత్యములు. విష్ణునామ స్మరణముచే సంభవమగు సంపదయే శాశ్వతము. భజగోవింద శ్లోకములందలి యీ శ్లోకము నుతిలకించుడు

"మాకురు ధనజన యౌవన గర్వం
హరతి నిమేషాత్కాల స్సర్వం
మాయా మయ మిదమఖిలం హిత్వా
బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా"



పుణ్య కర్మలు సమస్త సౌఖ్యములకు మూలమని యీ సూత్రమునందు వివరింపబడుచున్నది.

సూ॥ సర్వ సుఖానాం బీజం కిం! పుణ్యమ్.

అర్థము॥సర్వ సుఖములకు మూలము ఏది! పుణ్యము

ఆ॥ నిఖిల సౌఖ్యములకు నిత్యపుణ్యా చర
ణంబు మూలమరయ నరులకెలమి
స్వార్థపరత దుష్ట సంకల్పములమాని
పుణ్య జీవనంబు బొంద సుఖము. 40

స్వార్థ సంయుత చిత్తునకు నిత్యము దుష్ట సంకల్పములే మనస్సు నందుద్భవించును. అట్టి వారలకు పుణ్య కర్మలయందా సక్తి లోపించును పుణ్య కర్మల నాచరించనిచో నిహపర సుఖముచేకూరదు. కావున మానవుడు పుణ్యకర్మనిరతుడుగా జీవించవలసి యున్నది.

ఆంధ్ర మహాభాగవతము నందలి యీ పద్యము నవలోకింపుడు.

"ధర్మము సత్యము గీర్తియు
నిర్మల దయ విష్ణుభక్తి నిరుపమ ఘన స
త్కర్మమహింసా వ్రతము
న్నర్మిలి గలవారె పుణ్యులవనీ నాథా"

గత సూత్రమునందు పుణ్యకర్మలు సమస్త సౌఖ్యములకు మూలమని వివరించి, ఈ సూత్రమునందు పాపము వలన దుఃఖమేర్పడునని వివరింపబడు చున్నది.

సూ॥ దుఃఖమపి కుతః పాపాత్

అర్థము॥ దుఃఖము ఎందువలన! పాపము వలన

ఆ॥ దుఃఖ కారణములు దురిత కర్మంబులౌ
విజ్ఞులెల్లనఘము విడువ వలయు
జగతి విషయ సుఖమె శాశ్వతమంచును
తలచుటెల్ల దుఃఖతరము కరము 41

పాప కర్మలొనర్చుట వలన దుఃఖము ప్రాప్తించును. పాపకర్మలు పది విధములు. "పాపంకర్మేతి దశధాకాయవాక్ మానసైః త్యజేత్" అని వైద్య శాస్త్రమున

పేర్కొనబడినది. పది విధములగు పాపకర్మలేవియనిన! అసత్యోక్తి, దోషారోపణోక్తి, కఠినోక్తి, నిష్ఫలోక్తి, చౌర్యకరణము, దుష్కార్యకరణము, దుష్కార్యాపేక్ష, పరద్రవ్యాపేక్ష, పరదారాపేక్ష, జీవహింస. ఈ పాపకర్మలను త్రికరణముగా పరిత్యజింపవలయును. అనగా! శారీరకముగా గాని, వాచికముగా గాని, మానసికముగా గాని యొనరింపదగదు.

కేవలము విషయ సుఖములే నిత్యమని తలంచుటచే దురిత కర్మలనొనరించుట యందాసక్తి కల్గును. కావున ప్రాజ్ఞులగు మానవులు దుఃఖ కారణములైన విషయ సుఖములను విసర్జించి దురితకర్మలను దూరమొనరించుట హర్షదాయకము. కేవలము ఇహలోక సంబంధమగు విషయ సుఖముల ననుభవించుచు. కామ క్రోధ లోభ మోహ మదమాత్సర్య వికారములకు అధీనులై, స్వార్థప్రయోజనము కొఱకు పరపీడన మొనరించుచు ధర్మాధర్మ విచక్షణ రహితముగా ప్రవర్తించినచో దుఃఖము ప్రాప్తించుట నిశ్చయము. కనుక విషయ సుఖ విరహితులై పరమార్థతత్త్వము నెఱుంగుట కొఱకు ప్రయత్నింపవలయును.

మానవులు పుణ్య కర్మలనొనరింపకనే పుణ్య ఫలమునాకాంక్షింతురు. పాప కర్మల నొనర్చియు పాప ఫలమునాకాంక్షింపరు. పుణ్యము సద్గతి నొందించును పాపము దుర్గతి నొందించును.

"అత్యుత్కటైః పుణ్యపాపైః ఇహైవ ఫలమశ్నుతే
త్రిభిర్జన్మై స్త్రిభిర్వర్షై స్త్రిభిర్మాసై స్త్రిభిర్దినైః

అత్యుత్కటమైన పుణ్యపాప ఫలితములు మూడు జన్మలలో గాని, మూడు సంవత్సరములలోగాని, మూడు మాసములలోగాని, మూడు దినములలోగాని అనుభవింపవలసి యుండును.



పరమేశ్వరుని భక్తితో నారాధించువారలే ఐశ్వర్య వంతులని యీ సూత్రమునందు వివరింపబడుచున్నది.

సూ॥ కశ్చైశ్వర్య! యఃకిల శంకర మారాధయేద్భక్త్యా

అర్థము॥ ఐశ్వర్య వంతుడెవరు! భక్తితో పరమేశ్వరునారాధించువారు

క॥ నశ్వరమగు సంసారమ
నశ్వరమని భ్రమసి వెతలనందుటకంటెన్

విశ్వేశ్వరు పాదార్చన
మైశ్వర్యద మనగ నొప్పునంచిత బుద్ధిన్ 42

సంసారమన! జన్మించుట అని అర్ధము. భువిలో జన్మించిన సర్వజీవులకు మరణము తధ్యము. జనన మరణములను నియంత్రణ మొనరించునది భగవచ్ఛరణార్చనమే. దుఃఖ హేతువులగుజనన మరణములను నిర్మూలన మొనరింప సమర్ధతగల భగవత్పద పూజనమే యదార్ధమగు ఐశ్వర్యము.

దేహి (ఆత్మ) దేహమునుండి తొలగిపోవుట మరణమనబడుచున్నది. దేహినిత్యుడు. దేహము అనిత్యము. ఆత్మకు జనన మరణములు లేవు. దేహమునకు జనన మరణములు సహజము. కావున జనన మరణములుదేహమునకే గాని దేహికి సంభవము కానోపదు. సామాన్య మానవులకు దుఃఖతరముగా గోచరించుచున్న మరణము జ్ఞానవంతులకు విచారకరము కానేరదు. నాశవంతమగు శరీరము కొఱకు పరితపించుట అవివేకము. జన్మమృత్యురూప సంసార దుఃఖము నుండి సంరక్షింపబడి శాశ్వతానంద సంసిద్ధి నొందుటకు భగవానుని భజియింప వలసియున్నది.

"తదేవరమ్యం రుచిరం నవం నవం
తదేవ శశ్వత్ మనసో మహోత్సవం
తదేవ శోకార్ణవ శోషణం నృణాం
యదుత్తమం ముక్తయశో2నుగీయతే"

భగవానుని కీర్తి గానము మనోహరమై అత్యంత నూతన రుచిరముగా నలరారుచుండును

"తారల నెన్నగ వచ్చును
భూరేణులలెక్కపెట్టబోలును ధాత్రిన్
నారాయణ గుణకథనము
లారయవర్ణింపలేరు హరబ్రహ్మాదుల్"



భగవానుడే సన్మార్గులకు బలమని ఈ సూత్రమునందు పేర్కొనబడుచున్నది

సూ॥ సాధు బలం కిం! దైవం

అర్థము॥ సాధుజనులకు బలమెవ్వరు! భగవానుడు

తే॥ ఉర్వి సంతత సంభూత సర్వ భూత
హృదయమధ్య స్థితుండయి ముదము మీఱ
నవ్య శక్తినొసంగెడు భవ్య కరుని
కరుణరసమును బొందుట పరమశక్తి 43

సర్వజీవ హృదయాంతర్వర్తియగు భగవానుని యొక్క కరుణచే సకల ప్రాణులకు నూతన శక్తి సంభవించుచున్నది. కరుణాంత రంగుడగు భగవంతుని యొక్క దయారసమును పొందుటయే విశేషమైన బలము. కావుననే ప్రహ్లాదుడు వివిధ సమయములందు భగవత్కరుణచే విశిష్ట శక్తితో విలసిల్లినట్లు విశదమగుచున్నది.

హరి సకల ప్రాణి హృదయంబులందును నంతర్యామియై
యాకాశంబు భంగినుండు....

నిష్కాములై హృదయగతుండైన హరిని నిజభక్తిని భజింపవలయు (భాగవతము) భగవద్గీతయందలి యీ శ్లోకమునవలోకింపుడు.

"ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి
భ్రామయన్సర్వభూతాని యంత్రారూఢాని మాయయా"

మఱియు విష్ణు సహస్ర నామ స్తోత్రమునందలి యీ ప్రారంభ శ్లోకమును తిలకింపుడు

"విశ్వం విష్ణుర్వషట్కారో భూతభవ్యభవత్ప్రభుః
భూతకృద్భూతభృద్భావో భూతాత్మాభూతభావనః

ఇందలి భూతాత్మ అనుపదమునకు అర్థమేమిటనిన సకల జీవులందునంతర్యామిగ నుండువాడు గావున భూతాత్మా అని భగవంతునకు నామము.

సమస్త జీవులకు భగవానుడే బలమని పేర్కొనిన భాగవతమునందలి యీ పద్యమును తిలకింపుడు

"బలయుతులకు దుర్బలులకు
బలమెవ్వడు నీకు నాకు బ్రహ్మాదులకున్
బలమెవ్వడు ప్రాణులకును
బలమెవ్వండట్టి విభుడు బలమసురేంద్రా!"



సుకృతమే దైవమని ఈ సూత్రము నందు పేర్కొనబడినది

సూ॥ దైవం కిం! యత్సుకృతం

అర్థము॥ దైవమననేమి! పుణ్యము

క॥ దివ్యంబగు దైవత్వము
భవ్యంకరయుక్త సుకృత పరతన్ జగతిన్
నవ్యంబై భాసిల్లును
సవ్యంబుగ మానవులకు శాశ్వతరీతిన్ 44

మానవుడు తనయందలి ఆ సురీగుణముల నంతమొందించి, దైవీసంపదతో సత్కర్మనిరతుడై, వినిర్మలహృదయుడై, భక్తి భావమున బ్రవర్తించినచో మానవత్వమునందే దైవత్వము ప్రతిబింబించును.

"యతంతో యోగినశ్చైనం పశ్యం త్యాత్మన్య వస్థితం
యతంతోప్య కృతాత్మానో నైనం పశ్యంత్య చేతసః"

ప్రయత్న శీలురగు యోగులు తమయందలి (హృదయము నందలి) పరమాత్మను దర్శింతురు. వివేకహీనులైన మానవులు ప్రయత్నమొనరించినను వారల యొక్క అపరిశుద్ధాంతః కరణము వలన పరమాత్మను కనుగొన జాలరు.

కావున మానవుడు దైవత్వము నొందుటకు. అంతః కరణ పరిశుద్ధినొంద వలయును.



సత్పురుషుచే శ్లాఘింపబడు మానవుడు పుణాత్ముడనియు, సంగరహితుడగు జనుడు ధన్యుడనియు యీ సూత్రము నందు వివరింపబడుచున్నది.

సూ॥ కః సుకృతీ! శ్లాఘ్యతేయః సద్భిః

అర్థము॥ ధన్యుడెవరు ! సంగరహితుడు.

మ॥ వినుతింజేతురు కోవిదోత్తములు సద్విజ్ఞాన పారంగతున్
ఘన పుణ్యాత్ముడటంచు, బల్కుదురు త్యాగ ప్రజ్ఞతోడన్ భువిన్
అనయంబున్ చరియించు మానవుని ధన్యాత్ముండు ధీరుండు స
ద్వినయోపేత మనస్కుడంచు సదసద్వి ద్యావిదుల్ సన్మతిన్ 45

సత్పురుషులు పుణ్య కర్మ నిరుతులను ప్రశంసింతురు. సంగరహితులే నిరతము త్యాగ ధనులు. వారలు కడు ధన్యులు.

సుకృత నిరతులగు పాండవులకు నిరంతరము కృష్ణ పరమాత్మ యొక్క

అనుగ్రహము లభియించినది. విజయము చేకూరినది. పాండవుల యొక్క యశస్సు చిరతరమైనది.

శరీర ధారులగు మానవులకు సంపూర్ణ కర్మ పరిత్యాగము శక్యము కానేరదు. పుణ్య కర్మనిరతులై కర్మ ఫలమును త్యజియించు వారే రాగవిరహితులు. మఱియు త్యాగధనులు.



ఈ సూత్రమునందు అవిద్యను గూర్చి మఱియు శోకరహితుల గూర్చి వివరిపబడు చున్నది.

సూ॥ కాచా విద్యా! యదాత్మనో஽స్మార్తి.

అర్థము॥ అవిద్యయననేమి! ఆత్మను మరచుట

సూ॥ కశ్చన శోకో! యస్యా దక్రోధః

అర్థము :- శోకరహితులెవరు ! క్రోధవిరతులు.

ఉ. ఆరయనాత్మ విస్మరణ మౌనుయవిద్య, యశోకులే సదా
ధారణి క్రోధవర్జితలు, దర్పము మత్సరమున్ బలంబహం
కారము క్రోధ కామములకార్యములంద్యజియించి భక్తి దై
త్యారిని గొల్చు మానవులు ధన్యులు గణ్యులశోకవంతులౌ. 46

"అనిత్యా శుచి దుఃఖానాత్మసు నిత్యశుచి సుఖాత్మ ఖ్యాతిరవిద్యా" (పాతంజలయోగ సూత్రములు) న+విద్య-అవిద్య. నిత్యము కాని వస్తువును నిత్యమని తలంచుట, అపరిశుద్ధ వస్తువును పరిశుద్ధమనుకొనుట, దుఃఖ కరమగు వస్తువును సుఖకరమని భావించుట, ఆత్మకుభిన్నమైన వస్తువును ఆత్మయని తలంచుట అవిద్య.

అహంకారము నిర్మూల మైనచో కామక్రోధాదులు అంతరించి ఆత్మజ్ఞానము లభించును. ఆత్మజ్ఞానమన భగవత్తత్వము నొందుటయే. తదనంతరము మానవుడు మహితాత్ముడై స్వపరభేదమును విస్మరించి, సర్వము విష్ణుమయంబనియెడు స్థిర చిత్తము నొందును. భగవద్గీత యందలి ఈ శ్లోకమును తిలకింపుడు. "అహంకారం బలం దర్పం కామంక్రోధంచ సంశ్రితాః మామాత్మ పరదేహేషు ప్రద్విషంతో భ్యసూయకాః" మానవులు అహంకారము, బలము, దర్పము, కామము, క్రోధమును పొందిన వారలై తమ శరీరములందును పరుల శరీరము లందును అంతర్యామినై వర్తించు నన్ను తెలిసికొనజాలక భేద బుద్ధితో ఇతరులను ద్వేషింతురు. అని కృష్ణ పరమాత్మ అర్జునుని గూర్చి నుడివినట్లు కలదు.

రామాయణ మహా కావ్యము నందలి యీ శ్లోకమును తిలకింపుడు.

"శోకోనాశయతే ధైర్యం శోకోనాశయతే శ్రుతమ్

శోకోనాశయతే సర్వం నాస్తిశోకసమోరిపుః"

శోక సమానమగు శత్రువులేదని యీ శ్లోకమునందు వివరిపంబడినది. కావున శోకరహితులే క్రోధవిరతులు.



ఆకలి గొన్న వానికి అన్నదాన మొనరింప వలెనని ఈ సూత్రము నందు వివరింపబడుచున్నది.

సూ॥ పాత్రం కింఅన్నదానే ! క్షుధితః

అర్థము॥ అన్నదానమునకు అర్హుడెవరు ! అన్నార్తుడు

ఉ॥ లోకమునందు ధర్మపరులొయ్యన జేతురు దానధర్మముల్
ప్రాకృత రీతి వస్త్ర ధనవస్తు చయాదుల సన్మతిన్ సదా
ప్రాకట మొప్ప దానముల పావనమై దగునన్న దానమే
ఆకలి గొన్న మానవున కన్నము దానము జేయ శ్రేష్ఠమౌ. 47

పాత్రుడగు అయాచకున కొసంగునది దానము యాచకునకొసంగునది ధర్మము.

దానములలో అన్నదానమతి ప్రశస్తము. కావున ఆకలి గల వానికే అన్నదానమొనరించుట ప్రశస్తము, ప్రయోజనకరము.

ఈ విషయము నాధ్యాత్మిక పరముగా నూహించినచో క్షుధితుడన ! ఆధ్యాత్మిక తత్వము నభ్యసించుటకు అనవరతాభిలాష గల మనుజుడు. అట్టి వానికే ఆధ్యాత్మిక విద్యయను అన్నమును దానమొనరింప వలయును.



ఈ సూత్రము నందు నీచసేవ నిరసింపబడుచున్నది.

సూ॥ కశ్చ శ్వా ! నీచసేవ కోయస్స్యాత్.

అర్థము :- శునకమన నెవరు ! నీచసేవ జేయువాడు.

ఉ॥ నీచులసే వజేయుటయ నీచపు కార్యములంద్రు భూరివ
ణ్యాచరణాన్వితుల్ బుధులునంచితరీతిని, గావవెయ్యెడన్
నీచుల సేవకుండు భువి నీచపు కుక్కురతుల్యమౌను, యా
నీచుల సేవ జేయుటయె నిత్య నిషిద్ధము సజ్జనాళికిన్. 48

"యాచ్ఞామోఘావర మధిగుణే నాధమే లబ్ధ కామా" (మేఘ సందేశము)
ఉత్తముల నాశ్రయించిన కోరిక విఫలమైనను శ్రేష్ఠమే.
నీచుల నాశ్రయించిన కోరిక సఫలమైనను ప్రశస్తము కానోపదు.

నీచులన! స్వార్థయుత చిత్తులు. అర్థ కామములే వారల ధ్యేయము. అట్టి నీచులకు సేవ జేయుట నిషిద్ధము.

శునకముయొక్క జీవితము స్వేచ్ఛారహితము. అవిధముగనే నీచసేవకుని యొక్క జీవితము స్వేచ్ఛారహితము మఱియు పరాధీనము. కావున నీచసేవకుడు శునకతుల్యుడని యిందు వివరింపబడినది.

భగవత్పరమైన సేవ ప్రశస్తము. సుదాముడు శ్రీకృష్ణ పరమాత్మను గూర్చి కోరిన వరము భగవత్పాదసేవయే. భాగవతము నందలి యీ పద్యమును గమనింపుడు.

"నీపాదకమల సేవయు
నీపాదార్చకుల తోడి నెయ్యమును నితాం
తాపార భూతదయమును
దాపసమందార! నాకు దయసేయగదే !



పాపమును రహస్యముగా నొనరించినను మరణ, పర్యంతము బాధించునని యీ సూత్రమునందు నుడువబడినది.
సూ॥ ఆమరణాత్కిం శల్యం ! ప్రచ్ఛన్నం యత్కృతం పాపం.
అర్థము॥ మరణ పర్యంతము బాధించునది ఏది !
రహస్యముగా నొనరించిన పాపము.

ఉ॥ మానవుడీ జగంబున సముంచితరీతిని పుణ్య కర్మలన్
మాని, రహస్య మౌననుచు పాపములన్ యొనరింప శల్యమై
మానక, బాధ్యమౌనిక సమాప్తిని జీవితమొందు దన్క
గాన నధర్మ కార్యముల గ్రక్కున వీడిన సౌఖ్యమౌ సదా. 48

పాపమును రహస్యముగా నొనరించినను, పాపమొనర్చిన మానవుని మరణ పర్యంతము పీడించుచునే యుండును. మానవుడు రహస్యముగా జేసిన దుష్కృతము పరులకు విదితము కాక పోయినను పరమాత్మకు ప్రత్యక్షముగా గోచరించుచునే యుండును. కావున దురితము యొక్క దుష్ఫలితము

వశ్యమనుభవించుట తథ్యము. పుణ్య కర్మలు నిరంతరము ఇహ పరసుఖముల నొసంగును. కావుననే

"అష్టాదశ పురాణేషు వ్యాసస్యవచన ద్వయం
పరోపకారం పుణ్యాయ పాపాయ పరపీడనమ్"

అనిచెప్పబడినది.

ఈ సూత్రమునందు శల్యము అని ప్రయోగింపబడినది. శల్యమన విషమునకు అర్థము కలదు. కొన్ని విషములు సద్యః ప్రాణ హరములు మరి కొన్ని విషములు కాలాంతరమున ప్రాణమును హరించును. ఇక కొన్ని విషములు జీవిత పర్యంతము అనారోగ్యము కల్పించి పీడించుచునే యుండును.

వైద్య శాస్త్రమున శల్యతంత్రమను చికిత్సా విధానము కలదు. ఏ కారణము చేతనైనను శరీరమునకు బాణములు మొదలగు ఇతర వస్తువులు గ్రుచ్చుకొని శరీరమునందుండిన దాని వలన అమితమగు బాధ, మరియు కొన్ని ఉపద్రవములు సంభవించును. అట్టి వానికి నొనరించు చికిత్సా విధానమే శల్యతంత్రము.

మనుజులు పాపమును రహస్యముగా నొనరించినను ఆమరణాంతము శల్యము వలె వ్యధనొందించు నని యిందలి భావము.

"అవశ్యం లభతే జంతుః ఫలంపాపస్య కర్మణః
ఘోరంపర్యాగతే కాలే ద్రుమాః పుష్పమి వార్తవమ్॥
(శ్రీరామాయణమహా కావ్యము)

వృక్షములు ఆయా ఋతువులు వచ్చినప్పడు పుష్పించిన విధముగా మానవుడు తానొనరించిన పాపఫలమును అవశ్యముననుభవించును.



ఈ సూత్రమునందు యౌవనము, ధనము, ఆయువు చలనమైనవని వివరింపబడుచున్నది.

సూ॥ నలినీ దళగత జలమివ తరళం కిమ్ ! యౌవనం ధనంచాయు

అర్థము॥ తామరాకు మీదిజలము వలెచలనమైన దేది! .

యౌవనము, ధనము, ఆయువు

క. ధనమున్ జీవనమున్ యౌ
వనమున్ నలినీ దళస్థవనమున్ బలెకం

పవమౌవవయంబున్ భువి
దవరువిదియె పత్యమంచు దలచుటమేలా.   50

ధనము , ప్రాణము, యౌవనము అశాశ్వతము. ధనము చంచలమైనది. అయువు బుద్బుద ప్రాయము. ప్రాయము ఘరీ ప్రవాహము. కావుననివి అశాశ్వతములు. శాశ్వతమైనది. పరమార్ధ తత్వమొకటియే. పరమార్ధతత్వము నెఱింగిన మహితాత్ముడు పరమ జ్ఞాని.

ఈ గ్రంథము నందలి ప్రథమ భాగమునందు 16 వ పద్య వివరణమందు వివరించిన పద్యము ప్రకారము ధనము, ప్రాతశ్చాయ, వనితాజన యౌవనము, వండిన అన్నము, మూర్ఖజనమైత్రి అనునవి అల్పకాల భోగ్యములు. కనుక అశాశ్వతములు. నిత్యము, సత్యమున్నైన పరబ్రహ్మమునెఱుంగుట కొఱకు నిరంతర సాధన మత్యవసరము.

భజగోవింద స్తోత్రము నందలి యీ శ్లోకమును తిలకింపుడు.

"నళినీ దళగల జలమతి తరళం
తద్వ జ్జీవితమతిశయ చపలం
విద్ధివ్యా ధ్యభిమానగ్రస్తం
లోకం శోకహతం చ సమస్తమ్"

తామరాకుల పైనున్న జలబిందువులు అతి చలన మైనవి. ఆవిధాముగనే జీవితము అత్యంతము చంచలమైనది. వ్యాధులతో వ్యధనొందుచు, దేహాభిమానమును త్యంజింపక శోకములో లగ్నమై యుందురు. లోకమంతయును శోకహతమైనది.

"చలపత్రాంత లగ్నాంబు బిందువత్ క్షణభంగురం
ఆయుష్య జత్యవే ళాయాం కస్తత్ర ప్రత్యయస్తవ"
(రామాయణ మహాకావ్యము)



మానవులు పవిత్ర జీవన మొనరింప వలెనని యీ సూత్రము నందు వివరింపబడుచున్నది.

సూ॥ కిం జీవితం ! అనవద్యం
అర్ధము॥ జీవితమననేమి ! నీచముగాని జీవనము.

ఉ. వాచిక చిత్తకాయముల వంచన వర్జన మంచితంబు పు
ణ్యాచరణంబు భూతదయ నాస్తికతారహితంబు నిత్య స

చ్ఛౌచయుత ప్రవర్తనము సత్య సుభాషితముల్ ధరాస్థలిన్
నీచముగాని జీవనము నిత్య శుభంబగు మానవాళికిన్. 51

క. అనవద్యంబగు జీవిత
మును బవలున్ రేయి యందు ముదమొదవగనే
మనుజులు కాంక్షింతు రొయా
మనుజులె మహితాత్ములరయ మహిలో నెపుడున్. 52

పవిత్ర జీవితమన ! మంగళాచారాది సద్వృత్తయుత జీవితము. దీనిని గూర్చి వైద్య శాస్త్రమునందీ విధముగానుడువ బడినది. "మంగళాచార శీలః, సర్వప్రాణిషు బంధు భూత స్యాత్, క్రుద్ధానా మనునేతా, భీతానా మాశ్వాసయితా, దీనానా మభ్యుపపత్తా, సత్య సంధః, సామప్రధానః, పరపరుష వచన సహిష్ణుః, అమర్షఘ్నః, ప్రశమ గుణ దర్శీ, రాగద్వేష హేతూనాం హంతా, శుభకరములైన ఆచార స్వభావములు కల్గియుండవలయును. సమస్త ప్రాణులయందును బంధువు బోలె స్నేహము గల్గియుండ వలయును. కోపము గల వారలననునయింప వలయును. భీతిజెందిన వారలను భీతినుండి యూరట నొందింప వలయును. దీనులకు సహాయ మొనరింప వలయును. సత్య సంధుడుగను సామోపాయ ప్రధానుడుగ నుండ వలెను. పరుల యొక్క పరుష వాక్కులను సహించుకొన వలెను. కోపముననణచు కొను గుణము గల్గియుండ వలెను. రాగద్వేషముల గల్గించు హేతువులను విసర్జించి యుండవలెను. ఇట్టి మహనీయులకు సమస్త శుభములు నిశ్చయముగా సంప్రాప్తించును.



పవిత్ర జీవనమునకు వలయు మరి కొన్ని సూక్తులు యీ సూత్రముల యందు వివరింపబడుచున్నవి.

సూ॥ కో నరకః ! పరవశతా

అర్థము॥ నరకమననేమి ! బానిసత్వము.

సూ॥ కిం సౌఖ్యం ! సర్వసంగవిరతి ర్యా

అర్థము॥ సౌఖ్య మననేమి! సర్వ సంగపరిత్యాగము.

సూ॥ కిం సత్యం ! భూతహితం

అర్థము॥ సత్యమనగానేమి ! భూత హితము.

సూ॥ ప్రియంచ కిం ప్రాణినామ్ ! అసవః

అర్థము॥ జీవులకు ప్రియమైనదేది ! ప్రాణము.

పే. పరవశత్వము నరకమై బరగు ధరణి
సంగవిరతియె సర్వదా శాంతినొసగు
సర్వ సమహిత తత్త్వంబు సత్యమౌను
ప్రాణి కోటికి బ్రియమగు బ్రాణమరయ. 53

బానిసత్వము భగవత్పర రహితమైనచో నది నిశ్చయముగా నరకతుల్యము. కేవలము ప్రాపించిక విషయలోలుడై ప్రవర్తించుట సంగము. అట్టి సంగమునుండి విముక్తి నొంది, ఇహ పరశాంతి నొందుటయే సౌఖ్యము. సర్వ సమానత్వము సత్యము, సత్యం జ్ఞానమ నంతం బ్రహ్మ, అను ఉపనిష ద్వాక్యమునననుసరించి, పరబ్రహ్మ సత్య స్వరూపము. పరబ్రహ్మకు తరతమ భేదము లేదు. సమస్తము సమానము గావున సర్వసమహితతత్త్వము సత్యమనబడుచున్నది. సర్వ జీవులకు ప్రాణము మహా ప్రియమైనది. ప్రాణమున్నచో నిహపర సుఖ సాధన మొనర్చు కొనుట సాధ్యము. కావున ప్రాణము జీవులకు ప్రియమని చెప్పబడుచున్నది.



అహంకారము అనర్థదాయకమని యీ సూత్రము నందు విశదమొనర్చబడుచున్నది.

సూ॥ సర్వా నర్థంబులకున్
గర్వంబే కారణంబు గాంచగనుర్విన్
గర్వంబుడిగిన పిదపన
నిర్వేదము ప్రాప్తమౌను నిశ్చయమలరన్ 54

అహంకారము అశుభములకు అత్యంతము ఆలవాలము. అహంకారము చిత్తమునందుద్భవ మైనచో నెంత వివేకవంతునకైనను పతనము నిశ్చయము. అహంకారము రహితమైనచోననిర్వేదము సిద్ధించును. అనిర్వేదమన నిర్విచారము.

అనిర్వేదము శ్రేయస్సులకు మూలము. సౌఖ్యము. సకల ప్రయోజనములు చేకూరును.

"అనిర్వేద: శ్రేయోమూలం అనిర్వేద: పరం సుఖం
అనిర్వేదొహిసతతం సర్వార్థేషు ప్రవర్తక:"

"కరోతి సఫలం జంతో: కర్మయత్తత్కరోతి స:
తస్మాద నిర్వేద కృతం యత్నం చేష్టేహముత్తమమ్"

(శ్రీమద్రామాయణ మహాకావ్యము)



ఈ సూత్రములందు సజ్జన సాంగత్యము, త్యాగము. మూర్ఖత్వము, విత్తముల గూర్చి నుడువబడు చున్నది.

సూ॥ కా సుఖదా ! సాధుజనమైత్రీ

అర్థము॥ సుఖమునొసంగునది ఏది ! సజ్జన సాంగత్యము.

సూ॥ సర్వవ్యసన వినాశే కో దక్షః ! సర్వదా త్యాగీ

అర్థము॥ సర్వవ్యసన వినాశన దక్షుడెవరు ! త్యాగశీలి.

సూ॥ కిం మరణం ! మూర్ఖత్వము.

అర్థము॥ మరణమననేమి ! మూర్ఖత్వము.

సూ॥ కిమత్యర్థం ! యదవసరే దత్తం

అర్థము॥ ఏది అధికమైనది ! అవసరార్థమున కొసంగునది.

తే॥ సాదు పురుషుల స్నేహంబు సౌఖ్యదంబు
వ్యసన నాశన దక్షుడౌవాడె త్యాగి
మరణమనజెల్లు మూర్ఖత్వమరయ భువిని
అవసరార్థంబునకు నిచ్చునదివరంబు. 55

సాదుజనుల మైత్రి ఇహపర సౌఖ్య ప్రదము. వ్యసన వినాశన సమర్థుడగు మహితాత్ముడె త్యాగశీలి. మూర్ఖత్వముతో ప్రవర్తించుటయే మరణము. అవసరార్థమున కొసంగునదియే అధికమైనది.

ఈ పద్యము యొక్క ప్రధమ పాదమున సజ్జన సాంగత్యము సుఖమునొసంగునని వివరింపబడినది. కుజనులగు మానవులు రజస్తమోగుణా ధిక్యతతో దుష్కర్మ లొనరించుచు జీవించు చుందురు. కనుక దుర్జన సాంగత్యము సర్వదా నిషిద్ధము.

భజగోవిందస్తోత్రము నందలి యీ శ్లోకము నవలోకింపుడు.

"సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చల తత్త్వం నిశ్చల తత్త్వే జీవన్ముక్తిః "

సజ్జన సహవాసము వలన బంధ విముక్తి లభించును.

బంధవిముక్తి వలన మోహము తొలగిపోవును. మోహము నశించిన పిమ్మట నిశ్చలమగు తత్త్వము అవగతమగును. నిశ్చల తత్త్వమునందు జీవన్ముక్తి లభించును.



ధన్యుని, మాన్యుని, రక్షకుని గూర్చియు, మఱియు విద్వాంసుల యొక్క

త్వరిత కర్తవ్యమును గూర్చియు, యీ సూత్రముల యందు విశదమొనర్పబడుచున్నది.

సూ॥ కో ధన్యః ! సన్యాసీః

అర్థము॥ ధన్యుడెవరు ! సంగవిరహితుడు.

సూ॥ కో మాన్యః ! పండితః సాధుః

అర్థము॥ మాన్యులెవరు ! పండితులు, సాధువులు

సూ॥ త్రాతాచకః ! సద్గురుః

అర్థము॥ రక్షకుడెవరు ! సద్గురువు.

సూ॥ త్వరితం కింకర్తవ్యం విదుషాం సంసారసంతతిచ్ఛేదః

అర్థము॥ పండితులకు త్వరిత కర్తవ్యమేమి ! సంసారమును ఛేదించుట.

తే. సంగ రహితుడు ధన్యుడై జగతి బరగు
సాధు బుధులును మాన్యు లౌ సంతతంబు
అరతి జ్ఞాన ప్రదాతయౌ గురువు త్రాత
బుధులకుందగు జన్మ విముక్తి పథము. 55

భౌతిక ప్రపంచము నందలి వ్యామోహమును త్యజించి, పారలౌకిక జ్ఞానము నార్జించుట సంగరాహిత్యము. సంగరహితులే కడుధన్యులు. సాధు జనులు, పండితులు మాననీయులు. పండితులన విద్యా వినయసంపన్నే, బ్రాహ్మణే గవి హస్తిని, శునిచైవ శ్వపాకేచ పండితాస్సమదర్శినః అనుభగవద్గీ తోక్తి ప్రకారము విద్యావినయ సంపన్నులయందు, బ్రహ్మ జ్ఞాన సంయుతులగు బ్రాహ్మణులయందు, గోవుయందు, ఏనుగు యందు, కుక్క యందు, కుక్కమాంసమును పచనమొనర్చు కొనువారలయందు సమదృష్టి గల వారలు. అట్టి మహనీయులు సదా మాన్యులు. జ్ఞాన విద్యచే మానవులకు భవబంధములనుండి రక్షణ లభించు చున్నది. జనన మరణ రూపమగు సంసారమును త్యజించుటయే పండితుల యొక్క త్వరిత కర్తవ్యము.

"ప్రకృతి మభీక్ష్ణంస్మరేత్, హేతు స్వభావ నిశ్చితస్యాత్"
ఉత్పత్తి హేతువును మాటి మాటికి స్మరించ వలెను. పంచ భౌతిక లక్షణమైన ప్రకృతియ నిత్యమని తలంచుచు రాగద్వేషాదులను త్యజించి యుండవలయును.



సంగమము మధువువలె స్మృతి వినాశన మొనర్చుననియు, మఱియు ఇంద్రియ విషయములు తస్కరులతో సమానమనియు బోధించి, మదిరాపాన నిషిద్ధమును,

ఇంద్రియ నిగ్రహమును గూర్చి వివరింపబడుచున్నది.

సూ॥ మదిరేవ యోమోహజనకః ! సంగమః

అర్థము॥ మధువును బోలె స్మృతి వినాశకరమైనదేది ! సంగమము.

సూ॥ కే చ దస్యవః ! విషయాః

అర్థము॥ చోరులెవరు ! ఇంద్రియ విషయములు.

చ॥ మదిరను బోలె శీఘ్రముగ మైకమొనర్చును సంగమంబిలన్
హృదినెడబాయకుండు విషయేచ్ఛలు గావున మానవుల్ సదా
సదమలరీతి మద్యమును సంకుల మౌవిషయాతిరేకమిం
పొందవగ వీడినన్ గలుగు పొందిక మీఱగ సర్వ సౌఖ్యముల్. 57

"మద్యపానం మహాపాపం" మద్యపానమొనరించుట మహాపాపము. దాని వలన మైకము సంభవించును. తదుపరి యుక్తాయుక్త విచక్షణా జ్ఞాన శూన్యతచే పతనము నొందించును. అరీతిగనే సంగమము వలన మైకము కల్గి. అధికమగు విషయవాంఛలు మనస్సు నందుద్భవ మగును. బల వానింద్రియ గ్రామో విద్వాంస మపి కర్షతి, కావున మానవుడు ఇంద్రియ వేగములను నిరోధించి, స్థిత ప్రజ్ఞత నొంద దగియున్నది. అట్టి మానవులకు ఇహపర సౌఖ్యములు సమకూరును.

"ఏక తశ్చతురో వేదాః బ్రహ్మచర్యం తథైవచ
ఏకతస్సర్వపాపాని మద్యపానం తథైవచ"

మఱియు నాయుర్వేద శాస్త్రమునందలి యీసూత్రముల నవలోకింపుడు. "నేంద్రియ వశగ స్స్యాత్, నచంచలం మనోను భ్రామయేత్, నమద్య ద్యూతవేశ్యా ప్రసంగరుచి స్స్యాత్" ఇంద్రియ వ్యాపారములకు వశుడైయుండరాదు. చంచల స్వభావము గల మనస్సును పలురీతుల భ్రమింపదగదు. మద్య పానమునందును, జూదమాడుట యందును, వేశ్యలయందును కోరిక గల్గియుండదగదు.

"పానే ప్రసక్తో భవతు స్త్రీష్వ క్షేషుచ నిత్యశః
కామ క్రోధాభి భూతస్తుయస్యార్యో2నుమతేగతః

(శ్రీరామాయణ మహాకావ్యము)

కామక్రోధములకు వశుడై, మద్యపానమొనరించుచు, వనితాపరవశుడై జూదెమాడుచుండు వానికి పాపము సంభవించును.



మానవులు నిరంతరము స్మరింపదగినది భగవచ్చరణమని, సంసారము కాదని యీ సూత్రమునందు నుడువబడుచున్నది.

సూ॥ కిం అహర్నిశమనుచింత్యం! భగవచ్చరణం న సంసారః

అర్థము॥ మానవులు నిరంతరము చింతింపదగినది ఏది! భగవచ్చరణము, సంసారము కాదు

శా॥ చింతింపందగదెప్డు మానవులకుంజింతాకులంబౌచు న
త్యంతంబైన భయానకంబునగు మిధ్యాయుక్తసంసారమున్,
చింతింపందగుసంతసంబున సదా చింతాహరుండైన శ్రీ
కాంతున్ భక్తజనావతంసుసురరక్షాదక్షు విష్ణున్మదిన్ 58

స్థావర జంగమాత్మకమగు యీ ప్రపంచమశాశ్వతము అశాశ్వతమగు ప్రపంచమును శాశ్వతమని భావించుట అజ్ఞానము. అజ్ఞానము తొలగించి, జ్ఞానమునొసంగునదియే భగవత్తత్వము. భగవంతుడనగా!

క॥ లోకంబులు లోకేశులు
లోకస్థులు దెగినతుదినలోకంబగు పెం
జీకటి కవ్వల నెవ్వం
డేకాకృతి వెలుగునతనినే సేవింతున్ (ఆంధ్ర మహాభాగవతము)

లోకములు, లోకములంబరిపాలించు ప్రభువులు, లోకము లందలి జీవులు, ప్రళయకాలమందు నిర్మూలమైన పిదపనంధకారబంధురమగు సమయముననే మహాశక్తి ఏకాకృతితో ప్రకాశించునో! అదియే భగవత్తత్త్వము. మఱియు

"ఐశ్వర్యస్య సమస్తస్య ధర్మస్యయశసశ్శ్రియః
జ్ఞానవైరాగ్యయోశ్చైవ షణ్ణాం భగ ఇతీరణా"

అష్టైశ్వర్యములు, ధర్మము, కీర్తి, సంపద, జ్ఞానము, వైరాగ్యము యీ ఆరును భగవచ్ఛబ్దముచే చెప్పబడును.

"ఉత్పత్తింప్రళయంచైవ భూతానామాగతింగతిం
వేత్తి విద్యామవిద్యాంచ సవాచ్యో భగవానితి"

సృష్టి కల్పాంతములను, సకల భూతములయొక్క గమనాగమనములను, జ్ఞానము అజ్ఞానములను తెలిసినవాడు భగవంతుడు

"యస్య స్మరణమాత్రేణ జన్మసంసార బంధనాత్
విముచ్యతే నమస్తస్మై విష్ణవే ప్రభవిష్ణవే"

శ్రీమహా విష్ణువుయొక్క స్మరణ మాత్రముచేత, మానవులు జన్మసంసార బంధనముల వలన విముక్తులగుచున్నారు. మఱియు

ఆయురారోగ్య మర్థాంశ్చ భోగాంశ్చైవాను షంగికాన్
దదాతి ధ్యాయతాం నిత్యమపవర్గ ప్రదో హరిః

మోక్ష ప్రదాతయగు శ్రీ మహావిష్ణువు సంతతము తనను ధ్యానించువారలకు దీర్ఘాయువు, శారీరిక మానసిక మగు ఆరోగ్యము, అర్థము, భోగము (భోగములు అష్టవిధములు 1. గృహము 2. శయ్య 3. వస్త్రము 4. ఆభరణము 5. స్త్రీ 6. పుష్పము 7. గంధము 8. తాంబూలము) ప్రసాదించును.
ధీరులు నిరపేక్షులు నాత్మారాముల నైన మునులు హరి భజనము నిష్కారణమ చేయుచుందురు. "నారాయణుడట్టివాడ నవ్యచరిత్రా" (ఆంధ్ర మహాభాగవతము)



ఈ సూత్రమునందు ధేనువును గూర్చి చెప్పబడుచున్నది.

సూ॥ మాతా కా! ధేనుః

అర్థము॥ మాత ఎవరు! ధేనువు

తే॥ మాతృమూర్తిగ దలచి గోమాత నెపుడు
పూజనొనరింప గల్గును పుణ్య ఫలము
ఘాస భక్ష్యంబుచేత దుగ్ధంబునొసగు
ధేనువాదర్శమౌసదా మానవులకు 59

"గవాం పశ్చాద్విజస్యాంఘ్రిం యోగినాం హృత్ కవేర్వచః
పరం శుచితమం విద్యాత్ ముఖం స్త్రీ వహ్ని వాజినామ్"

అనువచనము ననుసరించి ధేనువు పరమ పవిత్రమైనది. అర్చయేత్ దేవగోవిప్ర వృద్ధ వైద్య నృపాతిథీన్ అను ఆయుర్వేదోక్త్యాను సారము నిరతము ధేనువునర్చించ వలయును.

ధేనువు తాను తినునది ఘాసమైనను మానవులకు క్షీరములనొసంగు చున్నది. క్షీరము యొక్క గుణము వైద్య శాస్త్రమునని విధముగా వివరింపబడి యున్నది.

"స్వాదుశీతం మృదుస్నిగ్ధం బహులం శ్లక్ష్ణ పిచ్ఛిలం
గురుమందం ప్రసన్నంచ గవ్యం దశగుణం పయః

తదేవం గుణమే హౌజః సామాన్యాదభివర్ధయేత్
ప్రవరం జీవనీయానాం క్షీరముక్తం రసాయనం"

ఆవుపాలు రసవిపాకములచే మధురమును,గుణవీర్యములచే శీతమును, మృదుత్వము, స్నిగ్ధత్వము, వ్యాపించు స్వభావము, శ్లక్ష్ణ త్వము, పిచ్ఛిలమ్, గురుత్వము మందత్వము, ప్రసన్నత అను పది గుణములు కల్గియుండును. మానవ శరీరమునందలి ఓజస్సు పైన వివరించిన పది గుణములు కల్గియుండును గాన గుణ సామాన్యము వలన గోక్షీరము ఓజస్సును వృద్ధి నొందించును. జీవనీయద్రవ్యములలో గోక్షీరము అత్యంత శ్రేష్ఠమైనది. జరావ్యాధి వినాశనరూపమైన రసాయనముగా చెప్పబడినది.

ధేనువు మానవులకు నిత్యము నా దర్శమైనది. గోమాతను ద్వేషించినచో హింసనొందునని వివరింపబడిన ఆంధ్రమహాభాగవతమునందలి యీ పద్యమును తిలకింపుడు.

ఆ॥ శుద్ధసాధులందు సురలందు శ్రుతులందు
గోవులందు విప్రకోటియందు
ధర్మపదవి యందు దలగినాయందు వా
డెవ్వడలుగువాడె హింస జెందు

కావున గోవు సర్వదా ఆరాధనీయమైనది. కాశీఖండమునందలి యీ పద్యములను గమనింపుము

"విమడవయంబు గోవులు పవిత్రము గోవులు మంగళంబుత
ద్భవఖురపంకశృంగపరి ఘట్టదళద్ధరణీరజశ్ఛటల్
కమగావి వవ్వుచుండు బురఘస్మర మూర్ధజటాటవీ నట
ద్భవ పథసింధు వార్లహరిగర్వ భరార్భటి భావనోన్నతిన్"

"ప్రతి వసియించు గోవుల ఖురాగ్రములందు సమస్త తీర్థ సం
తతియును సర్వపర్వత వితానము కొమ్ముల మధ్య సీమ న
ద్భుత చరితుండు శంకరుడు భూధర కన్యయుదాను నుండుద
ద్వితత కుచేభకుంభ పరిదిగ్ధ పటీర పవిత్ర వక్షుడై"



దానము సత్పాత్రున కొనరింపవలెనని దానము యొక్క విశిష్టత యీ సూత్రమునందు విశదమొనర్చబడుచున్నది.

సూ॥ కిం దానం! అనాకాంక్షం

అర్థము॥ దానమననేమి! కాంక్షింపకనే సత్పాత్రున కొసంగునది

తే॥ ప్రతిఫలంబును గోరక ప్రమితి తోడ
దేశ కాలానుసరణీయ దీక్షతోడ
భయముశ్రద్ధయు మందాక్ష పటిమతోడ
పాత్రునకు నిచ్చుదానంబు పావనంబు 60

"శ్రద్ధయాదేయం, అశ్రద్ధయా2దేయం,
శ్రియా దేయం, హ్రియాదేయం, భియాదేయం, సంవిదాదేయం"

అని ఉపనిషత్తు వివరించు చున్నది. ఇందలి భావమేమన! దానమును శ్రద్ధతో జేయవలయును. అశ్రద్ధతో జేయవలయును. సిగ్గుతో జేయదగదు. భీతితో జేయవలయును. జ్ఞానముతో జేయవలెను. మఱియు దేశ కాల పాత్రలనెఱింగి జేయవలయును. ప్రతిఫలా పేక్ష రహితముగా దానము నొసంగవలయును. "దానశీలః" అను ఆయుర్వేదోక్తి ననుసరించి, మానవుడు దానశీలుడుగా మనదగియున్నది. భగవద్గీతయందలి యీశ్లోకములను పరిశీలింపుడు.

"యజ్ఞ దానతపః కర్మనత్యాజ్యం కార్యమేవ తత్
యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణాం"

యజ్ఞము, దానము, తపస్సులు అనుకర్మలను త్యజించరాదు. ఆ కార్యములను చేయవలసి యున్నది. ఏలనన యజ్ఞము, దానము, తపస్సు మానవులను పావన మొనరించును.

"దాతవ్యమితియద్దానం దీయతే2నుపకారిణే
దేశే కాలేచ పాత్రేచ తద్దానం సాత్వికం స్మృతమ్"

దేశకాల పాత్రములననుసరించి ప్రత్యుపకారము నాకాంక్షింపకయే యొసంగు దానము సాత్వికము.

పవిత్ర స్థలములయందు, పర్వకాలములయందు యోగ్యుడగువాని కొసంగు దానము ప్రశస్తము. గోదాన భూదాన హిరణ్యదాన అన్నదాన వస్త్రదానాది దానములనేకములు. ఈ దానములు సత్పాత్రుని నిర్ణయించుకొని చేయవలయును. అయోగ్యునకొసంగు దానము అప్రశస్తము. దానములలో జ్ఞానదానము విశిష్టమైనది. జ్ఞానదానమువలన నిహపర సుఖము చేకూరును.



సన్మిత్రుని గూర్చి గ్రంధాంతమునందలి యీ సూత్రము నందు వివరింపబడుచున్నది.

సూ॥ కో మిత్ర! యోనివారయతి పాపాత్

అర్థము॥ మిత్రుడు ఎవరు! పాపకర్మాచరణ నుండి నివారణ నొనరించువాడు

సీ॥ సర్వభూతంబుల సమహిత మతితోడ
కరుణతోనిరతంబు గాంచు నియతి
హింసా విధానంబు హీనంబు దుష్కృత
హేతువులని పల్కు హితులకెలమి
సత్య సత్పథయుత నిత్యప్రవర్తన
మమిత శుభంబని మదిని తలచు
నధ్యయనము బోధాచరణప్రచా
రణ నిరతిని వర్తనము సలుపు

తే॥ క్షీర సాగర కన్యకా చిత్తచోరు
నఘవిదూరుని శుభ కరునమిత భక్తి
మదిని దలచుచు నిరతంబు మసలు నట్టి
ఘనుడు ధరణిని సన్మిత్రుడనగ నొప్పు 61

సన్మిత్రుని గూర్చి భర్తృహరి సుభాషితము నందలి యీ శ్లోకమును తిలకించుడు.

"పాపాన్ని వారయతి యోజయతే హితాయ
గుహ్యం నిగూహతి గుణాన్ ప్రకటీకరోతి
ఆపద్గతంచనజహాతి దదాతి కాలే
సన్మిత్రలక్షణమిదం ప్రవదంతి సంతః

ఈ శ్లోకమునకు ఏనుగు లక్ష్మణకవి యొక్క ఆంధ్రీకరణ నవలోకింపుడు

తే॥ అఘమువలన మరల్చు హితార్థ కలితు
జేయుగోప్యంబు దాచు బోషించు గుణము
విడువదాపన్ను లేవడి వేళనిచ్చు
మిత్రుడీ లక్షణంబుల మెలగుచుండు

పాపకర్మల నుండి నివారణ విధానమును బోధించి, భగవత్తత్వమును విశదమొనరించు వారలే నిక్కమగు సఖులు.



సాధన సుబోధిని

ద్వితీయ భాగము

శా॥ అష్టాంగంబులనంగజెల్లు భువిలో నాధ్యాత్మికత్వంబు ని
క్లిష్టశ్లాఘ్యము సంవివేకము సదా దివ్యాతి సంమోదమున్
తుష్టి ప్రజ్ఞ దలిర్పశాస్త్రవిధి బ్రత్యూహోపశాంతంబుగా
శిష్టవ్యూహము సంతసింపగ గృతిన్ జేతున్ ద్వితీయార్ధమున్.

తే॥ ధన్యజీవన మొనరింపదగును ధరణి
ధర్మవిదులెల్లజ్ఞాన విద్యానిరతిని
గాన నష్టాంగయోగ సంకలిత కృతిని
పఠన జేయంగ జ్ఞేయమౌపరమ సరణి



అష్టాంగయోగములు

తే॥ అష్టవిధములు యోగంబులంచితముగ
యమము నియమంబులున్మఱి యాసనములు
ప్రాణరోధము ప్రత్యాహరణము ధార
ణంబు ధ్యాన సమాధులనంగ బరగు

యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణము, ధ్యానము, సమాధి అనునవి యోగము యొక్క ఎనిమిది అంగములు.

యమ నియమములాధ్యాత్మిక విద్యకు మూలాధారములు. యమ నియమముల నతి శ్రద్ధతో ననుష్ఠించినచో నాధ్యాత్మిక విద్య నిశ్చలమై విరాజిల్లును యమము పది విధములుగా పేర్కొనబడినది. నియమముపది విధములు. ఆసనములనగా! యోగాసనములు. మనో నిగ్రహము కొఱకు ఆసనములత్యావశ్యకములు ప్రాణాయామము ఆరోగ్యము కొఱకును, ప్రత్యాహారము అధ్యాత్మికాభ్యున్నతికి అవరోధములగు వానిని నిర్మూలన మొనర్చుట కొఱకును, ధారణము ఆత్మయందు చిత్తమును నిల్పుట కొఱకును, ధ్యానము ధ్యేయమగు

బ్రహ్మను గూర్చి ధ్యానించుట కొఱకును ఆవశ్యకములై యున్నవి. తదుపరి సమాధి స్థితి సం లభ్యము. ఇదియే పరిపూర్ణాధ్యాత్మిక విద్య.

యోగాంగములను క్రమముగా ననుష్ఠింపవలయును. ఇందలి తొలుతనుడువ బడిన యేడును బహిరంగములు. సమాధి అను అంగము మాత్రము యోగమునకు అంతరంగము.

"యమ నియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధారణ ధ్యాన
సమాధయో2ష్టావంగాని" (పాతంజల యోగ దర్శనము)

యమము

తే॥ యమము దశ విధమౌననయంబు భువిన
హింసనంబును సత్యంబహింస మఱియు
బ్రహ్మచర్యము కరుణార్జవములు క్షమయు
ధృతి మితాహార శౌచముల్ హితమొనర్చు 2

అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, దయ, ఋజుత్వము, క్షమ, ధైర్యము, మితాహారము, శౌచము అని యమము పది విధములు.

త్రికరణముగా (మనో, వాక్, కాయ కర్మలచే) హింసనొనరించకుండుట, నిజమును పలుకుట, దొంగతనము జేయకుండుట, బ్రహ్మచర్యమునను సరించుట సర్వజీవుల యందు కరుణ గల్గియుండుట, ధర్మబద్ధమైన ఋజు మార్గమున బ్రవర్తించుట, ఓర్పు గల్గియుండుట, అధైర్యము నొందకుండుట, మితమగు ఆహారమును భుజించుట, శుచిత్వము గల్గియుండుట అను యా సత్కర్మలు యమమనబడుచున్నవి.

యమమునందు ప్రథమమున అహింస పేర్కొనబడినది. మానవునకు ఆధ్యాత్మిక విద్యావలంబన కొఱకు అహింసా వ్రతమత్యంతావశ్యకము. కనుక తొలుత అహింసా విధానము గూర్చి అవగాహన మొనర్చుకొనదగియున్నది.

"అహింసా సత్యమస్తేయ బ్రహ్మచర్యాపరిగ్రహో యమాః"

అని పాతంజల యోగదర్శనమునందు యమము అయిదు విధములని చెప్పబడినది. మఱియు యమమును గూర్చి

"జాతి దేశ కాల సమయానవచ్ఛిన్నాః సార్వభౌమా మహావ్రతమ్"

జాతి, దేశము, కాలము, సమయము అను విభాగములేక, సర్వావస్థలయందు

ననుష్ఠించినచో నది మహావ్రతమని పలుకబడుచున్నదని కలదు.

యమ నియమము లందు వివరింపబడిన అహింసాది సుగుణములు దైవీ సంపదయందు జన్మించిన మానవులకు సహజముగనే సంభవించునని భగవద్గీత యందలి యీ మూడు శ్లోకముల వలన వ్యక్తమగుచున్నది.

"అభయం సత్త్వ సంశుద్ధిః జ్ఞానయోగ వ్యవస్థితిః
దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయ స్తప ఆర్జవమ్"
"అహింసా సత్యమక్రోధః త్యాగశ్శాంతిరపైశునమ్
దయాభూతేష్వలోలత్వం మార్దవం హ్రీ రచాపలమ్"
"తేజః క్షమా ధృతి శ్శౌచమ్ అద్రోహోనాతిమానితా
భవంతి సంపదం దైవీం అభిజాతస్య భారత"
"శరీర సాధనాపేక్షం నిత్యం యత్కర్మ తద్యమః" (అమర కోశము)

"శరీరమును మాత్రము సాధనముగా నపేక్షించునదై, నిత్యముగా జేయదగిన సత్యాహింసాది కర్మములు యమము.

1. అహింస

తే॥ క్లేశకర్మలు పరులకొకింత యేని
సలుపకుండుట యౌనహింసావ్రతంబు
ప్రథితమైనట్టి వ్రతమంచు పల్కు, ప్రాజ్ఞ
వరులు నిరతంబు దాన శుభం బెలర్చు 3

పరులకు (సమస్త ప్రాణులకు) మనోవాక్ కాయ కర్మలచే నేవిధమైన క్లేశ కర్మల నొనరించకుండుట అహింస. ద్వేషము వలన విరోధము, విరోధము వలన హింసా ప్రవృత్తి సంభవించును.

కావున ద్వేషమును త్యజించి, విరోధమును నిరోధించు కొనుటయే అహింస. అహింసా వ్రతము వలన సత్త్వగుణము, సత్త్వగుణము వలన శాంత స్వభావము సమకూరును. శాంతచిత్తునకు సర్వదా సౌఖ్యము చేకూరును.

హింస పలు విధములు. విరోధము వలన నొనర్చునది, అకారణముగా నొనర్చునది, భయముతో నొనర్చునది, స్వార్థముతో నొనర్చునది. స్వార్థమనగా! అజ కుక్కుటాది ప్రాణులను బట్టి వధించుట అనగా! ఆ జీవులపై కరుణ గాని, ద్వేషము గాని యుండదు. కేవలము స్వార్థము కొఱకై ఆ జీవులను వధించి హింసించుట

ఈ విధానము కూడా దోషహేతువే.

" అహింసా పరమో ధర్మ స్త్వధర్మః ప్రాణినాం వధః"

హింస నొనరించకుండుట పరమ ధర్మము. ప్రాణులను వధించుట అధర్మము. కావున మానవులకు మాంస భక్షణము కడు నిషిద్ధము. మాంసము రాక్షస భోజనమని వైద్యశాస్త్రమున నుడువబడినది.

"అమిషం లోభనం మాంసం రసం శోణిత సంభవం
తరసం పిశితంచైవ క్రవ్యం రాక్షస భోజనం"
"దేవానామమృతం న్నృణా మృషీణాం చాన్న మోషధీః
దైత్యరక్షః పిశాచాదే ర్మత్తమద్యామిషాదిచ"

దేవతలకు అమృతము, మానవులకును ఋషులకును అన్నము మఱియు ఫలములు శాకములు, దైత్య రాక్షస పిశాచాదులకు మద్య మాంసాదులు ఆహారము. కావున ప్రత్యక్ష హింసారూపమైన మాంస భక్షణము ఆధ్యాత్మిక తత్వమునకు వ్యతిరిక్తము.

జీవులు స్థావరములు, జంగమములు అని రెండు విధములు. ఉద్భవించిన చోటుననే వృద్ధినొంది సంచరించు శక్తిలేక కాలాంతరమున నశించు స్వభావము గల వృక్షాదులు స్థావరములు. ఉద్భవించిన చోటుననే యుండక పలు విధముల సంచరించు స్వభావము. శక్తిగల పశు పక్ష్యాదులు, మానవులు ఆదిగా గల జీవులు జంగమములు. జంగమములలో జీవత్వము పరిపూర్ణత్వము నొందియున్నందున అట్టి జీవులను సంహరించుట ప్రత్యక్షహింసా విధానము కాగలదు.

మాంసాహారులగు మానవులు శాకాహారము కూడ హింసాయుతమని పల్కుచుండురు. అట్టి మాటలు వారల స్వార్థము కొరకు మాత్రమే. శాకాహారమొకింత హింసాయుతమైనను, అట్టి హింస మానవులు ప్రత్యహమొనరించు నిత్యనైమిత్తికాది కామ్య సత్కర్మలచే తొలగును. నిత్యనైమిత్తికాది కామ్య కర్మలనగా! సంధ్యా గ్నాచ ద్యుపాసములు నిత్యములు. పితృశ్రాద్ధ తర్పణాదులు నైమిత్తికములు. యజ్ఞ యాగాదులు కామ్యములు.

భగవానుని పుష్పములతో నారాధించు సంప్రదాయము కలదు. బాహ్య పుష్పాదులతో సహితముగా సద్గుణములు అను మనః పుష్పములతో నారాధించుట అత్యుత్తమము. మనః పుష్పములనగా! ఎనిమిది సద్గుణములు

"అహింసా ప్రథమం పుష్పం పుష్పమింద్రియ నిగ్రహః
సర్వభూత దయా పుష్పం క్షమాపుష్పం విశేషతః
శాంతి పుష్పం తపః పుష్పం ధ్యానపుష్పం తథైవచ
సత్యమష్టవిధం పుష్పం విష్ణోః ప్రీతికరం భవేత్"

అహింస, ఇంద్రియ నిగ్రహము, సమస్తభూతదయ, క్షమ, శాంతి, తపస్సు ధ్యానము, సత్యవచనము, అను యీ సద్గుణములను మానవుడు పొందియున్నచో భగవదనుగ్రహము లభ్యమగుట నిశ్చయము. ఇందు తొలుత అహింసావ్రతము పేర్కొనబడినది. అనగా! ఆధ్యాత్మిక విద్య అహింసావ్రతముతో ప్రారంభించవలెనని అర్థమగుచున్నది. అహింసా వ్రతమునననుసరించ నేరని ఆధ్యాత్మిక తత్త్వము నిరుపయోగము, నిరర్థకము.

మానవులు మనోవాక్ కాయములచే హింసను విడనాడుట శ్రేయోదాయకము. కరుణరసము పరిపూర్ణత్వము నొందినచో అహింసా వ్రతము సిద్ధించును.

"శ్లోకార్థేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథ కోటిభిః
దయా సమం నాస్తిపుణ్యం పాపం హింసా సమం నహి"

దయకు సమమగు పుణ్యము లేదు. హింసకు సమమగు పాపము లేదు.

"అహింసా ప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః

అహింసా విషయమున అత్యున్నతత్వము నొందినచో ఆ అహింసా పూర్ణుని సన్నిధానమున సహజ విరోధులకు సహితము వైరముండనేరదని పాతంజల యోగదర్శనమున పేర్కొనబడినది.

"భక్త్యా కళ్యాణ మిత్రాణి సేవేతేతర దూరగః
హింసా స్తేయాఽన్యథా కామం పై శున్యం పరుషాన్పతే"

(అష్టాంగ హృదయము)

"దేవ ద్విజగురు ప్రాజ్ఞ పూజనం శౌచమార్జవం
బ్రహ్మచర్యమహింసాచ శారీరం తప ఉచ్యతే"

దేవతలను, ద్విజులను, గురువులను, జ్ఞాన వంతులను పూజించుట, బాహ్య శౌచము, నిష్కపట ప్రవర్తనము, బ్రహ్మచర్యము, అహింస అనునవి శారీరిక తపస్సని పేర్కొనబడుచున్నవి.

"అహింసాపరమో ధర్మః అహింసా పరమం తపః
అహింసా పరమం సత్యం యతో ధర్మః ప్రవర్తతే"

అహింస పరమమైన ధర్మము. అహింస శ్రేష్ఠమైన తపస్సు. అహింస పరమసత్యము. అహింస వలననే ధర్మము ప్రవర్తించుచున్నది.

కావున అహింసా వ్రతము అన్ని వ్రతములకంటె శ్రేష్ఠమైనదని గ్రహింపుడు

"ధర్మము సత్యము గీర్తియు
నిర్మల దయ విష్ణుభక్తి నిరుపమ ఘన స
త్కర్మ మహింసా వ్రతము
వ్వర్మిలి గలవారె పుణ్యులవనీనాథా"

౨. సత్యము

కః సత్యంబని పల్కుదురిల
నిత్యంబప్రియము గాక నిజమౌ రీతిన్
అత్యంతము దనరారెడు
సత్యంబును సాధుజనములు సంతసమొదవన్ 4

నిరంతరము నిజమును ప్రియముగా పల్కుట సత్యము అని సాధు పురుషులు పేర్కొనుచున్నారు.

"సత్యం బ్రూయాత్ప్రియం బ్రూయాత్
న బ్రూయాత్ సత్యమప్రియమ్"

ఎల్లప్పుడు సత్యమును పలుక వలయును. ప్రియమును పలుక వలయును. ప్రియముకాని సత్యమును పలుకజనదు. సత్యనిర్వచనము అతి క్లిష్టతరము. పరులకు అపకారము, హాని సంభవించు సత్యమును పలుకరాదు. ఆవిధమగు సత్యమును పల్కినచో నందువలన పరులకు నేర్పడిన హానిచే గల్గు దోషము అట్టి సత్యమును పలికిన వారలకు సంభవమగును. అసత్యమును పలుకరాదు. అసత్యమును పలికినచో అసత్యదోషము సంప్రాప్తించును. కావున అట్టి సమయమునందు యుక్తి యుక్తముగా మెలగుటయే మేలు.

"వారి జాక్షులందు వైవాహికములందు
ప్రాణవిత్తమాన భంగమందు
చకిత గోకులాగ్ర జన్మ రక్షణమందు
బొంక వచ్చునఘము పొందదధిప"

ఇది శుక్రనీతి శాస్త్రీయము కానేరదు.

"సత్యమేవేశ్వరో లోకే సత్యం పద్మాశ్రితా సదా
సత్యమూలాని సర్వాణి సత్యాన్నాస్తి పరం పదమ్"
(రామాయణ మహాకావ్యము)

"సత్యం శౌచం దయా క్షాంతి రార్జవం మధురం వచః
ద్విజ గోయతి సద్భక్తి స్సప్తైతే శుభదాగుణాః"

సత్యము, శౌచము, దయ క్షాంతి, అర్జవము, మధురవచనము, ద్విజుల యందు గోవులయందు యతి జనులయందు భక్తి గల్గియుండుట. అను యీ సప్తగుణములు మానవులకు శుభమునొసంగును.

ఇందలి సప్తగుణములలో తొలుత సత్యము పేర్కొనబడినది. కావున సత్యము అత్యంత విశిష్టమైనదని గమనింపుడు.

రామయణ మహాకావ్యమునందు శ్రీరామచంద్రుని గూర్చి "సత్యవాక్యః" సత్యసంధః" సత్యవాక్య పరాక్రమః" అని పేర్కొనబడిన యీ శ్లోకములనవలోకింపుడు.

"కోన్వస్మింత్సాంప్రతంలోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్
ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో దృఢవ్రతః"

"ధర్మజ్ఞస్సత్య సంధశ్చ ప్రజానాంచ హితేరతః
యశస్వీ జ్ఞాన సంపన్న శ్శుచిర్వశ్య స్సమాధిమాన్"

"అహంవేద్మి మహాత్మానం రామం సత్య పరాక్రమమ్
వసిష్ఠోపి మహాతేజా యేచేమే తపసి స్థితాః"

వసుదేవుడు సత్యవాక్పరిపాలకుడు గాన శ్రీమహావిష్ణువుని తనయునిగా బొంది, ధన్యత జెందినాడు. హరిశ్చంద్రుడు సత్యవాక్య నిరతుడై అత్యంత కీర్తిని వడసినాడు. శ్రీమహా భాగవతమున ప్రహ్లాదుని యొక్క గుణములను పేర్కొనుచు "లీలలందును బొంకులు లేనివాడు అని పోతనామాత్యుడు రమణీయముగా వర్ణించి యున్నాడు ఇంకనూ సత్య సంధులైన మహనీయులెందరో కలరు.

అలంకార శాస్త్రమునందు అతిశయోక్త్యలంకార మను పద్ధతి కలదు. అతిశయోక్త్య లంకార మనిన ! కవులు తమ గ్రంధములయందు కొన్ని విషయములను అతిశయముగా వర్ణించుట. ఉదాహరణమునకు భాగవతము నందలి యీ పద్యమును గ్రహించదగియున్నది. "ఇభలోకేంద్రుడు హస్తరంధ్రములనీ రెక్కించి పూరించి చం డభ ఘూర్ణంబున కెత్తి నిక్కివడి నుడ్డాడించి పింజింపనా

రభ టిన్నీరములోన బెల్లెగసి నక్రగ్రాహ పాఠీనముల్ నభమందాడెడు మీన కర్కటములన్ బట్టెన్ సురల్ మ్రాన్పడన్"

గజేంద్రుడు తన తొండముతో సరోవరము నందలి జలమును పూరించగా నాజలముతో సహా ఆ సరోవరమున నివసించు నక్రగ్రాహ పాఠీనములు కూడ తొండమునం బ్రవేశించెను. తదుపరి గజేంద్రుడు తొండమును ఆకాశ మార్గమున కెత్తి జలమును చిలుకరిల జిమ్మగా నాజలము నందలి నక్రగ్రాహ పాఠీనములు (మొసలి, ఒకా నొక నీరుపాము, వేయి కోఱల చేప) ఆకాశమునందలి మీన కర్కటములను (మీన రాశి, కర్కాటక రాశి) పట్టినట్లు వర్ణింపబడినది. ఇందు గజేంద్రుని యొక్క పరాక్రమము అతిశయముగా వర్ణింపబడినది. ఇదో కవితా పరమగు అతిశక్తియోక్త్యలంకారము. కావున యిందు అసత్య దోషము కానరాదు.

ప్రతిజ్ఞను నెఱవేర్చుకొనుట సత్యవాక్పరిపాలన కాగలదు. సత్య దీక్ష కొఱకు రాగద్వేషరహిత నిష్కల్మష హృదయముతో బ్రవర్తింప దగియున్నది.

"సత్య ప్రతిష్ఠాయాం క్రియా ఫలాశ్రయత్వమ్"

(పాతంజల యోగ దర్శనము)

సత్యవచనమునందు దుత్తమ స్థితి నొందినచో ధర్మాధర్మ ఫలితములగు స్వర్గనరకాదులకు ఆశ్రయమగుట సంభవించును.

"నా నృతం బ్రూయాత్" (చరక సంహిత)

అబద్ధమును పలుక రాదు.

"అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితంచయత్
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే"

మనస్సునకు వ్యధ కలిగింపని వియు, సత్యము, ప్రియము, హితకరము నగు మాటలును, స్వాధ్యాయాభ్యాసమును, వాచిక తపస్సని నుడువబడినది.

విష్ణు సహస్రనామ స్తోత్రములయందు భగవానుని "సత్యః" సత్యపరాక్రమః" అని కీర్తింపబడినది. భగవంతుడు సత్య స్వరూపుడుగాన సత్యః అని నుడువబడినది. సత్యము త్రికాలాతీతముగాన భగవానుని సత్యః అని పేర్కొన బడినది. భగవంతుడు సత్యమునే వచించును గాన సత్యః అని కీర్తింపబడియుండెను.

సత్యమును నిరూపించుట యందు భగవంతుడు అమిత పరాక్రమము గలవాడు గావున సత్య పరాక్రమః అని శ్లాఘింపబడినాడు.

గావున సత్య ధర్మాచరణ మతి పవిత్రమని భావించ వలసియున్నది.

"దైవాధీనం జగత్సర్వం సత్యాధీనంతు దైవతం

తత్సత్య ముత్తమాధీనం ఉత్తమో మమ దేవతా"

సమస్త మైన జగత్తు దైవాధీనమై యున్నది. ఆ దైవము సత్యమునకు అధీనమై యున్నది. ఆ ఉత్తములే నా యొక్క దేవతలు అని భగవంతుని వాక్కు.

"న సత్య తుల్యం వ్రతమన్య దస్తి"

సత్యముతో సమానమగు వ్రతము మరియొకటి లేదు.

"ధర్మోహిపరమోలోకే ధర్మే సత్యం ప్రతిష్ఠితమ్"

సత్యముతో సమానమగు వ్రతము మరియొకటి లేదు.

"ధర్మోహిపరమోలోకే ధర్మేసత్యం ప్రతిష్ఠితమ్" (రామాయణ మహా కావ్యము)

3. అస్తేయము

క॥ అస్తేయము మర్త్యులకు ప్ర
శస్తంబై బరగు భువిని శాశ్వత రీతిన్
ప్రస్తుతి జేతురు ప్రాజ్ఞులు
అస్తేయ వ్రతనిరతులనంచిత మతితోన్. 5

పరుల ధనాదులనపహరించకుండుట, మరియునా విషయమై కోరిక లేకుండుట అస్తేయము.

అహింసా, సత్యముల తదుపరి అస్తేయము ననుసరించుట, ఆధ్యాత్మిక తత్వమున కత్యావశ్యకము. అస్తేయమన ! దొంగతనము చేయకుండుట. మానవునకు సంతృప్తి లేనిచో అక్రమ పద్ధతుల నవలంబించును. అక్రమ విధానములలో దొంగ తనమొకటి. దొంగతనములు. పలు విధములు. పరధనాపహరణము, పరద్రవ్యాపహరణము, పరదారాప హరణము మొదలగునవి. దొంగ తనము కడు హేయమైనది. అది సర్వానర్థములకు మూలము. అస్తేయ వ్రతము ననుసరించని హేతువుచే, రావణాదులు సకుల క్షయము నొందిన యుదంతము విదితమే.

అస్తేయమును మానసిక వాచక కాయికముగా ననుసరించ వలయును. చౌర్యమునకు సంబంధించిన తలంపు మనస్సు నందేర్పడినను దోషమే కావున మనస్సును స్వాధీన మొనర్చుకొన వలయును.

"మన ఏవ జగత్సర్వం మన ఏవ మహారిపుః
మన ఏవ హి సంసారో మన ఏవ జగత్త్రయమ్"

మనస్సే సర్వ జగత్తు. మనస్సే మహా శత్రువు.

మనస్సే సంసారమునకు హేతువు. మనస్తే మూడు లోకములకు మూలము.

కనుక మనో నిగ్రహముతో అస్తేయ వ్రతమును ఆచరింప వలయును.

"అస్తేయ ప్రతిష్ఠాయాం సర్వ రత్నోప స్థానమ్"

(పాతంజల యోగ దర్శనము)

అస్తేయమునందున్నత స్థితి నొందినచో సమస్త రత్నములును సమకూరును

"నాన్య స్వమాద దీత, నాన్య స్త్రియ మభిలషేత్, నాన్యశ్రియమ్" (చరకక సంహిత)

పరద్రవ్యము నపహరింప దగదు. పరస్త్రీల నభిలషింపదగదు. పరసంప దనపహరింప దగదు.

కవులు అన్య కవుల యొక్క కవిత్వమును గ్రహించి, తమ గ్రంధములయందు స్వీయ రచనల వలె పొందు పరచు కొనుటయు చౌర్యమే.

4. బ్రహ్మ చర్యము

తే॥ బ్రహ్మ చర్యము మేలని బ్రహ్మవిదులు
పలుకుదురు ప్రీతి తోడుత నెలమి నిలను
బ్రహ్మ చర్యాశ్రమంబుచే పరమమైన
హర్షమిహమున బరమునందమరు మిగుల. 6

మనో వాక్ కాయములచే మైథునమును విసర్జించుట బ్రహ్మ చర్యము. జన్మ ప్రభృతి నాధ్యాత్మిక జీవనమొనరించు వారలకు సంపూర్ణ బ్రహ్మ చర్యమావశ్యకము. ఇదియే నైష్ఠిక బ్రహ్మ చర్యము. దీనిచే పరిపూర్ణ బ్రహ్మ జ్ఞానము లభియించును. బ్రహ్మ చర్య వ్రతమునకు సమమగు వ్రతము మరియొకటి లేదనుట అతిశయోక్తి కానేరదు. ఈ బ్రహ్మ చర్యవ్రతమును బాల్యమునుండి దేహపతనము దనుక నిర్వహించవలయును. బ్రహ్మ చర్యమునుండియే సన్యాసమును స్వీకరించినచో బ్రహ్మైను భూతి సంభవించుట సంశయ రహితము. అట్టి మహితాత్ముల జీవనము ధన్యము.

"బ్రహ్మ చర్య వ్రతం సారం వ్రతానాముత్తమంవ్రతం
బ్రహ్మ చర్యతపస్సారం బ్రహ్మ చర్యం మహత్ఫలం"

"క్రియాసు సకలాస్వేవ బ్రహ్మ చర్యం వివర్ధయేత్
బ్రహ్మ చర్య ప్రభావేన తప ఉగ్రం ప్రవర్తతే"
"బ్రహ్మ చర్యా త్పరం నాస్తి ధర్మ సాధనముత్తమం
మహా వ్రతమిదంలోకే తన్నిబోధ సదాద్విజ"

బ్రహ్మ చర్య వ్రతము సారవంతమైనది. వ్రతములలో నుత్తమమైనది. బ్రహ్మ చర్యము తపస్సు యొక్క సారము. బ్రహ్మ చర్యము అధికమగు ఫలితమునొసంగును. సకల క్రియలయందు బ్రహ్మ చర్య వ్రతమును వృద్ధినొందించ వలయును. బ్రహ్మ చర్య వ్రత ప్రభావముచే నుగ్రమగు తపస్సు నొనరించుటకు సాధ్యమగును. బ్రహ్మ చర్యముకంటే నుత్తమమగు ధర్మ సాధనము లేదు. లోకమునందు దీనిని మహా వ్రతమని గ్రహించ వలెను.

బ్రహ్మ చర్య వ్రతము ననుష్ఠించు వారలు అష్టాంగ మైధునములను త్యజించ వలయును. అష్టాంగ మైధునములనగా !

"స్మరణం కీర్తనం కేళి: ప్రేక్షణం గుహ్య భాషణం
సంకల్పో2ధ్యవసాయశ్చ క్రియా నిర్వృత్తి రేవచ:
ఏతన్మై ధునమష్టాంగం ప్రవదంతి మనీషిణః

1. స్మరణము, 2. కీర్తనము, 3. కేళి, 4. ప్రేక్షణము, 5. గుహ్య భాషణము, 6. సంకల్పము, 7. అధ్యవసాయము, 8. క్రియా నిర్వృత్తి.

బ్రహ్మ చర్య వ్రతముచే నాధ్యాత్మిక పథముననత్యున్న తస్థితి నొందిన వారలు శ్రీరామకృష్ణ పరమహంస, శారదా దేవి, స్వామి వివేకానంద మొదలగు వారలు. ఆమహాత్ము లాధ్యాత్మిక వేత్తల కత్యంత మాదర్శ నీయులు. వారల బ్రహ్మ చర్యము నిష్కలంకము.

బ్రహ్మ చర్యమును క్రమ బద్ధముగా నిర్వహించినచో బ్రహ్మతేజస్సు లభియించును. బ్రహ్మ చర్య వ్రతము ననుసరింపని వారలకు జపతపములు నిరర్థకములు.

ఇక గృహస్థ బ్రహ్మ చర్యమనునది కలదు. మానవుడు. ఉపనయ నానంతరము నిష్ఠతో బ్రహ్మ చర్య వ్రతము ననుష్ఠించి, ఆధ్యాత్మిక విద్య నభ్యసించి, వివాహము తదుపరి ఏకపత్నీ వ్రతము నాచరింపవలయును. పురుషుడు పరస్త్రీ విషయమై, స్త్రీ పర పురుషుని విషయమై తలంచక, త్రికరణ శుద్ధితో మెలంగుచు నన్యోన్యతతో కాలము ననుసరించి నియమముతో బ్రవర్తించుచు ఋతు

కాలములో విషయములందు బ్రవేశించి, తదితర సమయములలో బ్రహ్మ చర్య నిష్ఠతో నుండ వలయును.

"ఋతు కాలాభిగా మీయః స్వదార నిరతశ్చయః
స సదా బ్రహ్మచారీ హి విజ్ఞేయస్స గృహాశ్రమీ"

మరియు విధుర బ్రహ్మచర్యమును గూర్చి గ్రహించ దగియున్నది. భార్యా భర్తలు కొంతకాలము దనుక సంసారమందుండి వైరాగ్యముచే గాని, లేక దంపతులలోనే యొకరి దేహపతనము సంభవించి నప్పటి నుండి గాని, బ్రహ్మ చర్యమును వహించి, తపస్సు మొదలగునవి నిర్వహించుచు నాధ్యాత్మిక భావముతో నుండ వలయును.

ఆయుస్తే జోబలం వీర్యం ప్రజ్ఞా శ్రీశ్చ మహద్యశః
పుణ్యం భగవత్ప్రియత్వం లభ్యతే బ్రహ్మ చర్యయా॥

బ్రహ్మ చర్యము వలన ఆయువు (పరిపూర్ణాయువు), తేజస్సు బ్రహ్మతేజస్సు) బలము (శారీరిక మానసిక బలము), పరాక్రమము, ప్రజ్ఞ, సంపద (అధ్యాత్మి సంపద), అమితమగు యశస్సు, పుణ్యము, దైవ ప్రీతి లభియించును.

"బ్రహ్మ చర్య ప్రతిష్ఠాయాం వీర్యలాభః
(పాతంజలయోగ దర్శనము)

5. దయ

బ్రహ్మ చర్య నిష్ఠ యేర్పడినచో బ్రహ్మ వర్చస్సు ప్రాప్తించును.

తే॥ సర్వభూతము లందున సమహితత్వ
కరుణ భావంబుతోనమ క్షణము బ్రీతి
వర్తనమొనర్చుటయ మానవత్వ మరయ
దయకు సమమగు ధర్మంబు ధరణి లేదు. 7

సర్వ జీవులయందు కరుణ భావము కల్గియుండుటయే దయ. దయాగుణ మతి ప్రశస్తమైనది. కరుణ అధ్యాత్మిక జీవనమున కత్యా వశ్యకము. కరుణ రసము చిత్తము నందు స్థిరత్వము నొందుటకు, సర్వ జీవులయందు అద్వేషమును, మైత్రిని పొందవలసి యున్నది.

"అద్వేష్టా సర్వ భూతానాం మైత్రః కరుణ ఏవచ
నిర్మమో నిరహంకారః సమదుఃఖ సుఖః క్షమీ" (భగవద్గీత)

ఇది పరిపూర్ణ కరుణ రసముచే ప్రశాంత చిత్తులగు మహితాత్ములయొక్క లక్షణము. కావున దయా గుణముతో ప్రవర్తించుట మానవత్వము. కారుణ్యమునకు సమమగు ధర్మము ధరణిలో కానరాదనుట నిర్వివాదము.

"క్షమాతీర్థం తపస్తీర్థం తీర్థమింద్రియ నిగ్రహః
సర్వ భూతదయా తీర్థం ధ్యాన తీర్థమనుత్తమమ్"

ఇందు సర్వ జీవులయందు దయ గల్గియుండటయే తీర్థమనినుడువ బడినది. ఈ శ్లోకమునందు జెప్పబడిన సద్గుణములు మానవునకు లేనిచో తీర్థమునందు మునిగినను తరించుట సంభవము కానేరదు.

మానవునకు దయాగుణమలవడినచో తదితర సద్గుణములు సహజముగనే సంభవమగును. రామాయణము నందలి యీ శ్లోకమును గమనింపుడు

"ఆనృశంస్య మను క్రోశో శ్రుతంశీలం దమశ్శమః
రాఘవం శోభయంత్యేతేషడ్గుణాః పురుషోత్తమమ్"

పురుషోత్తముడగు శ్రీరామచంద్రుని గుణములలో ప్రధానమైన గుణములారు. అవి

1. క్రూర స్వభావము లేకుండుట. 2. దయ, 3. శాస్త్రము, 4. మంచినడత, 5. ఇంద్రియ నిగ్రహము, 6. కామక్రోధాదులు లేక యడగియుండుట, అనునవి. క్రూరస్వభావము లేశమైనను లేనిచో దయాగుణము స్థిరత్వమునొందును. కావుననే రాముని గుణములలో తొలుత" ఆన్యంశ్యము" అని నుడువబడినది.

అన్యశంస్యమును సంపూర్ణముగా త్యజించిన మహితాత్ముడు గావుననే వాల్మీకి మహర్షియై, మహ నీయుడై ఆదికవియై విరాజిల్లెను. మరియు భారతీయులకు పరమ పవిత్రమై భాసిల్లు శ్రీమద్రామాయణమును రచించి ధన్యతనొందిన మహో మనీషి వాల్మీకి మహర్షి.

శ్రీమద్రామాయణము యొక్క రచన కరుణరసముతో ప్రవర్తిల్లినదను విషయము విజ్ఞులకు సంవిదితము. కావుననే రామాయణ మహో కావ్యమును గూర్చి బ్రహ్మ యీ రీతిగా నుడివియున్నాడు.

"యావత్ స్థాస్యంతిగిరయః సరితశ్చ మహీతలే
తావద్రామాయణ కథా లోకేషు ప్రచరిష్యతి"

ఎంత దనుక పర్వతములు, నదులు ధరిత్రిపై నుండునో ! అంత వఱకు రామాయణ చరిత్రలోకము నందుండునట. చూచితిరా రామాయణము యొక్క

ప్రాశస్త్యము.

భాగవతమునందు దయనుగూర్చి వివరించిన యీ వచనము నవలోకింపుడు.

"సర్వ భూతంబులందును దయా సూహృద్భావంబులు కర్తవ్యములు. దయా సుహృద్భావంబులు గలిగిన నధోక్షజుండు సంతసించు. అనంతుండాద్యుండు హరి సంతసించిన నలభ్యంబెయ్యదియు లేదు."

6 - ఆర్జవము

క॥ విహితములందున మఱియున
విహితంబులనేకరూప విజ్ఞత తోడన్
విహరించుట యార్జవమి
మ్మహిలో మహితాత్మ్ములైన మనుజులకెలమిన్. 8

విహితము మఱియు అవిహితములందు ఏక రూపము గల్గియుండుట ఆర్జవము.

ఆర్జవమనగా! ఋజు భావము (నిష్కపటము) నిష్కాపట్యము వలన హృదయ నైర్మల్యము లభియించును. ఆధ్యాత్మిక తత్వమునకు కపటము ఆటంకము కాగలదు. కపట చిత్తునకు చిత్తశాంతి అలభ్యము. కపట మనస్కులు కావుననే దుర్యోధనాదులు సకుల క్షయమును పొందిరి.

కపటముతో గూడిన దుష్ప్రవర్తనము వలననే అహల్య మరియు దేవేంద్రుడు శాపగ్రస్తు లైరి. రామాయణము నందలి యీ శ్లోకములను గమనింపుడు.

"తస్యాంతరం విదిత్వాతు సహస్రాక్షశ్శచీ పతిః
మునివేషధరో2హల్యామిదం వచనమబ్రవీత్
సంగమం త్వహమిచ్ఛామి త్వయా సహాసు మధ్యమే
మునివేషం సహస్రాక్షం విజ్ఞాయ రఘునందన
మతించకార దుర్మేధా దేవరాజ కుతూహలాత్
అథాబ్రవీన్న రశ్రేష్ఠ కృతార్థేనాంత రాత్మనా
కృతార్థా2స్మి సురశ్రేష్ఠ గచ్ఛ శీఘ్రమితః ప్రభో
ఆత్మానం మాంచ దేవేశ సర్వథా రక్షమానద
ఇంద్రస్తు ప్రహసన్ వాక్య మహల్యామిద మబ్రవీత్

సుశ్రోణి పరితుష్టో2స్మి గమిష్యామి యథాగతమ్"
"అథ దృష్ట్వా సహస్రాక్షం మునివేష ధరం మునిః
దుర్వృత్తం వృత్తసంపన్నో రోషాద్వచన మబ్రవీత్
మమ రూపం సమాస్థాయ కృతవానసి దుర్మతే
అకర్తవ్య మిదం తస్మాద్వి ఫలస్త్వం భవిష్యసి
గౌతమే నైవముక్తస్య సరోషేణ మహాత్మనా
పేతతుర్వృ షణౌభూమౌ సహస్రాక్షస్య తత్షణాత్
తథాశప్త్వా సవై శక్రమహల్యామపి శప్తవాన్
ఇహావర్ష సహస్రాణి బహూని త్వం నివత్స్యసి
వాయు భక్షా నిరాహారా తప్యంతీ భస్మశాయినీ
అదృశ్యా సర్వ భూతానామాశ్రమే2స్మిన్ని వత్స్య సి
యదాచైతద్వనం ఘోరం రామో దశరథాత్మజః
ఆగమిష్యతి దుర్ధర్షస్తదా పూతా భవిష్యసి"

కపట రహిత చిత్తుడు గాన భరతుడు చిరతర కీర్తిని పొందినాడు.

నిష్కపట హృదయుడు గావుననే వసుదేవుడు జన్మించిన పిదప నానక దుందుభులు మొరసినవి. భాగవతమునందలి యీ పద్యము నవలోకింపుడు.

"ఘనయ శాలియైన వసుదేవుడు పుట్టిన వెంట మింటిపై నానక దుందుభుల్ మొరసె
నచ్యుతుడీ తనికిందనూజుడై మానుగ బుట్టనంచు గరిమంబున దేవతలుబ్బ రాజపం
చానన తన్నిమిత్తమున నానక దుందుభియయ్యె వాడిలన్"

ఆర్జవ యుత జీవనము మానవుల కత్యంత శ్రేయో దాయకమని గ్రహింపుడు.

"యతస్సత్యం యతో ధర్మో యతో హ్రీరార్జవం యతః
తతో భవతి గోవిందో యతః కృష్ణస్తతో జయః

7. క్షమ

తే. ప్రియమునందున మఱియు నప్రియమునందు
నర్ఘణాదుల దాడనాద్యవసరమున
సహన భావంబు నొందుట క్షమయనంగ
బరగు సహనంబునన్ సదా భవ్యమబ్బు. 9

ప్రియమునందు, అప్రియమునందు పూజనమునందు, తాడనమునందు సహన భావము నొందియుండుటయే క్షమ.

క్షమ యనగా ! సహనము. సర్వకాల సర్వావస్థలయందు సహనము నొందియుండ వలయును. అసహన శీలురకు విసుగు జనించును. విసుగు వలన కార్య సాఫల్యము కలుగనేరదు. ఆధ్యాత్మికాభివృద్ధి కొరకు సహనమత్యవసరము. సాధారణముగా జ్ఞాన సమపార్జనమునకు కొన్ని విఘ్నము లేర్పడుచుండును. అట్టి విఘ్నములను సహన భావముతో నిర్మూల మొనర్చ వలసియున్నది. ఇష్టమైనను. అయిష్టమైనను, గౌరవము లభించినను, అగౌరవమొనగూరినను సమ భావముతో సంచరించుటయే క్షమ. క్షమ భావముచే మానవుడు ద్వంద్వముల నతి క్రమించును. కావుననే భగవద్గీతయందు.

"సమశ్శత్రౌచ మిత్రేచ తథామానావ మానయోః
శీతోష్ణ సుఖ దుఃఖేషు సమస్సంగ వివర్జితః"
"తుల్య నిందా స్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్
అని కేతస్థిరమతిః భక్తి మాన్మే ప్రియోనరః
అని నుడువ బడినది.

శ్రీరాముడు క్షమచేత ధరిత్రితో సమానుడని "క్షమయా పృథివీ సమః" అని రామాయణములో బాలకాండయందు వివరింప బడియున్నది. మరియు బాలకాండయందే కుశనాభుడు తన పుత్రికలకు క్షమను గూర్చి బోధించిన శ్లోకమును గమనింపుడు.

"అలంకారోహినారీణాం క్షమాతు పురుషస్య వా॥
"క్షమా దానం క్షమాయజ్ఞః క్షమా సత్యంహి పుత్రికాః
క్షమాయశః క్షమా ధర్మఃక్షమయా విష్ఠితం జగత్"

స్త్రీలకు పురుషులకు క్షమ అలంకారమని నుడువ బడినది. ఈ శ్లోకమునందు క్షమను గూర్చి వివరించిన భావమతి ప్రశస్తము.

8. ధృతి

ఆ॥ అర్థహానియైన నత్యర్థమైనను
స్వేష్టబంధువాప్తినష్టమైన
సర్వకాలయుక్త సమహిత మతి నిశ్చ
లిత సుచేష్టితంబు ధృతి తలంప

ధన నష్టమైనను, ధనప్రాప్తమైనను, ఇష్టజన ప్రాప్తియైనను, ఇష్టజన నష్టమైనను సర్వకాలములయందు మనస్సు నిశ్చలము నొంది యుండుట ధృతి.

ధృతి యనగా! ధైర్యము. ధైర్యము వలన మనస్సు నిశ్చలముగా నుండును. అధైర్యము వలన మానవులకు హృదయ దౌర్భల్యమేర్పడును. కావుననే క్షుద్రం హృదయ దౌర్భల్యం. అని భగవద్గీతయందు వివరింపబడినది. మఱియు "సంతుష్ట స్సతతం యోగీ యతాత్మా దృఢ నిశ్చయః మయ్యర్పిత మనోబుద్ధిః యో మద్భక్తస్సమేప్రియః

"సమశ్శత్రౌచ మిత్రేచ తధా మానావమానయోః
శీతోష్ణ సుఖఃదుఖేషు సమస్సంగవివర్జితః"

ఏ మనుజుడు ధ్యానయోగమునందుండి, నిరంతరము లాభనష్టములందు సంతుష్టుడై, మనస్సును మఱియు నింద్రియ సహితముగా శరీరమును వశమునందిడుకొని, దృఢనిశ్చయము గల్గి, నాయందర్పింపబడిన మనోబుద్ధులు కల్గియుండునో ఆ మనుజుడు నా యొక్క భక్తుడు నాకు ప్రియుడు.

శత్రువులయందు, మిత్రులయందు, మఱియు మానావ మానములందు, శీతోష్ణములందు, సుఖదుఃఖములందు సమానత్వమునొంది, సర్వ సంసారాసక్తి విరహితుడై యుండునో అట్టి నా యొక్క భక్తుడు నాకు ప్రియుడు.

అని కృష్ణ పరమాత్మ అర్జునుని గూర్చి వివరించి యున్నాడు. ఇందలి సారాంశము ఏమన! మానవుడు నిరంతరము ధృతి గల్గియుండవలెనని భావము.

ఈ విషయము గూర్చి అష్టాంగ హృదయమునందీ విధముగా వివరింపబడియున్నది. 'సంపద్విపత్స్వేక మనా' సంపదలయందు ఆపదలయందు స్థిరమగు మనస్సుతో నుండవలెనని అర్థము.

"ధృతి ర్దృష్టిర్మతి ర్దాక్ష్యం స్వకర్మసు నసీదతి"

ధీరత్వము, సూక్ష్మ దృష్టి ఆలోచనాశక్తి సామర్థ్యము కల్గినచో స్వకర్మలయందు వైఫల్యమునొందరు.

మానవుల యొక్క జీవిత ధ్యేయము ధైర్యము గల్గియుండుట అని తెలిసికొన వలసి యున్నది.

9. మితాహారము

ఆ॥ మధురరసము స్నేహ మౌ సాత్వికాన్నంబు
మితముతోడ గొనుట హితము తలప
ఆత్మ విద్య కొఱకు నత్యంత ముఖ్యమౌ
సుఖ వివర్ధనంబు సూనృతముగ. 11

మధు రసము, స్నేహ యుక్తమునైన సాత్వికాహారమును భుజించుట మితాహారము.

ఆహారము మూడు విధములు. సాత్వికాహారము, రాజసికాహారము, తామసికా హారము అని. సాత్వికాహారమును గూర్చి భగవద్గీత యందు యీ రీతిగా పేర్కొనబడినది.

"ఆయుస్సత్వ స్థిరా హృద్యాః ఆహారస్సాత్విక ప్రియాః"
రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యాః ఆహారాస్సా త్విక ప్రియాః"

రసవంతములు, సిగ్ధయుక్తములు, స్థిరము, హితకరమునైన యాహారము సాత్వికులకు ప్రియము.

రాజసిక తామసికాహారము సాత్వికులకు నిషిద్ధము. ఆహారనియమము ననుసరించనిచో ఆధ్యాత్మిక విద్య అలవడుట అసంభవము.

పరిమితమగు సాత్వికాహారముచే నారోగ్య సంరక్షణ సిద్ధించును. ఆధ్యాత్మిక జ్ఞానార్జనము కొఱకు ఆరోగ్యము అత్యంతమావశ్యకము. శరీరము రోగగ్రస్తమగుచో నాధ్యాత్మిక పరమగు సాధనమునకు విఘ్నమేర్పడును. ఈ విషయమును చరకసంహిత యందు యీ విధముగా వివరింపబడినది.

"విఘ్న భూతాయదా రోగాః ప్రాదుర్భూతాశ్శరీరిణామ్
తపోప వాసాధ్యయన బ్రహ్మచర్య వ్రతాయుషామ్"

శరీరము అనగా ! తనంతనే కొలది కాలమునకు శిధిలమగు స్వభావము కలది. అట్టి శరీర ధారులగు మానవులకు తపస్సు ఉపవాసముల నాచరించుటకును. వేదశాస్త్రాది పఠనమున కున్ను బ్రహ్మ చర్యము నొనరించుట కొఱకును, వ్రతాది నియమముల నాచరించుటకును రోగములు విఘ్న భూతములగుచున్నది.

"ధర్మార్థ కామమోక్షాణామారోగ్యం మూలముత్తమం
రోగా స్తస్యాప హర్తారః శ్రేయసో జీవితస్య చ
ప్రాదుర్భూతో మనుష్యాణామంతరాయో మహానయమ్"

ధర్మార్థ కామమోక్షములకు ఆరోగ్యము ముఖ్యము అట్టి ఆరోగ్యమును రోగములు అపహరించు చున్నవి. మఱియు ధర్మాది శ్రేయస్సును, జీవితమును గూడ హరించునవి రోగములు. అట్టి వ్యాధి వ్యాప్తి వలన మానవులకు పురుషార్థ సంపాదనమునకు అంతరాయ మేర్పడును.

"యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు

యుక్త స్వప్నాన బోధ స్యయోగోభవతి దుఃఖ హా"

"యుక్తమగు ఆహారము, యుక్తమగు విహారము, కర్మల యందు యుక్తమగు ప్రవర్తనము, యుక్తమగు నిద్ర, యుక్తమగు జాగరణము అను యీ గుణములు గల మానవునకు యోగము. దుఃఖ నివారణ మొనర్చు చున్నది. అనగా జనన మరణ సంసార దుఃఖ రహితమొనర్చు చున్నది.

యోగము నభ్యసించుటకు యుక్తా హారము తొలుత నుడవబడినది. కనుక హిత మిత సాత్వికాహారము జ్ఞాన సాధనమునక త్యావశ్యక మని గ్రహింప దగియున్నది.

ఆహారము మధుర రస ప్రధానముగా నుండ వలయును. ఆహారము నందు ఆరు రసములు కలవు.

1. మధురము (తీపి) 2. అమ్లము (పులుపు) 3. లవణము (ఉప్పు) 4. కటువు (కారము) 5.తిక్తము (చేదు) 6. కషాయము (వగరు)

"మధురోమ్లః పటుశ్చైవ కటు తిక్త కషాయకాః"

రసములయందు మధుర రసము తొలుత పేర్కొనబడినది. మధుర రసము యొక్క గుణము యీ విధముగా వివరింపబడుచున్నది.

"రసానామితి రూపాణి కర్మాణి మధురో రసః

ఆజన్మ సాత్మ్యాత్ కురుతే ధాతూనాం ప్రబలం బలం

బాల వృద్ధక్షత క్షీణ వర్ణకేశేంద్రియౌజసాం

ప్రశస్తో బృంహణః కంఠ్యః స్తన్య సంధాన కృత్ గురుః

ఆయుష్యో జీవనః స్నిగ్ధః పిత్తానిల విషాపహః

కురుతే2త్యుపయోగేన సమేదః శ్లేష్మజాన్ గదాన్

స్థౌల్యాగ్ని సాద సంన్యాస మేహ గండార్బు దాదికాన్"

మధుర రస పదార్థములు జన్మించి నప్పటి నుండి అలవాటు పడినదగుట వలన ధాతువులకు మిక్కిలి బలము నొనగూర్చును. బాలురకు, వృద్ధులకు, దెబ్బలు తగిలినందువలన క్షీణించిన వారలకు, హితమైనది. దేహ కేశవృద్ధికి, ఇంద్రియముల యొక్క శక్తి వృద్ధి నొందుటకు, ఓజస్సు పెరుగుటకు మిక్కిలి ఉపయుక్తము. ఓజస్సు

అనగా జీవుల యొక్క శరీరాంతరతమగు శక్తి. ఓజస్సు క్షీణించినచో శక్తి హీనత సంభవించును. "ఓజస్సర్వ శరీరగః కావున ఓజస్సును సంరక్షించు కొనవలసి యున్నది.

మధుర రసము దేహపుష్టినొసంగును. కంఠస్వరము వృద్ధినొందించును. గురు గుణ సంయుతము. ఆయుష్యము. ప్రాణరక్షకము. స్నిగ్ధగుణ సంయుతము. పిత్తవాత విషహారము.

మధుర రసమునమితముగా నుపయోగించినచో మేదస్సుతో కూడిన శ్లేష్మ రోగములు సంభవించును. శరీరము స్థూలత్వము నొందును. అగ్ని బలము నశించును సన్యాసరోగము, మేహవ్యాధులు, గలగండ రోగము, అర్బుదము (మహావ్రణము), మొదలగు వ్యాధులు సంభవించును. మధుమేహ వ్యాధి గల వారలకు మధుర రసయుత పదార్థములు సర్వదా నిషిద్ధము.

ఆహార దోషముచే చిత్తము కలుషిత మగుననియు, కలుషిత సంయుత చిత్తులకు ధర్మము భాసించదనియు యీ శ్లోకము వలన వ్యక్తమగు చున్నది.

"అన్నదోషేణ చిత్తస్య కాలుష్యం సర్వదా భవేత్
కలుషీ కృత చిత్తానాం ధర్మం సమ్యక్ నభాసతే"
"షట్త్రింశతం సహస్రాణి రాత్రీణాం హితభోజనః
జీవత్యనాతురో జంతుః జితాత్మా సమ్మతస్సతాం"
(చరక సంహిత)

జితేంద్రియుడై విధ్యుక్త ప్రకారము హిత భోజన మొనర్చు మనుజుడు జన్మాంతరము వరకును రోగరహితుడై సజ్జన పూజితుడై ముప్పది యారు వేల యహోరాత్రములు (నూరు సంవత్సరములు) సుఖ జీవన మొనరించును.

"నాత్య శ్నతస్తుయోగోఽస్తినచైకాంత మనశ్నతః
నచాతి స్వప్న శీలస్య జాగ్రతో నైవచార్జున"

అమితమైన ఆహారమును భుజించు వానికి యోగ సాధనము అసాధ్యము. అతి అల్పమైన ఆహారమును భుజించు వానికి కూడ యీ యోగము సాధ్యము కానేరదు. అరీతిగనే అతి నిద్రాలోలునకు, అతి జాగరణ మొనరించు వానికి యీ యోగము దుర్లభము.

కావున మితాహారము యోగసాధనమునకు అవసరమని గ్రహింపుడు.

10 - శౌచము

క. ద్వి విధంబై బరగున్ శౌ
చ విధుల్ బాహ్యంబు మఱియు జగమునవాంత
ర్యవిధానంబుల గావున
నవిరతముగ శౌచ కర్మలను సరణంబుల్ 12

తే. బాహ్య శౌచంబు ప్రాప్తమౌ వారి వలన
నాంతరంగిక శౌచమాధ్యాత్మికమున
గల్గు నిత్యంబు నరులు నిష్కలుషమైన
శౌచ కర్మల నొనరుప సౌఖ్యమౌను. 13

శౌచము రెండు విధములు. బాహ్యము, అంతరము అని. శరీరమును జలాదులతో శుద్ధినొనర్చుట బాహ్యము. అధ్యాత్మిక విద్యవలన సంప్రాప్తమగు మనో నైర్మల్యము అంతరము.

శౌచము అనగా శుచిత్వము. శారీరిక శుచిత్వము, మానసిక శుచిత్వము అని." శరీర మాద్యంఖలు ధర్మసాధమ్" ధర్మాచరణమునకు శరీరము ముఖ్యము గాన, శారీరికమగు ఆరోగ్యము కొఱకు శరీరమును పరిశుభ్రతచే సంరక్షించు కొనవలసి యున్నది. అనగా ! నిర్మల జల స్నానము, మలిన రహిత వస్త్రధారణము, శుచి ప్రదేశనివాసము మున్నగునవి. ఇది బాహ్య శౌచము.

మనస్సును రాగద్వేష రహిత మొనర్చి, యమమునందు జెప్పబడిన అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మ చర్యము, దయ, ఆర్జవము, క్షమ, ధృతి, మితాహారముల ననుష్ఠించుట మానసిక శౌచము. భగవద్గీత యందలి యీ శ్లోకమలను పరికింపుడు.

"శుచాదేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసన మాత్మనః
నాత్యుచ్ఛ్రితం నాతినీచం చేలాజిన కుశోత్తమమ్"
"తత్రై కాగ్రం మనః కృత్వాయత చిత్తేంద్రియ క్రియః
ఉప విశ్యాసనే యుంజ్యాత్ యోగమాత్మ విశుద్ధయే"

అంతః కరణ శుద్ధి కొఱకు ధ్యానయోగాభ్యాస మొనర్చవలెననియు, అందులకు స్థిరమగు ఆసన మావశ్యక మనియు నాయాసనమును కుశాజిన చేలములతో

గల్పించు కొనవలెననియు, మిక్కలి ఎత్తును, మిక్కిలి పల్లమును గాక సమస్థలమును, శుచియున్నైన ప్రదేశమవసరమని యీ శ్లోకముల యొక్క భావము.

ఇందు అంతః శౌచము మరియు బాహ్య శౌచము వివరింపబడినది. కావున ధ్యాన యోగా భ్యాసము నొనరించుటకు శౌచమత్యంతా వశ్యక మని విదితమగు చున్నది.

అష్టాంగ హృదయమను ఆయుర్వేద గ్రంధమునందు స్వస్థ వృత్తము సద్వృత్తములయందు బాహ్య శౌచము అంతః శౌచముల గూర్చి విపులముగా వివరింపబడినది.

"బ్రాహ్మేము హూర్తే ఉత్తిష్ఠేత్ స్వస్థో రక్షార్థమాయుషః
శరీర చింతాం నిర్వర్త్య కృత శౌచ విధిస్తతః"
"అర్కన్య గ్రోధఖదిర కరంజ కకుభాదిజం
ప్రాతర్భు క్త్వాచ మృద్వగ్రం కషాయ కటు తిక్తకమ్"
కనీన్యగ్ర సమస్థూలం ప్రగుణం ద్వాదశాంగులం
భక్షయేద్దంత పవనం దంత మాంసాన్య బాధయన్"
"స్నానమూర్జాబల ప్రదం
కండూమల శ్రమస్వేద తంద్రాతృడ్దాహ పాప్మజిత్"
ఉష్ణాంబునా2ధః కాయస్య పరిషే కో బలావహః
తేనైనతూత్తమాంగస్య బలహృత్కేశ చక్షుషామ్"
ఇవ్విధమైనవి బాహ్య శౌచములు.ఇక అంతః శౌచముల గూర్చి పరిశీలింపుడు.
"సుఖార్థాః సర్వ భూతానాం మతాః సర్వాః ప్రవృత్తయః
సుఖంచ నవినా ధర్మాత్ తస్మాత్ధర్మపరో భవేత్"
"భక్త్యా కల్యాణ మిత్రాణి సేవేతే తరదూరగః
హింసాస్తే యాన్యధాకామం పైశున్యం పరుషానృతే":
"పాపం కర్మేతి దశధా కాయవాక్ మానసై స్త్యజేత్"
"ఆత్మవత్స తతం పశ్యేదపి కీట పిపీలికమ్"
"అర్చయేత్ దేవ గోవిప్రవృద్ధ వైద్య నృపాతి థీన్
విముఖాన్నార్థినః కుర్యాన్నావ మన్యేత నాక్షిపేత్"
"ఉపకార ప్రధాన స్స్యాదపకార పరే2ప్యరౌ
సంపద్వి పత్స్వేకమనా హేతావీర్ష్యే త్ఫలేనతు"
"కాలేహితం మితం బ్రూయాదవి సంవాది పేశలమ్

పూర్వాభిభాషీ సుముఖః సుశీలః కరుణా మృదుః
"నకశ్చి దాత్మన శ్శత్రుం నాత్మానం క స్యచిత్‌రిపుమ్"
ఆర్ద్ర సంతానతా త్యాగః కాయవాక్ చేతసాం దమః
స్వార్థ బుద్ధిః పరార్థేషు పర్యాప్తమితి సద్వ్రతమ్"

ఇవి అంతః శౌచములు. ఆయుర్వేదము ఆధ్యాత్మిక పరము గాన మానవ జీవితమునకు అత్యా వశ్యకమగు బాహ్య శౌచము, అంతః శౌచమునకు సంబంధమగు విధులు యీ శాస్త్రమునందు వివరింపబడి యున్నవి అను విషయము విజ్ఞులకు సువిదితము.

1. తపము

ధృవకోకిలా వృత్తము.

వినయ మొప్ప సతంబు శ్రీహరి విశ్రుత వ్రత పుణ్య కా
ర్యనిరతిం దపియించుటారయ రాజిలున్ తపమౌచు పా
వన మొనర్చును యజ్ఞ దానము భవ్యమౌ వ్రత కర్మలున్
మనుజు లెన్నడు సువ్రతంబుల మానరాదు జగంబునన్. 15

"విధినోక్తేన మార్గేణ కృచ్ఛ్రచాంద్రాయణాదిభిః
శరీర శోషణం ప్రాహుః తాపసాస్తప ఉత్తమమ్"

విధ్యుక్తము లైన వ్రతములచే (కృచ్ఛ్ర చాంద్రాయణాది వ్రతములచే) తపించుట తపస్సు.

"యజ్ఞ దాన తపః కర్మ నత్యాజ్యంకార్యమేవ తత్
యజ్ఞోదానం తపశ్చైవ పావనాని మనీషిణామ్"

యజ్ఞదాన తపః కర్మలను త్యజియించరాదు. యజ్ఞము, దానము, తపము అనునవి మానవులను పావన మొనర్చును. కావున అవశ్య మాచరణీయము.

కృచ్ఛ్ర మనగా ! మూడు దినములుపగళ్లును, మూడు దినములు రాత్రులును ఆహారమును భుజించి, మూడు దినములు అయాచిత పదార్థములను భుజించి, తదుపరి మూడు దినములు ఉపవాసముండెడు వ్రతము.

చాంద్రాయణమనగా! భుజింప దగిన ముప్పది రెండు కబళములలో చంద్రుని యొక్క క్షయ వృద్ధుల ననుసరించి, క్రమమున కృష్ణ పక్షమునందు ఒక్కొక్క కబళముగా తగ్గించుచూ, శుక్ల పక్షమునందు ఒక్కొక్క కబళముగా హెచ్చించుచు భుజించి ఆచరించెడు వ్రతము.

దైవ పరమగు ఉపవాసాది వ్రతముల నత్యంత శ్రద్ధతో నాచరించుటయు తపమనబడును.

తపము యొక్క నిర్వచన మీవిధముగా గలదు. శ్రద్ధతో సద్గ్రంధ పఠన మొనర్చుట తపస్సు. భక్తితో భగవద్ధ్యాన మొనర్చుట తపస్సు. నియమముతో జపమాచరించుట తపస్సు నిష్ఠతో బ్రహ్మ చర్యమునాచరించుట తపస్సు. ధర్మ పథమున జీవన మొనర్చుట తపస్సు. సద్బుద్ధితో సత్కార్యము లొనర్చుటయు తపస్సే. తపస్సున కత్యంత ప్రాముఖ్యత కలదు గాన నియమమునందు తొలుత తపస్సు పేర్కొనబడినది.

"తపసా కిల్బిషం హంతి" తపస్సు చేత పాపము హరింపబడుచున్నది. తపస్స్వాధ్యాయ నిరతులు గాన మహర్షులు కిల్బిషరహితులు. తపస్సు శారీరిక వాచిక మానసికములని మూడు విధములు.

"దేవ ద్విజ గురు ప్రాజ్ఞ పూజనం శౌచమార్జవం
బ్రహ్మ చర్య మహింసాచ శారీరం తప ఉచ్యతే":
"అనుద్వేగ కరం వాక్యం సత్యం ప్రియ హితంచయత్
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే"
"మనః ప్రసాద స్సౌమ్యత్వం మౌనమాత్మ వినిగ్రహః
భావ సంశుద్ధిరిత్యేత త్తపో మానస ముచ్యతే"

(భగవద్గీత)

దేవతలను, ద్విజులను, గురువులను, జ్ఞానులను పూజించుట, శౌచము గల్గియుండుట, ఋజుత్వము గల్గియుండుట, బ్రహ్మచర్యము నాచరించుట, అహింసా మార్గమున జీవించుట అనునవి శరీర సంబంధమగు తపస్సు అని పేర్కొనబడు చున్నది.

పరుల మనస్సును వ్యధనొందింపనిదియును, సత్యమైనదియును, ప్రియమైనదియునైన వాక్యమును పల్కుట, వేదా ధ్యయన మొనరించుట అనునవి వాచిక తపస్సు అని నుడు వబడుచున్నది.

మనోనైర్మల్యము, ప్రసన్నత్వము, మౌనము, ఆత్మ నిగ్రహము, సద్భావము అనునవి మానసిక తపస్సు అని వివరింపబడుచున్నది.

శారీరిక వాచిక మానసిక తపస్సులను పేర్కొని మఱియు సాత్విక రాజసిక తామసిక తపస్సుల గూర్చి యీ విధముగా వివరింపబడు చున్నది.

"శ్రద్ధయా పరయాతప్తం తపస్త త్రివిధం నరైః
అఫలా కాంక్షిభిర్యు క్తైస్సాత్త్వికం పరిచక్షతే"
"సత్కార మాన పూజార్థం తపో దంభేన చైవయత్
క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చలమధ్రువమ్"
"మూఢ గ్రాహేణాత్మనో యత్పీడయా క్రియతే తపః
పరస్యో త్సాదనార్థం వా తత్తామసము దాహృతమ్" (భగవద్గీత)

ఫలాపేక్ష రహితులును, నిర్మల మనస్కులు నైన మనుజులచే నతిశ్రద్ధతో నాచరింప బడినదైన మూడు విధములైన (శారీరిక వాచిక మానసిక) తపస్సు సాత్వికమైనదని నుడువబడుచున్నది.

పరులచే తాను సత్కరింపబడవలెననిడంబముతో మాత్రమే యొనరింపబడు తపస్సు చలనమై, అనిశ్చితమైన ఫలము గలదై రాజసతపస్సు అని పలుకబడుచున్నది.

మూర్ఖత్వముతో గూడిన పట్టుదలతో స్వశరీరమును వ్యధ నొందించు కొనుటచే గాని, లేక పరనాశనార్థమై గాని యొనరింపబడు తపస్సు తామసిక తపస్సు అని వివరింపబడుచున్నది.

తపస్స్వా ధ్యాయేశ్వర ప్రణి ధానాని క్రియా యోగః"

(పాతంజల యోగ దర్శనము)

తపము, స్వాధ్యాయము, ఈశ్వరప్రణిధానము అను యీ మూడు క్రియలు యోగమునకు సాధనములు. కనుకనిది క్రియా యోగము.

తపమనగా హిత మిత మేధ్య భోజన పూర్వకముగా శీతోష్ణాది ద్వంద్వ సహనముతో నింద్రియములను నిరోధించుట మరియు యుక్తాహార విహారములుకూడ తపమే.

- హిత భోజనమనగా ! సాత్వికా హారము.
- మిత భోజనమనగా ! పరిమితాహారము
- మేధ్య భోజనమనగా ! శాస్త్రము నందు నిర్దేశింపబడిన నిషిద్ధాహార విసర్జనము.
- స్వాధ్యాయ మనగా ! ప్రణవము ఆదిగా గల పవిత్ర మంత్రములను పఠించుట లేక ధర్మ శాస్త్ర పఠనము.
- ఈశ్వర ప్రణిధానమనగా ! నిష్కామ కర్మల నాచరించుట.

యోగము నభ్యసింపనాకాంక్షించు సాధకునకు క్రియా యోగ మత్యావశ్యక మని వివరింపబడు చున్నది. తపమతి పవిత్రము గాన క్రియా యోగము నందు

తొలుత తపము పేర్కొన బడినది.

"తపసా ప్రాప్యతే సత్త్వం సత్త్వా త్సం ప్రాప్యతే మనః
మనసా ప్రాప్యతే హ్యాత్మా ఆత్మనానవిర్తతే"

తపస్సు చేత సత్త్వగుణము సంప్రాప్తమగును. సత్త్వ గుణముచే మనస్సు స్వాధీన మగును. అట్టి మనస్సుచే ఆత్మ జ్ఞానము ప్రాప్తించును. ఆత్మ జ్ఞానముచే పునరావృత్తి రహిత మోక్షము సిద్ధించును.

"జన్మౌషధి మంత్ర తపస్సమాధి జాస్సిద్ధయః" (పాతం జలయోగ సూత్రములు)

"న తపస్తప ఇత్యాహు ర్బ్రహ్మ చర్యం తపోత్తమమ్
ఊర్ధ్వరేతా భవేద్యస్తు సదేవో నతు మానుషః"

ప్రాజ్ఞులు తపస్సును తపస్సు అని పలుకరు. బ్రహ్మచర్యమును ఉత్తమమగు తపస్సు అని పల్కుదురు. ఊర్ధ్వరేతస్సు గల మనుజుడు దైవముగాని మానవుడు గాడు.

తపస్సు అనగా పవిత్రమైన కార్యమును నిర్వహించుట అని భావింపదగియున్నది. మరియు నియమ నిష్ఠలతో నొనరించు సత్క్రియలు కూడా తపస్సే. శ్రీ మద్రామాయణమందు బాలకాండమునందలి యీ శ్లోకము నవలోకింపుడు.

"తపస్స్వా ధ్యాయ నిరతం తపస్వీ వాగ్విదాం వరమ్
నారదం పరి ప ప్రచ్ఛ వాల్మీకిర్ముని పుంగవమ్"

ఇందు ప్రథమముననే నారద వాల్మీకులయొక్క సమాగమము వర్ణింప బడుట గమనార్హము. తపస్స్వాధ్యాయ నిరతుడగు నారదుని, తపస్వియగు వాల్మీకి ప్రశ్నించెను. అనియీ శ్లోకము యొక్క భావము. నారదుడును వాల్మీకి యు యిరువురును తపశ్శాలురే. తపశ్శబ్దమాచే ప్రారంభమైనది కావున రామాయణ రచనా నిర్వహణము, ఒక మహా తపస్సు. కావున రామాయణ మహా కావ్యము పరమ పవిత్రము. మరియు సుస్థిరము.

2. సంతోషము

ఆ. సౌఖ్య మొదవు సర్వ సమయంబులందున
దైవదత్త మైన ధనము వలన
గాన నైష్ఠికముగ మానవుల్ సతము సం
తుష్టి నొంద నడగు దుఃఖ మిలను 16

దైవ వశమున ప్రాప్తమైన ధనముతో సంతుష్టినొందుట సంతోషము.

సంతోషమనగా ! సుఖ దుఃఖాతీతమైనది. సుఖ దుఃఖములు దేశకాల వస్తు సంబంధ మైనది. సుఖ దుఃఖముల నధిగమించినచో మానవులకు సదా సంతోషము సంప్రాప్తమగును.

సంతోషము వలన శారీరిక మానసిక ప్రశాంతత ప్రభవించును. సత్త్వగుణము సంప్రాప్తించును. తదుపరి కామ క్రోధాదులు నిర్మూలమగును. జ్ఞానము స్థిరముగా నుండును.

"సంతుష్టస్స తతంయోగీ యతాత్మా దృఢ నిశ్చయః
మయ్యర్పిత మనో బుద్ధిఃయో మద్భక్తస్సమే ప్రియః"
(భగవద్గీత)

ఏ మనుజుడు నిత్య సంతోషియు, ధ్యానయోగియు, మనో నిగ్రహ సంయుతుడు, సందేహరహితుడు, నాయందు అర్పింపబడిన మనో బుద్ధులు గలవాడు, నా భక్తుడునైన ఆమనుజుడు నాకు ప్రియుడు.

అని కృష్ణ పరమాత్మ పలికి యున్నాడు.

"సంతోషాదనుత్తమః సుఖలాభః" (పాతంజల యోగ దర్శనము)

సంతోషము వలన ముఖ్యమగు సుఖము లభించును.

సంతోషము మూడు విధములు ప్రియము, మోదము, ప్రమోదము అని.

1. ప్రియము - ఇష్టవస్తు సందర్శన సంతోషము.
2. మోదము - ఇష్టవస్తు లాభ సంతోషము.
3. ప్రమోదము - ఇష్టవస్తు అనుభవ సంతోషము.

సంతోషమును గూర్చి ఆంధ్రమహా భాగవతము నందలి యీ పద్యమునవలోకింపుడు.

"సంతుష్టుడీ మూడు జగముల బూజ్యుండు
సంతోషి కెప్పుడు జరుగు సుఖము
సంతోషి గాకుంట సంసారహేతువు
సంతసంబున ముక్తి సతియు దొరకు
పూట పూటకు జగంబున యదృచ్ఛాలాభ
తుష్టిని తేజంబు తోన పెరుగు
పరితోష హీనత బ్రభచెడి పోవును
జలధారననలంబు సమయునట్లు":

3. ఆస్తిక్యము

క॥ ధర్మము లందున మతియున
ధర్మంబుల ధర్మ సంహితానియమ విధిన్
నిర్మల చిత్తము తోడుత
నర్మిలి విశ్వాసియగుట యాస్తిక్యంబౌ 17

వేదప్రోక్తములైన ధర్మా ధర్మముల యందు విశ్వాసము గల్గియుండుట ఆస్తిక్యము.

మానవునకు ఆస్తికత్వమల వడుట గతజన్మ కృత సుకృత విశేషము. వివేకముతో ధర్మా ధర్మములను గ్రహించి పవిత్ర జీవన మొనరించ వలసియున్నది. వేదములందు, ఉపనిషత్తుల యందు, భారత రామాయణాది పురాణముల యందు, ధర్మా ధర్మములు విపులముగా వివరింపబడి యున్నవి. తపస్స్వాధ్యాయ నిరతులగు మహర్షులు స్వార్థరహితులు గాన ఆప్తహితాత్ముల వాక్యములు సర్వదా సత్యములు. మహర్షి ప్రణీతములైన శాస్త్రములు మానవులకు ప్రమాణములు. శాస్త్ర విధిననుసరించక యిచ్ఛ వచ్చినట్లు వర్తించు మనుజుడు ఉన్నతి స్థితి నొంద నేరడను విషయము భగవద్గీతయందలి యీ శ్లోకము వలన విదితమగుచున్నది.

"యశ్శాస్త్ర విధి ముత్సృజ్య వర్తతే కామకారతః
నససిద్ధి మవాప్నోతి నసుఖం నపరాంగతిమ్॥

కావున కార్యా కార్యములను నిర్ణయించు నపుడు శాస్త్రము ప్రమాణమని మరియొక శ్లోకము వలన తెలియబడు చున్నది.

"తస్మాచ్ఛా స్త్రం ప్రమాణం తే కార్యా కార్య వ్యవస్థితౌ
జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం కర్మ కర్తు మిహార్హసి"

మానవుడు శాస్త్ర విధినుల్లంఘించి, స్వేచ్ఛానుసారము కార్యా కార్యాచరణమొనరించుట. వివేకము కానేరదు. శాస్త్ర ప్రమాణమవశ్య మాచరణీయము.

"భక్తి శాస్త్రాణి మననీయాని తదుద్బోధక కర్మాణి కరణీయాణి,

భక్తి గ్రంథములను పఠించ దగియున్నది. అందలి విషయములు ఆచరించదగియున్నవి.

"స్వాధ్యాయా దిష్టదేవతా సంప్రయోగః"
స్వాధ్యాయము వలన ఇష్ట దేవతా
సాక్షాత్కారము ప్రాప్తించును.

"వేదాంత శతరుద్రీయ ప్రణవాది జపం బుధాః
సత్త్వ శుద్ధికరం పుంసాం స్వాధ్యాయం పరిచక్షతే"

వేదాంత గ్రంథములను, శతరుద్రీయమును, ప్రణవాది మంత్రములను జపించుట స్వాధ్యాయ మనబడును. స్వాధ్యాయము వలన సత్త్వ శుద్ధియగును.

4. దానము

క. న్యాయార్జిత ధన ధాన్యా
ద్యాయుత సంపదల శ్రద్ధనర్హుల కెలమిన్
దేయంబొనరించిన యా
దాయంబతి శస్తమైన దానం బిలలోన్

న్యాయ మార్గమున నార్జించిన ధన ధాన్యాది సంపదలను అర్హులగు వారలకు శ్రద్ధతో నొసంగుటయే ప్రశస్తమైన దానము కాగలదు.

దాన క్రియ కడు పవిత్రమైనది. సంకుచితచిత్తముతో గాక, అర్హులగు వారలకు దాన మొనరించ వలయును. అనర్హులకు దానమొసంగుట అనర్థదాయకము.

దానము మూడు విధములు. సాత్త్విక దానము, రాజసదానము, తామసదానము అని.

దాన మొనరించవలయునను నిశ్చయముతో పుణ్య ప్రదేశమందును, పుణ్య కాలమునందును, పాత్రులగు వారలకు ప్రత్యుపకారము నొనరించ సమర్థత లేని వారలకు నొసంగబడుదానము సాత్త్విక దానము.

ప్రత్యుపకారార్థమై గాని, లేక ఫలాపేక్షతో గాని, లేక మనః క్లేశముతో గాని చేయబడు దానము రాజ సదానము.

అపవిత్ర దేశ కాలములందును, అపాత్రుల కొఱకును, సత్కార రహితముగను, మర్యాద విరహితముగను యొనరించు దానము తామసదానము.

అశ్రద్ధతో నాచరించిన హోమముగాని, దానము గాని, తపస్సు గాని, ఇతరములగు కర్మలు గాని ఇహ పరసుఖము నొసంగ జాలవు. అనగా! అట్టి హోమ దాన తపస్సులు ఇహమునందు, పరమునందు నిష్ఫలములు.

5. ఈశ్వర పూజనము

క. ఈశ్వరిని లోకమాతను
విశ్వేశ్వరులైన శంభు విష్ణుల భక్తిన్
విశ్వాసముతో గొల్చుట
ఈశ్వర పూజనమనంగ నిమ్మహి జెలగున్. 19

పార్వతీ పరమేశ్వరులను, లక్ష్మీనారాయణులను భక్తి భావముతో నర్చించుట

ఈశ్వర పూజనము. "రుద్రాణాం శంకరశ్చాస్మి" రుద్రులలో శంకరుడను నేనే అని కృష్ణ పరమాత్మ పలికి యున్నాడు. అనగా శివ కేశువులకు భేదము లేదని అర్థము. కావున శివకేశవులను, పార్వతీ దేవిని, లక్ష్మీదేవిని నిరంతరము భక్తితో నారాధన మొనరింపవలయును.

మనస్సును, వాక్కును, శరీరమును పరమాత్మ యందు స్థిరముగా లగ్నమొనర్చి, నిష్ఠతో నర్చించిన పరమార్థ తత్త్వము మానవులకు సౌలభ్యము. భక్తి విశ్వాసము, ప్రగాఢత నొందిన భగవద్దర్శనము ప్రాప్తించును. పరమాత్మ దర్శన ప్రాప్తి కొఱకు నాల్గు సాధనములు పేర్కొనబడినవి.

1. మనస్సును నిరంతరము మాధవుని యందు లగ్నమొనర్చుట.
2. పరమాత్మయందు భక్తి విశ్వాసములు కల్గియుండుట.
3. అచ్యుతుని అనవరతము ఆరాధించుట.
4. వాసుదేవునకు సదా వందనమాచరించుట.

కావున మానవులు లౌకిక పరదృశ్య విలాసముల నుండియు, మఱియు శబ్ద స్పర్శ రూప రస గంధ విషయములనుండియు మనస్సును మరల్చి, రాగద్వేషాది విరహితులై, భగవత్సాక్షాత్కారము కొఱకు సర్వదా సాధన మొనరింపదగియున్నది.

విష్ణు సహస్రనామములలో శర్వ, శివ, స్థాణు, ఈశ్వర, శంభు మొదలగు శివపర పద ప్రయోగము కలదు. ఈ కారణము వలన శివ కేశవుల యొక్క అభేదము విదితమగు చున్నది. ఈ నామముల యొక్క అర్థమును గమనింపుడు.

శర్వ - ప్రళయ కాలమందు భూతములను హింసించు వాడు.

ఆత్మ కరావళిచేత బ్రహ్మాదుల వేల్పుల నఖిల జంతు గణముల జగముల ఘన నామ రూప భేదములతో మెఱయించి తగనడంచువాడు.

శివ - శుభములనొసంగువాడు వరదుడు సాధు భక్త జనవత్సలు డార్త శరణ్యుడిందిరా వరుడు దయాపయోధి భగవంతుడు

స్థాణు - ప్రళయ కాల మందుండు వాడు లోకంబులు లోకేశులు లోకస్థులు దెగిన తుదినలో కంబగు పెంజీకటి కవ్వలనే కాకృతి వెలుగు వాడు

ఈశ్వర - ఐశ్వర్య యుక్తుడు .

అష్టైశ్వర్యములతో శోభించు వాడు. అష్టైశ్వర్యములనగా !

"అణిమామహిమా చైవ గరిమా లఘిమా తదా ప్రాప్తిః ప్రాకామ్య మీశిత్వం వశిత్వం చాష్ట సిద్ధయః, అనునవి.

6. సిద్ధాంత శ్రవణము

కII శాంతి స్థిరమతితో వే
దాంతార్థ విచారణంబు దగసల్పుట సి
ద్ధాంత శ్రవణము గాన ని
తాంత శ్రేయంబు నొందదగున ద్దానన్. 20

వేదాంతార్థ విచారణమొనరించుట సిద్ధాంత శ్రవణమనబడు చున్నది.

మానవుడు అనవరతము స్థిర చిత్తముతో నాధ్యాత్మిక తత్త్వము నవగత మొనరించు కొనుటకు ప్రయత్నింప వలసి యున్నది. ప్రాపంచిక విషయములంగూర్చి పరితపించుట ప్రయోజన రహితము, నిర్వికారము, నిత్యము, సత్యము నైన పరబ్రహ్మతత్త్వమును గూర్చి పరిశీలన మొనర్చినచో పరమపదము ప్రాప్తమగును.

ప్రహ్లాదుడు జననీ గర్భస్థుడై యుండి, నారదుని వలన భగవత్తత్త్వమును గ్రహించెను. కావుననే పరమ భక్తాగ్ర గణ్యుడై, భగవత్కరుణా కటాక్ష వీక్షణములకు పాత్రుడై, భగవత్సాక్షాత్కారము నొందినాడు. మరియు. నసురబాలురకు భగవత్తత్త్వనే యుపదేశమొనర్చినాడు.

పరీక్షిత్తు శుక మహర్షి వలననేడు దినములలో భాగవత శ్రవణ మొనర్చి, ధన్యుడై జనన మరణ రహిత నిర్వాణమునొందినాడు.

వాల్మీకి నారదుని వలన రామచరితమును విని, రామాయణ మహా కావ్యమును రచించి, మహాకవియై విరజిల్లెను.

బంధు వ్యామోహ పీడితుడై, కర్తవ్య విముఖుడైన అర్జునుడు కృష్ణ పరమాత్మ వలన ఆధ్యాత్మిక తత్త్వమును శ్రవణమొనర్చి, ఆత్మజ్ఞానియై అతిశయిల్లెను.

"హరి దాసుల మిత్రత్వము
మురరిపు కథలెన్ను కొనుచు మోదము తోడన్
హరుషాశ్రు పులకింతుండయి
పురుషుడు హరిమాయ గెలుచు, భూపవరేణ్యా"

7. హ్రీ

తే. వేద లౌకిక సత్పథా విహిత మైన
కుత్సితములైన కర్మముల్ క్రూరమనుచు
వ్రీడనొందుట ధరణిని హ్రీయనంగ
బరగు సంప్రాప్తమౌవ్రీడ వలన శాంతి . 21

వేద లౌకిక ధర్మ మార్గములందు నిర్ణయింపబడని, అధమములైన కర్మముల నొనర్చుట యందు సిగ్గు గల్గియుండుట హ్రీయన బడుచున్నది. హ్రీ వలన మానవులకు కామ క్రోధాది రాహిత్యము సంప్రాప్తమగును.

"అహింసా సత్యమక్రోధాది రాహిత్యము సంప్రాప్తమగును.
దయాభూతే ష్వలోలత్వ మార్దవం హ్రీరచాపలమ్."

మనోవాక్ కాయములచేనే ప్రకారముగా నైనను, ఏ ప్రాణికైనను కష్టము నొనరించకుండుటయును, యదార్థము మరియు ప్రియముగా పలుకుటయును, తనకు అపకారమొనర్చిన వారల యందు కూడ క్రోధము లేకుండుటయును, అభిమాన రాహిత్యము నొందియుండుటయును, కామ క్రోధాది విరహిత భావము నొందియుండుటయును, పరదోష విముఖత్వము కల్గి యుండుటయును, భూతదయ కలిగియుండుటయును విషయాసక్తి లేకుండుటయును, కోమలత్వమునొంది యుండుటయును శాస్త్రము చేత నిర్దేశింపబడని కర్మములను (విరుద్ధ కర్మములను యొనరించుకుండుటయును అనగా లజ్జ కల్గియుండుట యును. వ్యర్థచేష్టలనొనరించ కుండటయును అనుయీ సద్గుణములు దైవీ సంపదయందు జన్మించిన వారలకు సహజముగనే యుండును.

భగవద్గీత షోడశో2ధ్యాయమునందు ప్రథమ ద్వితీయ తృతీయ శ్లోకములలో నీవివరణము విపులముగా వివరింపబడియున్నది. గమనింపుడు.

ఈ మూడు శ్లోకములయందు వివరింపబడిన సద్గుణములు దైవీ సంపద యందు జన్మించిన పురుషుల యొక్క సహజ లక్షణములు. సంపదలు రెండు. 1. దైవీ సంపద 2. ఆసురీ సంపద, దైవీ సంపద సద్గుణములకు, ఆసురీ సంపద దుర్గుణములకు స్థానము.

అసుర బాలుడైనను దైవీ సంపదయందు జన్మించిన వాడు గావున ప్రహ్లాదునకు సహజముగనే దైవీ సంపద గుణములు సంప్రాప్తమైనవి. భాగవతము నందలి యీ పద్యమును తిలకింపుడు.

సీ॥ తన యందు నఖిల భూతములందునొకభంగి
సమహితత్వంబున జరుగువాడు
పెద్దల బొడగన్న భృత్యునికైవడి
చేరి నమస్కృతుల్, సేయువాడు
కన్నుదోయికి నన్యకాంతలడ్డంబైన
మాతృ భావన సేసి మరలువాడు
తల్లిదండ్రుల భంగి ధర్మవత్సలతను
దీనుల గావ జింతించు వాడు

తే॥ సములయెడ సోదర స్థితి జరుపువాడు
దైవతములందు గురువుల దలచువాడు
లీలలందును బొంకులు లేనివాడు
లలిత మర్యాదుడైన ప్రహ్లాదుడధిప

ఆ॥ సద్గుణంబులెల్ల సంఘంబులై వచ్చి
యసుర రాజ తనయువందు నిలిచి
పాసి చనవు విష్ణు బాయని విధమున
నెమ్మి దగిలియుండు నిర్మలాత్మ

8. మతి

క॥ మతియన జెల్లున్ వేదవి
హిత పరణిన్ శ్రద్ధ మీఱ హితములరన్ సం
తతమున్ సమదృష్టిన్ స
న్మతితో వర్తించుటండ్రు మహితాత్ములిలన్ 22

వేద విధులయందు శ్రద్ధ కల్గియుండుట మతి యన బడుచున్నది. మరియు

శాస్త్రచింతనాదులచే గల్గు అర్థనిర్ణయ జ్ఞానము మతి.

జ్ఞాన సముపార్జనమునకు శ్రద్ధ, నిష్ఠ, ఇంద్రియ నిగ్రహము గల్గియుండుటావశ్యకము. శ్రద్ధ వినాపరమార్థతత్త్వ జ్ఞానమలభ్యము. శ్రద్ధా రహితుడగు మానవుడు దృశ్యమాన ప్రపంచమే సత్యమని భావించి, మరల మరల జనన మరణముల నొందుచు, ధర్మచ్యుతి వలన పతనము నొందును. ప్రాజ్ఞులగు మహనీయులు శాస్త్రాదులందు విశ్వాసము గల్గి, ఇహపర సుఖములనొంది, శాశ్వతానందము నొందవలసి యున్నది.

"శ్రద్ధా వీర్య స్మృతి సమాధి ప్రజ్ఞా పూర్వక ఇతరేషామ్"

శ్రద్ధయన యోగ విషయమున ప్రవర్తించు చిత్తము నిర్మలముగా నుండుట. ఇట్టి శ్రద్ధ శాస్త్ర పఠనము, ఆచార్యాద్యుపదేశము, అనుమానముల వలన తెలియబడిన వస్తువు విషయముననే ప్రవర్తించును.

"యోగి నామపి సర్వేషాం మద్గతే నాంతరాత్మనా
శ్రద్ధవాన్ భజతే యో మాం సమే యుక్తతమో మతః"

శ్రద్ధావంతుడై నాయందు చిత్తమును జేర్చి భజించువాడు యోగులలో నుత్తముడు. అని శ్రీకృష్ణ పరమాత్మ పలికినట్లు భగవద్గీతయందు కలదు.

9. జపము

క. జపమన గురువర్యునిచే
నుపదిష్టంబైన మంత్ర ముర్విన్ ద్వివిధం
బపవర్గ ప్రదమౌనా
జపమును వాచికము మానసం బండ్రు బుదుల్. 23

సద్గురువుచే నుపదేశింపబడిన మంత్రము నుచ్చారణ మొనరించుట జపము. ఈ జపము వాచికము, మానసికము అని రెండు విధములు, వేద పఠనము వాచిక జపము. గాయత్ర్యాది మంత్రావృతము మానసిక జపము. "యజ్ఞానాం జప యజ్ఞోస్మి" యజ్ఞములలో జపయజ్ఞము నేనే అని శ్రీకృష్ణ పరమాత్మ పలికినట్లు భగవద్గీతయందు గలదు. కావున జపమొక మహా యజ్ఞమని విదితమగు చున్నది. జపయజ్ఞముచే బహు జన్మ కృత దుష్కృతము నిర్మూలమై ఆత్మజ్ఞాన మతిశయిల్లును.

"స్నానం సంధ్యా జపోహోమ స్వాధ్యాయో దేవ పూజనం
ఆతిధ్యం వైశ్య దేవంచ సత్కర్మాని దినే దినే"
స్నానము, సంధ్యా వందనము, జపము, హోమము,
వేదాధ్యయనము, దైవపూజ, అతిథి సత్కారము,
వైశ్వ దేవము అను సత్కర్మలను మానవుడు
ప్రతి దినము నాచరించ వలయును. దీనినే నిత్య కర్మలందురు.

10. వ్రతము

ఆ॥ వేద విహితమైన విధి నిషేధాదుల
బ్రీతి నియతి ననుసరింప వలయు
నదియె వ్రతమటంచు నార్యులు పల్కుదు
రరయ వ్రతము భవ్యమౌను సతము. 24

వేదోక్త ప్రకారము విధి నిషేధాదుల యందు నియమము గల్గి యుండుట వ్రతము.

ఉపవాసాది పుణ్య కర్మానుష్ఠానము వ్రతము. వ్రతము వలన చిత్తశాంతి ఏర్పడును. వ్రతములనేకములు. పయో భక్షణ వ్రతము, ఏకాదశీ వ్రతము, ద్వాదశీవ్రతము శ్రావణమాస వ్రతము, కార్తీక వ్రతము, కాత్యాయనీ వ్రతము ఆదిగా గల వ్రతము లత్యంత విశిష్టత నొందియున్నవి.

1. పయో భక్షణ వ్రతము ఈ వ్రతమును ఫాల్గుణ మాసము శుక్ల పక్షము ప్రథమ దివసముననారంభించి పండ్రెండు దివసములు దనుక నొనరించ వలయును. పండ్రెండు దినములు పాలను ఆహారముగా గ్రహించ దగియున్నది. కనుక యీ వ్రతమునకు పయోభక్షణ వ్రతమని నామమేర్పడినది. ఈ వ్రతమును కశ్యప ప్రజాపతి పత్ని అదితి అతి భక్తి నియమముతో నొనరించి, శ్రీమహా విష్ణువును తనయునిగా వడసెను. అనగా శ్రీమహా విష్ణువు అదితి గర్భమున వామనుడై జన్మించెను. ఈ వ్రతమునకు మూల మంత్రము "ఓం నమో భగవతే వాసు దేవాయ".అని

2. ఏకాదశి వ్రతము - ఈ వ్రతము వ్రతములన్నిటిలో నుత్తమమైనది. ప్రతి మాసము నందే కాదశి తిథియందొనర్చు వ్రతముగాన ఏకాదశీ వ్రతము. సంవత్సర మంతయు నీ వ్రతము నాచరింప జాలని వారలు ఆషాఢ శుద్ధ ఏకాదశి, భాద్రపద శుద్ధ ఏకాదశి,

కార్తీకశుద్ధ ఏకాదశి యందైన నొనరింప వలయును. ఈ వ్రతాచరణము వలన రుక్మాంగదుడను రాజు నిజకాంతా కసహితుడై విష్ణు సాయుజ్యము నొందెను.

3. ద్వాదశీ వ్రతము - అంబరీషుడీ వ్రతమొనర్చి విష్ణ్వాను గ్రహము వలన సుదర్శన చక్రమును రక్షణముగా వడసి యుండెను.

4. కాత్యాయనీ వ్రతము - కాత్యాయనీ దేవిని గూర్చి యొనరించు వ్రతము గాన కాత్యాయనీ వ్రతమనబడుచున్నది. ఈ వ్రతమును ధనుర్మాసమునందా చరింపవలయును. గోపికలీ వ్రతమొనర్చి కృష్ణాను గ్రహమును వడసి. అభీష్టములను సిద్ధింప జేసికొనియున్నారు.

వ్రతము లతి పవిత్రములు. వ్రత విధానము వలన శారీరికముగను. మానసికముగను సుఖశాంతులు లభియించును. కావున మానవులకు వ్రతము లవశ్య మాచరణీయములు.

"కురుతే గంగా సాగర గమనం
వ్రత పరిపాలన మథవా దానమ్
జ్ఞాన విహీన స్సర్వమతే న
ముక్తిం న భజతి జన్మ శతేన"

మానవుడు గంగా సాగర సంగమమునందు స్నాన మాచరించినను, వ్రతములొనర్చినను, దానములు చేసినను జ్ఞాన విహీనుడై యున్నచో నూరు జన్మముల చేతను ముక్తిని పొందజాలడు. సమస్త మతములు యీ విషయమునే వివరించు చున్నవి.

మానవుడు వ్రతము లొనర్చిను జ్ఞాన మార్జింప వలెనని యిందలి భావము.

1. ఆసనము

తే. స్వస్తికంబును గోముక పద్మ వీర
కేసరీ భద్రముక్త శిఖీ యనంగ
నామముల నొప్పు నిలనాసనంబు లష్ట
విధములం(గాలు వాధ్యాత్మ విద్య కొఱకు. 25

స్వస్తికము, గోముఖము, పద్మము, వీరము, సింహము, భద్రము, ముక్తము, మయూరము అను నామములతో ఆసనములు ఎనిమిది విధములు.

ఆసనములు రెండు విధములుగా విభజింపబడినవి. ధ్యానాసనములు,

యోగా సనములు, అని ధ్యానమునకు, సమాధ్యవస్థకు ఆవశ్యకమగునవి ధ్యానాసనములు. శరీరనాడులు దృఢత్వము నొందుటకును మఱియు ఆరోగ్య సంరక్షణము కొఱకును పయుక్తమగున వియోగాసనములు. ఆధ్యాత్మిక విద్య కొఱకు ఆసనములన్నియు నావశ్యకములు కావు. ఉపయుక్తమగు ఆసనమును మాత్రమే అభ్యసింప వలసి యున్నది. పద్మాసనము ఎల్లరకునుపయుక్తము. ఆసన సిద్ధినొందినచో నాధ్యాత్మిక విద్య సులభ తరము. "శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసనమున్రితః ఆసనమందు స్థిరత్వము నొందవలెనని భావము. ఆసన స్థిరత్వము వలన మనస్సునకే కాగ్రత సిద్ధించును. తదుపరి ధ్యానా వస్థ యందు అంతః కరణశుద్ధి కల్గును. పిమ్మట ఆత్మసాక్షాత్కారము సౌలభ్యము.

"సుఖేనైవ భవేద్యస్మిన్ అజస్రం బ్రహ్మచింతనం
ఆసనం తద్వి జానీయాన్నేతరత్సుఖ నాశనమ్"

నిరతము బ్రహ్మ చింతన మొనర్చుటకు సుఖతర మగునది ఆసనము. సుఖానాశన మొనర్చు స్థితి ఆసనము కానేరదు.

"స్థిర సుఖ మాసనమ్" స్థిరమును సుఖమున్నైనది ఆసనము.

"తతో ద్వంద్వానభిఘాతః" ఆసన సిద్ధి వలన శీతోష్ణాది ద్వంద్వముల వలన బాధ కలుగనేరదు.

ఆసనములనేకవిధములు. గృహస్థులకు పద్మాసన సిద్ధాసనము లుత్తమములు.

"కుర్వత్తదాసనం స్థైర్య మారోగ్యం చాంగ లాఘవమ్"

ఆ సనము వలన స్థైర్యము ఆరోగ్యము, అవయవ లాఘవము కల్గును.

తే. సుస్థిరాసన పరునకు సులభతరము
బ్రహ్మ విద్యను సాధింప, బహుళ విషయ
రహిత మొనరించి చిత్తమున్ హృదయమందు
నిలిపి, స్వాంతంబునందాత్మ దలప వలయు 26

ఆసన స్థిరత్వము నొందిన వానికి ఆధ్యాత్మిక విద్య నభ్యసించుట సులభతరము, మఱియు విషయరాహిత్య మొనరించి, మనస్సును హృదయమందు నిలిపి, మనస్సునందాత్మను తలంప వలయును.

తే. సర్వ మాత్మమయంబని సముచితముగ
దలచి, బాహ్యాంతర విషయములను వీడి

జ్ఞాన రూపంబునొందిన జనులకెల్ల
శాశ్వతానందమొనరు నిస్సంశయముగ

సమస్తమునాత్మ మయమని భావించి, బాహ్య విషయచింతనను మఱియు నాంతర విషయచింతన ద్యజియించి జ్ఞాన స్వరూపము నొందిన మహితాత్ములకు శాశ్వతానందము సంశయ రహితముగా సమకూరును.

తే. అనల మందులయించును. ఘనరసంబు
సలిల మందున లయమగు సైంధవంబు
రీతి బరతత్త్వమందున చేతసంబు
లీన మొందుట నిక్కమౌ జ్ఞానమరయ. 28

అగ్నియందు కర్పూరము, జలమునందు లవణము లయమగు రీతిని,పరతత్త్వమునందు మానసము లీలమొందుట యదార్థమగు జ్ఞానము

క. ఏకాంత స్థానంబున
నేకాగ్రత మీఱధ్యాన నిరతిన్ విజ్ఞుల్
సాకారత సంపూర్ణని
రాకారత వెల్గు బ్రహ్మ నర్చింప వలెన్. 29

ప్రాజ్ఞులు ఏకాంత స్థలమున నేకాగ్రతో, ధ్యాన నిరతితో, సాకారత మఱియు పరిపూర్ణ నిరాకారత వెలుగొందు పరబ్రహ్మను పూజింప వలయును.

ఉ. ఒక్క ముహూర్త కాలమున నొప్పుగ జూపులు నాసికాగ్రమం
దక్కజమై చెలంగ పరమాత్మను చిత్తమునందు నిల్పినన్
గ్రక్కునవంత మొసకల కల్మషసంతతి, సంతసంబిలన్
విక్కువమైలభించు, మహనీయులకున్ సతతంబు బేర్మిమై. 30

ఒక ముహూర్త కాలమున దృష్టిని నాసికాగ్రమందు నిలిపి. పరమాత్మను చిత్తము నందు ధ్యానించిన మహితాత్ములకు, సమస్తదురితములు నశించి, సంతోషము సమకూరును.

౨. ప్రాణాయామము

క. యమ నియమాసన విధులం
గ్రమమున సాధనమొనర్చి కడువేడుక సం
యమ మొప్పన్ ప్రాణా యా
మమునొనరుప వలయు నిత్యమంచిత రీతిన్. 31

మానస సంకల్పములను నిరోధించిన ప్రాణాయామము సిద్ధించును.

యమ నియమములనత్యంత నిష్టతో ననుష్ఠించి, ఆసన స్థిరత్వము నొంది, తదుపరి ప్రాణాయామము నభ్యసింప వలసియున్నది. ఆసన ప్రాణాయామములను సద్గురువునుండియే అభ్యస్త మొనరింప వలయును.

ప్రాణాయామమన ప్రాణ వాయువును స్వేచ్ఛానుసారముగా పీల్చుటయు, విడచుటయు, బంధించుటయు గాక క్రమ బద్ధ మొనరించుట ప్రాణ వాయువు. అనగా మానవ శరీరమునందు చరించు వాయువు. "ప్రాణో2పానస్స మానశ్చోదాన వ్యానొచ వాయవః శరీరస్థా ఇమే" ప్రాణము, అపానము, సమానము, ఉదానము, వ్యానము అను పేర్లతో శరీరము నందలి వాయువు అయిదు విధములు, ఆ వాయువుయొక్క కృత్యమును మరియు. స్థానముల ననుసరించి యీ నామము లేర్పడినవి. ప్రాణవాయువునకు స్థానము హృదయము. ప్రాణాయామము వలన శరీరమునందలి నాడులు, రక్తము శుద్ధినొంది, శారీరికమగు ఆరోగ్యము లభియించును. హృదయము శక్తివంతమగును. బుద్ధి వికాస మేర్పడును.

నాసిక ద్వారా గాలిని పీల్చుట పూరకము ఆ విధముగా పీల్చిన గాలిని లోపల బంధించుట కుంభకము. ఈ రీతిగా లోపల బంధించిన గాలిని విడచుట రేచకము. ఈ మూడు క్రియలు కలసి ప్రాణాయామమనబడు చున్నది. ప్రాణాయామ విధానమును సమర్థుడైన గురువు నుండి గాక, స్వయముగా నభ్యసించినచో కొన్ని దుష్పరిణామము లేర్పడును. కనుక గురువు యొక్క సహాయమత్యావశ్యకము.

"ప్రాణాయామాది యుక్తేనసర్వరోగక్షయో భవేత్
యుక్తా భ్యాసేన యోగేన సర్వ సిద్ధి సముద్భవః"
ప్రాణాయామముచే సమస్త వ్యాధులు నిర్మూలమగును.
యుక్తితో నొనరించు సాధనచే యోగము సిద్ధించును.
"చిత్తాది సర్వభావేషు బ్రహ్మత్వేనైవ భావనాత్
నిరోధః సర్వ వృత్తీనాం ప్రాణాయామః స ఉచ్యతే"

చిత్తము మొదలుగా గల సర్వ భావములయందు బ్రహ్మ స్వరూపముచేత భావించుట వలన సర్వచిత్త వృత్తులు నిరోధింపబడును. అదియే ప్రాణాయామము.

ప్రాణాయామము నభ్యసించుటకు ముందుగా ఆసన సిద్ధినొందవలసి యున్నదని యీ సూత్రము వలన విదితమగుచున్నది.

"తస్మిన్ సతి శ్వాస ప్రశ్వా సయోర్గతి విచ్ఛేదః

ప్రాణాయామః (పాతంజలయోగ దర్శనము)

ఆ యాసన సిద్ధి చేకూరినచో శ్వాస ప్రశ్వాసముల యొక్క స్వాభావిక గమనమాగి పోవుట ప్రాణాయామము.

"చలో వాతం చలం చిత్తం నిశ్చలే నిశ్చలం భవేత్
యోగీ స్థాణుత్వ మాప్నోతి తతో వాయుం నిరోధయేత్"
షట్చక్ర శోధనం సమ్యక్ ప్రాణాయామస్య కారణం
నాశనం సర్వరోగాణాం మోక్ష మార్గస్య సాధనమ్॥

3. ప్రత్యాహారము

సీ॥ విషయాభిలాషకై విహరణ మొనరించు.
యింద్రియంబుల మరలించుటయును
దృగ్గోచరంబగు దృశ్యంబు లన్నియు
నాత్మ సమంబని నమ్ముటయును
నిత్య విహితమైన నిర్మల కర్మల
ఫలమును త్యజియించి మెలగుటయును
నిఖిల విషయ పరాఙ్ముఖత సుప్రశస్త
రీతి జీవన మొనరించుటయును

తే. పదియు నెన్మిది యై యొప్పు మర్మలందు
ధారణము సల్పుటయును ప్రత్యాహరణము
పంచ విధమౌచు దనరును భాసురముగ
నాత్మ విదులకు సమ్మతమది సతంబు. 32

ప్రత్యాహారము పంచ విధములు.

1. విషయములందు ప్రవర్తించు యింద్రియములను మరణించుట
2. కని పించిన దంతయు నాత్మమయమని తలంచుట
3. నిత్య విహిత కర్మల యొక్క ఫలమును త్యాగమొనర్చుట
4. సకల విషయ పరాఙ్ముఖత్వముతో జీవించుట
5. పదునెనిమిది మర్మస్థానముల యందు ధారణమొనర్చుట

ప్రత్యాహారము ధారణ ధ్యాన సమాధ్య వస్థలకు పూర్వమొనరించు క్రియ. ఆసన ప్రాణాయామ ప్రత్యాహారముల వలన ధారణ ధ్యాన సమాధ్యవస్థలు

సులభతరమగును. కనుక ప్రత్యాహార మత్యావశ్యకము.

ఇంద్రియములను విషయ సుఖముల నుండి మరల్చి, సక్రమ పద్ధతి నొనరింప వలయును. ఇంద్రియములు. పది. అందు జ్ఞానేంద్రియములు అయిదు. కర్మేంద్రియములు అయిదు. శ్రోత్రములు (చెవులు), చర్మము, నేత్రములు, జిహ్వా, నాసిక (ముక్కు), వాక్, హస్తములు (చేతులు), ఉపస్థ, పాయువు, పాదములు, "శ్రోత్రత్వక్ చక్షుర్జిహ్వా ఘ్రాణవాక్ హస్తోపస్థ పాయు పాదాః అని. చెవులు, చర్మము, నేత్రములు, జిహ్వా, ముక్కు జ్ఞానేంద్రియములు. వాక్, చేతులు, ఉపస్థ, పాయువు, పాదములు కర్మేంద్రియములు ఈ పది యింద్రియములకు విషయములీ విధముగా వివరింపబడినవి. చెవులకు శబ్దము, చర్మమునకు స్పర్శము, నేత్రములకు రూపము, జిహ్వాకు రసము, ముక్కునకు వాసన, వాక్కునకు సంభాషణము, చేతులకు గ్రహణము ఉపస్థకు ఆనందము, పాయువునకు మలోత్సర్జనము పాదములకు గమనము.

ఇంద్రియములను యింద్రియ విషయములనుండి మరలించవలెనని భగవద్గీతయందీ విధముగా పేర్కొనబడినది.

"ఇంద్రియాణాం హిచరతాం యన్మనోను విధీయతే
తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావ మివాంభసి"
"తస్మాద్య స్య మహాబాహో నిగృహీతాని సర్వశః
ఇంద్రియా ణీంద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా" (భగవద్గీత)

ఏరీతిగా వాయువు జలమునందలి నావను (చుక్కాని లేని నావను) పలు విధములుగా చలనమొనర్చునో ఆరీతిగా మనస్సు యింద్రియములందు చరించుచు, విషయ సుఖములంగూర్చి ప్రవర్తించినచో యా రెండు కలసి మానవుని యొక్క బుద్ధిని హరించును.

కావున 'ఏ మనుష్యుడు తన యింద్రియములను సమస్త ప్రకారముల యింద్రియ విషయముల నుండి మరల్చి వశమొనర్చు కొనునో ఆమనుష్యుని యొక్క బుద్ధి స్థిరత్వము నొందును.

"ఇంద్రియస్యేంద్రియ స్యార్థే రాగద్వే షౌవ్యవస్థితౌ
తయోర్న వశమాగచ్ఛేత్ తౌహ్యస్య పరిపంధినౌ" (భగవద్గీత)

ఇంద్రియములకును, ఇంద్రియ విషయములకును రాగ ద్వేషము లేర్పడియున్నవి. ఆరాగ ద్వేషములే మనుజుని యొక్క ఆధ్యాత్మిక జీవనమునకు

అవరోధము గల్గించు శత్రువులు. కావున ఆ రాగ ద్వేషములకు మానవుడు వశము కాకూడదు.

దృగ్గోచరమగునదంతయు నాత్మ సమానమని భావించుట మహితాత్ములగు మానవులకు సాధ్యము. దీనింగూర్చి భగవద్గీతయందీ విధముగా నుడువబడినది.

"సర్వ భూతస్థ మాత్మానం సర్వ భూతాని చాత్మని
ఈక్షతేయోగయుక్తాత్మా సర్వత్ర సమ దర్శనమ్"

యోగ సిద్ధులగు మహనీయులు, సమస్త భూతముల యందు ఆత్మను, ఆత్మయందు సమస్త భూతములను వీక్షించుచు సమ దర్శనము గల్గియుందురు.

కర్మ ఫలము నాకాంక్షింప వలదనియును, కర్మఫలములు ఈశ్వరా యత్తములనియును భగవద్గీత యందు కలదు.

"కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన
మా కర్మఫల హేతుర్భూః మాతే సంగో2స్త్వ కర్మణి"

మఱియు కర్మ ఫలమందా సక్తిని త్యజియించి. తృప్తి గలిగి, నిరాశ్రయుడై కర్మలను నిర్వహించ వలెనని వివరింపబడినది.

"త్యక్త్వా కర్మ ఫలాసంగం నిత్య తృప్తో నిరాశ్రయః
కర్మణ్యభి ప్రవృత్తోపి నైవకించిత్క రోతి సః"

సమస్త విషయములందు విముఖత్వము నొంద వలయును. అనగా కోరికలను త్యజియించ వలయును.

"విహాయ కామాన్ యస్సర్వాన్ పుమాంశ్చరతి నిస్పృహః
నిర్మమో నిరహంకారః పశాంతి మధి గచ్ఛతి"

ఏ మనుష్యుడు సంపూర్ణముగా కోరికలను త్యజియించి మమతా రహితుడై, అహంకార రహితుడై స్పృహా రహితుడై వర్తించునో ఆ మనుష్యుడు శాంతిని పొందు చున్నాడు.

పదు నెనిమిది మర్మ స్థానము లందు ధారణ మొనర్ప వలసి యున్నది.

"సుఖాను శయీ రాగః"

విషయ సుఖాను భవానంతరము అంతః కరణము నందేర్పడు అభిలాష రాగమన బడుచున్నది.

"దుఃఖాను శయీ ద్వేషః"

దుఃఖాను భవానంతరము అంతః కరణమునం గల్గు దుఃఖ విషయకమగు

క్రోధము ద్వేషమనబడుచున్నది.

రాగ ప్రతి రోధముచే ద్వేష మేర్పడును గాన తొలుత రాగమును పేర్కొని తదుపరి ద్వేష లక్షణము నుడువ బడినది.

కనుక దుఃఖమునకు హేతువగు రాగమును ప్రత్యాహారముచే నిర్మూలన మొనర్చినచో చిత్తమునందు ద్వేషమునకు స్థాన ముండనేరదు.

"విషయే ష్వాత్మతాం దృష్ట్వా మనసశ్చితి మజ్జనం
ప్రత్యాహారస్స విజ్ఞేయో2భ్యసనీయో ముముక్షుభిః"

సర్వ విషయములయందు ఆత్మభావమును సమీక్షించి మనస్సును మజ్జన మొనరించుటయే ప్రత్యాహారము. ఇది ముముక్షువులచే అభ్యసనీయము.

4. ధారణ

ఆ. మనసు నాత్మయందు, బహిరాంబరంబును
దహర నభమునందు, దనర చేత
సంబు భూత పంచకం బందు, నిల్పుట
ధారణంబు త్రివిధ మైరహించు. 33

ధారణ యనగా ! భగవంతుడు వినా మఱియొకటి తెలియనిది.

ధారణ మూడు విధములు. ఆత్మ యందు మనస్సును, దహరాకాశమునందు బహిరాకాశమును, పంచ భూతముల యందు మనస్సును నిల్పుట.

దహరాకాశమన హృదయాకాశమని అర్థము. ఆధ్యాత్మిక విద్యయందు ఆకాశపంచకమని పేర్కొనబడినది.

1. గుణ రహితాకాశము, 2. పరాకాశము, 3. మహాకాశము, 4. తత్త్వాకాశము, 5. సూర్యాకాశము అని ఈ అయిదు ఆకాశములు హృదయాకాశమునందు గనుగొన బడును అందు ప్రథమమున హృదయాకాశమునందు ఆకార రహితమైన గుణ రహితాకాశము గోచరించును. తదుపరి దట్టమైనదియు, కఠిన మైనదియు, అవకాశ శూన్యమైనదియు, గాఢాంధ కార మైనదియు నగు పరాకాశము కనుపట్టును. తదనంతరము ప్రళయకాలమునందు ప్రజ్వలించు చున్న జ్వాలల చేత భయంకరమైన దావానలా కారం బైన మహా కాశము గోచరించును. పిమ్మట బహువిధ విచిత్ర వర్ణములు గలవియును అంతట వ్యాపించి నదియును, అపరిమిత కాంతులనే భరితమైనదియునగు తత్త్వాకాశము కనుపించును. తదుపరి ప్రచండ

భాను మండల ముల యొక్క శతకోటి కాంతులచే ప్రకాశించు చున్న సూర్యా కాశము గోచరించును. ఈ పంచాకాశములను సద్గురూపదేశము ప్రకారము వీక్షించ వలసి యున్నది. ఈ విధముగా పంచాకాశములను వీక్షించిన యోగికి అఖండ జ్ఞాన ముదయించును. ఈ యఖండ జ్ఞానము వలననే బ్రహ్మాండ పిండాండములను గనుగొను శక్తి లభియించును.

"యత్ర యత్ర మనోయాతి బ్రహ్మణస్తత్ర దర్శనాత్
మనసో ధారణం చైవ ధారణా సా పరామతా"

ఏ ప్రదేశమునందు మనస్సు సంచరించునో ఆ ప్రదేశమునందు బ్రహ్మ సాక్షాత్కార దర్శనము వలన మనస్సును స్థిరమొనరించు కొనుటయే ప్రశస్తమైన ధారణ.

"దేశ బంధశ్చిత్తస్య ధారణా" చిత్తమునకు ఏదియేని యొక ప్రదేశము తోడ సంబంధము ధారణ.

5. ధ్యానము

క. సగుణము నిర్గుణమనగన్
భగవద్ధ్యానంబు ద్వితయ భంగిం బరగున్
సగుణము మూర్తి ధ్యానము
నిగరంబగు యాత్మ దృష్టి నిర్గుణ మరయన్. 34

ధ్యానము రెండు విధములు. సగుణ ధ్యానము, నిర్గుణ ధ్యానము అని. మూర్తి ధ్యానము సగుణము. ఆత్మ యొక్క యదార్థ రూపమును గూర్చి ధ్యానించుట నిర్గుణము.

నామ రూప గుణ రహితుడైన భగవంతునకు నామ రూప గుణములం గల్పించి, ధూప దీప నైవేద్యాదులతో, షోడశోప చారములతో, కేశవాది నామములతో, అష్టోత్తర శత నామములతో, సహస్ర నామములతో భక్తియుక్తముగా నర్చించి, ధ్యానించుట సగుణ ధ్యానము.

షోడ శోప చారములనగా పదునారు ఉపచారములు	
1. ఆవాహనము	9. గంధము
2. ఆసనము	10. పుష్పము
3. పాద్యము	11. ధూపము
4. అర్ఘ్యము	12. దీపము
5. ఆచమనీయము	13. నైవేద్యము
6. స్నానము	14. తాంబూలము
7. వస్త్రము	15. ప్రదక్షిణము
8. యజ్ఞోపవీతము	16. నమస్కారము

ఈ రీతిగా నొనరించిన పూజను షోడశోపచార పూజయని పేర్కొనుచుందురు.

నామ రూప గుణ రహితుడైన భగవంతుని, నామరూప గుణ రహితునిగా చిత్తము నందూహించి, సమస్తము భగవన్మయమని తలంచి అర్చించుట నిర్గుణ ధ్యానము.

నిర్గుణ ధ్యాన సంయుతుడగు మానవుడు సర్వము నాత్మమయంబని తలంచుచు, సమభావముతో, సమదర్శినుడై సంచరించును. కావుననే భగవద్గీత యందు

"విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని
శుని చైవ శ్వపాకేచ పండితాస్సమ దర్శినః"

అని నుడువబడినది. సమ భావము కేవలము మానవులయందే గాక, సర్వ జీవ సముదాయమునందు గల్గియుండవలెనని అర్థము. సర్వ జీవులయందు తన ఆత్మను, సమస్త జీవుల యందలి ఆత్మను తన ఆత్మగను వీక్షించిన మహాత్ములు పరిపూర్ణ జ్ఞానవంతులు. ఇదియే యదార్థమగు నిర్గుణ తత్త్వము.

"సర్వ భూత స్థమాత్మానం సర్వ భూతాని చాత్మని
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః" (భగవద్గీత)

సకల జీవులయందు ఆత్మను, ఆత్మ యందు సకల జీవులను,

సమదర్శనుడగు యోగి గాంచు చున్నాడు.

దృశ్య మాన సకల ప్రపంచము, సర్వ జీవ సముదాయము ఆత్మయందధిష్ఠానమై యున్నది. ఆత్మకును, ఆత్మకును విభేదమును గాంచుట అశాంతికి హేతువు. సమస్తము నాత్మమయంబని భావించిన మహా నీయులకు పరిపూర్ణ కారుణ్యము సర్వ భూత సమహితత్వము సమకూరును ఈ విధమగు నాత్మజ్ఞానము నొందుటయే నిర్గుణ ధ్యానము.

"వేదా శ్రేష్టా స్సర్వ యజ్ఞ క్రియాశ్చ
యజ్ఞాజ్జప్యం జ్ఞానమాహుశ్చ జప్యాత్
జ్ఞానాద్ధ్యానం సంగరాగవ్యపేతం
తస్మిన్ ప్రాప్తే శాశ్వత స్యోపలబ్ధిః

వేదములు, యజ్ఞములు శ్రేష్ఠములు. యజ్ఞముల కంటె జపము, జపము కంటె జ్ఞానము, జ్ఞానము కంటె సంగరహితమైన ధ్యానము శ్రేష్ఠము. ధ్యానము సిద్ధించినచో శాశ్వత పరబ్రహ్మ తత్త్వము సిద్ధించును.

ప్రాణాయామైర్దహేద్దోషాన్ ధారణాభిశ్చ కిల్బిషం
ప్రత్యాహారేణ సంసర్గాన్ ధ్యానేనానీశ్వరాన్ గుణాన్

ప్రాణాయామముచే దోషములు (శారీరిక మానసిక దోషములు) తొలంగును. ధారణచే పాపము నిర్మూలమగును. ప్రత్యాహారముచే సంసర్గములు (ఇంద్రియవృత్తులు) నశించును. ధ్యానముచే ఈశ్వరత్వము సిద్ధించును.

"నాస్తి ధ్యానం వినాజ్ఞానం నాస్తిజ్ఞానమయోగినః
"ధ్యానం జ్ఞానంచయస్యాస్తి తీర్ణస్తేన భవార్ణవః

ధ్యానము వినా జ్ఞానము సంభవము కానేరదు. జ్ఞానము లేనిచో ధ్యానయోగము సిద్ధించదు. ఎవరికి జ్ఞాన ధ్యానములు సిద్ధించునో వారిచేత సంసార సాగరము తరింపబడుచున్నది.

"నాస్తి ధ్యాన సమంతీర్థం నాస్తిధ్యాన సమం తపః
నాస్తి ధ్యాన సమో యజ్ఞః తస్మాద్ధ్యానం సమాచరత్"

తీర్థములు, తపస్సు, యజ్ఞము, ధ్యానమునకు సమానములు గానేరవు, కావున ధ్యానము నాచరించ వలసియున్నది.

"బ్రహ్మైవాస్మీతి సద్వృత్త్యా నిరాలంబతయా స్థితిః
ధ్యాన శబ్దేన విఖ్యాతా పరమానంద దాయినీ"

"అహం బ్రహ్మాస్మి' అను సద్వృత్తితో గూడిన పరమానందము నొన గూర్చు నిరాలంబ స్థితి ధ్యానము.

"శ్రేయోహి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే
ధ్యానా త్కర్మ ఫలత్యాగః త్యాగాచ్ఛాంతిర నంతరమ్" (భగవద్గీత)

వివేక రహితమగు సాధనకంటె పరోక్ష జ్ఞానము శ్రేష్ఠము. పరోక్ష జ్ఞానము కంటే ధ్యానము విశిష్టము. ధ్యానము కంటె కర్మ ఫలత్యాగము మేలు. అనంతరము కర్మ ఫలత్యాగము వలన లభించు పరమశాంతి యీ త్యాగము కంటె ఉత్తమము.

పరోక్ష జ్ఞాన మనగా! శ్రవణము వలనను, శాస్త్ర పఠనము వలనను పరమేశ్వరుని యొక్క స్వరూపమును తెలిసి కొనుట. దీనిని అనుమాన జ్ఞానమనియు ప్రాజ్ఞులు పేర్కొను చున్నారు.

ఈ శ్లోకమునందు ధ్యానమున కత్యంత ప్రాధాన్యత పేర్కొనబడినది. కావున ధ్యాన మతి విశిష్టము.

6. సమాధి

ఆ. త్రిపుటి రహిత మైన స్థిర పరమానంద
రూప శుద్ధ చేతనా పరంబు
స్థితిని గల్గియుండు గతియును, పరమాత్మ
దేహి యైక్య మైన స్థితి సమాధి. 35

త్రిపుటి రహిత పరమానంద శుద్ధ చైతన్యా త్మకము సమాధి. పరమాత్మ జీవాత్మల యొక్క ఐక్యా వస్థ సమాధి.

ధ్యానా నంతరము సమాధి స్థితి వివరింపబడినది. సమాధి స్థితి నొందుటకు వరుసగా ప్రాణాయామ ప్రత్యాహార ధారణ ధ్యానము లత్యా వశ్యకములని విదిత మగుచున్నది. సమాధి స్థితి నొందుట యనగా పరిపూర్ణ యోగ సిద్ధినొందుటయే.

నిర్గుణ ధ్యానముచే పరమాత్మ జీవాత్మలు యైక్యత నొందుట సమాధి స్థితి యని గ్రహించ దగియున్నది.

ఆధ్యాత్మిక పరిభాషయందు త్రిపుటి యొక్క నిర్వచన మీ విధముగా కలదు.

కర్త - కారణము - కార్యము
జ్ఞాత - జ్ఞేయము - జ్ఞానము
ద్రష్ట - దృశ్యము - దర్శనము

దీనిని త్రిపుటి యందురు. దీనికి అతీతమైనచో త్రిపుటి రహిత మగును. త్రిపుటి రహిత మైనచో పరమానంద శుద్ధ చైతన్య మేర్పడును. అదియే సమాధి.

సమాధ్య వస్థ త్రివిధ పరిచ్ఛేదము, అనంతము, అఖండ జ్ఞాన స్వరూపము, అత్యుత్తమ తత్త్వము, వికల్ప రహితము.

వ్యాకరణ భాషలో త్రిపుటి యన కర్తృ, కర్మ క్రియలు, అనగా తెలియువాడు, తెలియబడునది, తెలియుట, ఇది ద్వైత ప్రపంచమునందు కలదు కాని అద్వైతమునందు లేదు.

"జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయ శూన్య మనంతం నిర్వికల్పకమ్
కేవలా ఖండ చిన్మాత్రం పరం తత్త్వం విదుర్బుధాః"

సగుణ నిర్గుణ సమాధి స్థితులనేక విధములు.

1. మూర్తి రూప ధ్యానము - భావ సమాధి.
2. గుణ ధ్యానము - సవికల్ప సమాధి.
3. నామ రూప గుణాతీత ఆనంద ధ్యానము నిర్వి కల్ప సమాధి.
4. ఆనందాతీతమైనది - అసంప్రజ్ఞాత సమాధి.

"నిగమాచార్య వాక్యేషు భక్తి శ్రద్ధేతి విశ్రుతా
చిత్తై కాగ్ర్యంతు సల్లక్ష్యే సమాధానమితిస్మృతమ్"

వేద శాస్త్రములయందు, ఆచార్య వాక్యములయందు గల భక్తి శ్రద్ధ అని పలుక బడుచున్నది. యదార్థమైన లక్ష్యమునందు చిత్తమును ఏకాగ్రమొనర్చుట సమాధానము లేక సమాధి.

"ధ్యాతృ ధ్యానే పరిత్యజ్య క్రమా ద్ధ్యేయైక గోచరం
నివాత దీప వచ్చిత్తం సమాధి రభి ధీయతే"

ధ్యానము జేయు వాడను భావము ధ్యానము అను యీ రెండును నశించి, క్రమముగా మనస్సంతయు ధ్యేయా కారమై, గాలి లేని దీపము భంగి చలన రహితమై యుండుట సమాధి యనబడు చున్నది.

"నిర్వి కారతయా వృత్త్యా బ్రహ్మా కారతయా పునః
వృత్తి విస్మరణం సమ్యక్ సమాధిః జ్ఞాన సంజ్ఞకమ్"

నిర్వికార బ్రహ్మాకార వృత్తిచే నన్య భావ విస్మరణమే జ్ఞాన సమాధి.

"సలిలే సైంధవం యద్వత్ సామ్యం భవతి యోగతః
తథాత్మ మనసోరైక్యం సమాధి రభిధీయతే"

జలమునందు లవణము సామ్యము నొందు విధముగ నాత్మ మనస్సు లైక్యత నొందుట సమాధి.

బ్రహ్మము

క. సత్యము విజ్ఞానంబును
నిత్యంబవ్యక్త మగుచు నిర్వాణదమై
అత్యంతము భాసిల్లు వి
రత్యయమగు బ్రహ్మ జగతి రహియించు వాగిన్. 36

సత్యము, విజ్ఞానము, నిత్యము, అవ్యక్తము నిర్వాణ ప్రదమునై విలసిల్లునది బ్రహ్మము. సర్వ జగత్తు ఆ బ్రహ్మమునందే యున్నది.

"సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" బ్రహ్మము సత్యస్వరూపము, జ్ఞాన స్వరూపము, అనంత త్రివిధపరిచ్ఛేద శూన్యము.

"దృశ్యతే శ్రూయతే యద్వత్ బ్రహ్మణోన్యత్ నతద్భవేత్" ఏది కనుగొనబడుచున్నదో, ఏది వినబడుచున్నదో, అది బ్రహ్మము కంటె అన్యము కాదు.

నామ రూప గుణ రహితము, ఆకార శూన్యము నైనది బ్రహ్మము. ఈ దృశ్యమాన ప్రపంచమంతయు, బ్రహ్మము నుండే యుద్భవించి, బ్రహ్మమునందే లీనమగు చున్నది. విష్ణు సహస్ర నామములయందు పరమాత్మ యొక్క నామములు విశ్వం, జన్మ మృత్యుజరాతిగ, ఆత్మయోని, స్వయం జాత అని వివరిపబడినది.

"అనేక బాహూదర వక్త్రనేత్రం
పశ్యామిత్వాం సర్వతోనంతరూపం
నాంతం నమధ్యం నపునస్తవాదిం
పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప"

విశ్వేశ్వర! విశ్వరూప! నిన్ను సర్వత్ర అనేక బాహువులు, ఉదరములు, వదనములు, నేత్రములు గలవానిగను, అనంత రూపుని గను, గాంచు చున్నాను నీయొక్క ఆది గాని, మధ్యముగాని, అంతముగాని వీక్షించ జాల కున్నాను. అని అర్జునుడు శ్రీకృష్ణ పరమాత్మను గూర్చి పలికి నట్లు భగవద్గీతయందు కలదు.

క. బ్రహ్మాన్వేషణ పరునకు
బ్రహ్మత్వము సులభతరము పరిపూర్ణుండౌ
బ్రహ్మ జ్ఞానికి నిఖిల
బ్రహ్మాండం బవగతంబు పరికింపంగన్, 37

బ్రహ్మమును గూర్చి తెలిసి కొనిన మహానీయునకు బ్రహ్మత్వము సౌలభ్యము.

పరిపూర్ణ బ్రహ్మజ్ఞానికి సమస్త బ్రహ్మాండము తెలియ బడుచున్నది. "బ్రహ్మవిత్ బ్రహ్మ ఏవ భవతి, బ్రహ్మమును గూర్చి తెలిసికొనిన వారలు బ్రహ్మమే అగుచున్నారు.

అన్య విద్యా పరిజ్ఞాన మవశ్యం నశ్వరం భవేత్
బ్రహ్మ విద్యా పరిజ్ఞానం బ్రహ్మ ప్రాప్తికరం భవేత్"

చ. కరములు పాదముల్ కనులు కర్ణములున్ గాత్రమున్
విరహితమై నిరంతరము విశ్రుతమై తగగ్రాహ్య బాహ్యమై
బరగెడు బ్రహ్మ కేవలము ప్రశ్రిత లభ్యము బ్రహ్మనుండియే
యురవుగ జ్ఞాన దృష్టియుద యించును బ్రహ్మమె మూల మిమ్మహిన్. 38

బ్రహ్మము హస్తములు, పాదములు, నేత్రములు, శ్రోత్రములు జిహ్వ, శరీరము లేనిది. గ్రాహ్యము కానిది. జ్ఞానము చేతనే తెలియ దగినది. బ్రహ్మము నుండియే జ్ఞాన దృష్టి సంభవించును. అబ్రహ్మము సర్వమునకు మూలము.

పరబ్రహ్మము సర్వజగదా ధారము సమస్త జీవులు బ్రహ్మము నుండి యుద్భవించి మరల బ్రహ్మమునందే లయమగుచున్నవి. అ సంఖ్యాక మగు రూపములు, అసంఖ్యాకమగు అవయవములు, అసంఖ్యాకమగు నామములు గల్గి శాశ్వతుడైన బ్రహ్మమును గూర్చి తెలిసికొనుట జ్ఞాన దృష్టి చేతనే సాధ్యము.

"నమోఽస్త్వనంతాయ సహస్ర మూర్తయే
సహస్ర పాదాక్షి శిరోరు బాహవే
సహస్ర నామ్నే పురుషాయ శాశ్వతే
సహస్ర కోటీ యుగధారిణే నమః"

ఇందు వివరింపబడిన సహస్ర శబ్దమునకు అసంఖ్యాకమని అంతరార్థము.

క. ఏకంబద్వికమై సత
మాకాశము భంగి సర్వ మా సాదితమై
ఏ కాకృతి విలసితమై
శ్రీకరమై బ్రహ్మ చిరము స్థిరమై నిలచున్. 39

బ్రహ్మము ఏకమైనది. అద్వితీయమైనది. ఆకాశము వలె సర్వగతమైనది. ఏకాకృతితో విరాజిల్లునది. శ్రీకరము, చిరము, స్థిరము నైనది.

లోకంబులు లోకేశులు
"లోకస్థులు దెగిన తుది నలోకంబగు పెం
జీకటి కవ్వల నెవ్వం
డేకాకృతి వెలుగు నతనినే సేవింతున్ " (ఆంధ్రమహా భాగవతము)

లోకములు, లోకములను పాలించు ప్రభువులు లోకమునందు నివసించు సర్వ జీవ నివహము అంతమొందిన పిదప అంధకార బంధురమైన తదుపరి ఏకాకృతితో విరాజిల్లు నదియే బ్రహ్మము.

"యచ్చక్షుషా నపశ్యతి యేన చక్షూంషి పశ్యతి
తదేవ బ్రహ్మ త్వ విద్ధి.

ఏది సామాన్య నేత్రములచే గను గొనబడదో దేనిచే నేత్రములు చూడ గల్గు చున్నవో అదియే బ్రహ్మమని తెలిసి కొనుము.

"జాతి నీతి కుల గోత్ర దూరగం నామ రూప గుణ దోష వర్జితం
దేశ కాల విషయాతివర్తియత్ బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని"
"ఏకమేవ సదనేక కారణం కారణాంతర నిరాస కారణం
కార్య కారణ విలక్షణం స్వయం బ్రహ్మ తత్త్వ మసి భావయాత్మని"
"విలక్షణం యథాధ్వాంతం లీయతే భానుతే జసి
తద్వైవ సకలం దృశ్యం బ్రహ్మణి ప్రవిలీయతే"

ఏ రీతిగా సూర్య తేజస్సు నందు, విలక్షణ మైన తమస్సు లయించు చున్నదో, ఆరీతిగానే సకల దృశ్యము బ్రహ్మమునందే లీనమగు చున్నది.

అక్షరం పరమం బ్రహ్మ నిర్విశేషం నిరంజనం"

దేశ కాల వస్తు పరిచ్ఛేద శూన్యము. స్వజాతీయ విజాతీయ స్వగత భేద రహితము.

క. సర్వ జ్ఞుని సర్వేశుని
సర్వాంతర్యామి సర్వ జగదాధారున్
నిర్వాణ ప్రదు నిర్మలు
గీర్వాణుం బ్రణుతి జేయ గిల్బిషమడగున్ 40

సర్వజ్ఞుడు, సర్వేశ్వరుడు, సర్వాంతర్యామి, సర్వ జగత్తునకు నాధారుడు, నిర్వాణ ప్రదాయకుడు నైన బ్రహ్మమును గూర్చి నుతించినచో పాపములు నిర్మూలమగును.

భూత భవిష్య ద్వర్త మానములం గూర్చి సంపూర్ణముగా తెలిసిన వాడు గావున సర్వజ్ఞుడు. సకల ప్రపంచమునకు ప్రభువు గాన సర్వేశ్వరుడు. సమస్తమునందు పరిపూర్ణముగా నిండియున్నవాడు గావున సర్వాంతర్యామి నిఖిల జగత్తునకు ఆధారమైనవాడు గావున సర్వ జగదా ధారుడు, నిశ్రేయ సానందము నొన గూర్చువాడు గావున నిర్వాణ ప్రదుడు. మల రహితుడు గావున నిర్మలుడు. అట్టి పరబ్రహ్మమును గూర్చి వినుతించినచో పాపములంతరించి పోవుట సంశయ రహితము.

పరబ్రహ్మమునకు భగవచ్ఛబ్దము కలదు. కావుననే భగవచ్ఛబ్దము యొక్క నిర్వచనమీ విధముగా శాస్త్రమునందు నిర్దేశింపబడినది.

"ఉత్పత్తిం ప్రలయం చైవ భూతానామాగతిం గతిమ్
వేత్తి విద్యామ విద్యాంచ సవాచ్యో భగవానితి"

పంచ భూతాత్మకమగు జీవుల యొక్క ఉత్పత్తి లయములను, గమనా గమనములను, విద్యా విద్యలను, తెలిసినవాడు గావున భగవానుడు. లేక

"ఐశ్వర్య స్య సమస్తస్య ధర్మస్య యశస శ్రియః
జ్ఞాన వైరాగ్య యోశ్చైవ షణ్ణాం భగ ఇతీరణా"

అష్టైశ్వర్యములు, ధర్మము, యశస్సు, సంపద జ్ఞానము, వైరాగ్యము, అను యీ ఆరు గుణములు గలవాడు భగవానుడు.

పర బ్రహ్మ నిర్వికారుడు. కావుననే జన్మించుట, ఉండుట, పరిణామము నొందుట, వృద్ధినొందుట, క్షీణించుట, నశించుట అను షడ్విధ భావ వికారములు లేని వాడు.

"బ్రహ్మణ్యో బ్రహ్మకృత్ బ్రహ్మ బ్రహ్మ బ్రహ్మ వివర్ధనః
బ్రహ్మవిత్ బ్రాహ్మణో బ్రహ్మీ బ్రహ్మజ్ఞో బ్రాహ్మణ ప్రియః"
(విష్ణు సహస్ర నామ స్తోత్రము)

ఆ. సిద్ధ సేవితుండు శ్రితజన వరదుండు
జ్ఞాన యోగ నిధియు సర్వసాక్షి
విశ్వ గురువు యోగి వినుతుండు విమలుండు
దేవ దేవుడొసగు దివ్యపదవి. 41

సిద్ధులగు మహనీయులచే సేవింప బడువాడు, ఆశ్రిత జన వరదాయకుడు, జ్ఞాన యోగమునకు నిధి వంటి వాడు, సమస్తమునకు సాక్షియైనవాడు, జగత్తునకు గురువు, యోగి జన సన్నుతుడు, విమలుడు, దేవ దేవుడు నైన పరబ్రహ్మ దివ్య పదవి నొసంగును.

ఆత్మ సాక్షాత్కారము నొందిన మహాత్ములచే సేవింపబడు వాడు గావున సిద్ధ సేవవితుడు. ఆశ్రిత జనులకు అభీష్టముల నొసంగు వాడు గావున శ్రితజన వరదుడు. జ్ఞాన యోగమునకు నిధివంటివాడు గావున జ్ఞాన యోగ నిధి. నిధులు తొమ్మిది పద్మము, మహా పద్మము, శంఖము, మకరము, కచ్ఛపము, ముకుందము, కుందము, నీలము, వరము, ఇవియే నవనిధులు, సకలమునకు సాక్షియైన వాడు గావున సర్వసాక్షి, సాక్షియన ఏదేని యొక కార్యమును కనిగాని వినిగాని తెలిసినవాడు. సాక్షులు పదునొక్కండ్రు. అందు కృత సాక్షులు ఏవురు. అకృత సాక్షులు అర్వురు. అకృత సాక్షులనగా నిర్ణయించు కొనబడని సాక్షులు. అకృత సాక్షులనగా

నిర్ణయించుకొనబడని సాక్షులు సర్వ జగత్తునకు గురువుగాన విశ్వగురువు. యోగి వంద్యుడు గాన యోగి వినుతుడు. దోషరహితుడు మఱియు నిర్మలమైన వాడు గావున విమలుడు. అట్టి దేవదేవుడు దివ్య పదవి నొసంగును. అనగా స్వర్గ సంబంధమగు ఉన్నతి స్థితి నొసంగునని భావము.

"యోగరతో వా భోగరతో వా

సంగరతో వా సంగ విహీనః

యస్య బ్రహ్మణి రమతే చిత్తం

నందతి నందతి నందత్యే వ"

ఏ మానవుని యొక్క చిత్తము తత్త్వము అన్నిటి కంటె పరమోత్కృష్టమగు పరబ్రహ్మమందు లగ్నమై వినోదించుచుండునో, అట్టి మానవుడు యోగమునందను రక్తి గలవాడైనను లేక భోగము నందను రక్తి గలవాడైనను, బంధుమిత్రాదులందా సక్తి కల్గిన వాడైనను, బంధు మిత్రాదులందా సక్తి లేని వాడైనను నిరంతరము ఆనందమునే పొందుచుండును.

"బాలస్తావ త్క్రీడా సక్తః

తరుణ స్తావత్తరుణీ సక్తః

వృద్ధ స్తావచ్చింతా సక్తః

పరమే బ్రహ్మణి కోపి నసక్తః"

బాలుడు క్రీడలయందా సక్తి గలవాడగును తరుణ వయస్సు గలవాడు తరుణుల యందాసక్తి గల వాడగును కాని పరబ్రహ్మను గూర్చి చింతించు బుద్ధి కలుగదు.

పర బ్రహ్మను గూర్చి తెలిసికొనుట మానవుడు బాల్యము నుండియే అభ్యాసమొనరింపవలెనని యిందలి భావము.

★★★

ఉ. జ్ఞాన విధాన వేద్యమయి నామము రూపము శూన్య మౌచుయో

షావరషండ వర్జ్యమయి సర్వ జగత్తున కాదిహేతువై

మానిత రీతి నాద్యమును మధ్యమునంతము లేక సర్వమున్

దానయి వెల్గు బ్రహ్మము సదా శుభముల్ సమకూర్చు గావుతన్.

సర్వం శ్రీ పరబ్రహ్మార్పణ మస్తు



ఓం తత్ సత్



★★★